



ఆంధ్రసచిత్రవార

పత్రిక


27-1-67


జానపద చిత్రాలలో మేటి చిత్రం.
విశ్వశాంతి వారి
దర్శకత్వం
C.S. రావు, B.A(L.N)
నిర్మాత
U. విశ్వేశ్వరరావు, B.Sc.
సంగీతం.. K.V. మహదేవన్
BRP

మీ మొదటి మూడు ఉచిత పుస్తకాలూ ఈ క్రింది వాటినుండి ఎన్నుకోండి!



F 58
విరిగిన కలలు
జనమంచి రామకృష్ణ
ఒక కుటుంబం కోరి కన్న వాటిలో విరిగిన కొన్ని కలలను వివరించే విశిష్ట నవల.



F 59
విడీవిడని చిక్కులు
వీరాజీ
సంసారంలో పొటమరించి, అటుపోటులకు అగ్గలమై, విడీవిడని చిక్కులను చిత్రించే వీరాజీ మరొక నవల.



F 60
హుసేన్ సాగర్
రేవనూరి శమంత
హృదయాన్ని కరిగించే శక్తినీ, కరుణను నిష్పత్తి చేసే ప్రభావాన్నీ హుందాగా, హుషారుగా ప్రదర్శించే ఇంచక్కని కథలు.




F 61
రాగంలో రంగులు
ఇల్లిందల సరస్వతీదేవి
గృహ జీవితంలో వివిధ మట్టాల్లో వ్యక్తమయ్యే స్త్రీల మనః ప్రవృత్తులను వివిధ దృక్పథాల్లో ప్రదర్శించే పండ్రెండు పాఠ్యనాటికలు.




F 62
అక్షరాల గవాక్షాలు
డా॥ సి. నారాయణరెడ్డి
అకాడమీ అవార్డు అందుకొన్న ఆంధ్రమహాకవి విశ్వవిలోకనాన్ని, విశ్వవిజ్ఞానాన్ని విశదపరిచే అభినవ కవితాసంపుటి.



F 63
అర్ధాంగి
ఉన్నవ విజయలక్ష్మి
ఆంధ్ర సచిత్ర వారపత్రికలో ఆమధ్య ధారావాహికంగా వెలువడి, విశాలాంధ్రుల శేషాంధ్రులన్న అలరించిన అద్భుత నవల.



ఫిబ్రవరి 15 లోగా చేరితే ప్రత్యేక ఉచిత బహుమతి



బాపూ చిత్రాలంకరణ

సాహిత్య అకాడమీ అవార్డు అందుకొని, రెండో ముద్రణకూ ఎక్కి, అందరినీ ఉబ్బితబ్బిబ్బు చేసి, తరువాయి ముద్రణకూ ఎదురుచూస్తున్న 'అత్తగారి కథలు' నంబర్ వన్‌కు తదనంతర కథలు.

చందా కట్టే విధానం

1. పైన ఇచ్చిన ఆరు ఉచిత పుస్తకాల జాబితానుంచి మీకు నచ్చిన 3 పుస్తకాలు ఎంచుకొని క్రిందికూపనులో ఆ నంబరు గుర్తుపెట్టండి.
2. పూర్తిచేసిన కూపనూ, మొదటి నెల చందా రూ. 6 లకు మనియార్డరూ—రెండూ దిగువ అడ్రసుకు పంపండి.

'ఇంటింటా స్వంతగ్రంథాలయం' ప్రణాళిక,
ఆంధ్రప్రదేశ్ బుక్ డిస్ట్రిబ్యూటర్సు, రాష్ట్రపతిరోడ్డు, సికిందరాబాదు.

3. తరువాత నెల నెలా రూ. 5 వంతున ఆయా నెల ఆఖరులోగా, చందా మొత్తం రూ. 60 పూర్తి అయేదాకా పై అడ్రసుకు పంపుతూ ఉండాలి.

ఆంధ్రప్రదేశ్ బుక్ డిస్ట్రిబ్యూటర్సు, రాష్ట్రపతిరోడ్డు, సికిందరాబాదు

అయ్యా. మీ 'ఇంటింటా స్వంతగ్రంథాలయం' ప్రణాళికకు నన్ను ఒక చందాదారుగా చేర్చుకొనగోరుతున్నాను. మొదటి నెల చందా రూ. 6 లూ మనియార్డరు ద్వారా పంపినాను. తొలివిడత ఉచిత పుస్తకాలు మూడూ ఈ క్రింద గుర్తించిన (✓) నంబర్లవి పంపగోరుతున్నాను. మీ నిబంధనలకు బద్ధుణ్ణి. (అక్కరలేని నంబర్లు కొట్టివేయండి.)

నం॥

F 58 F 59 F 60 F 61 F 62 F 63

ఇట్లు

____

పేరు.................................. తేదీ ....

చిరునామా..................................

ఊరు..................................

ఆంధ్రప్రదేశ్ బుక్ డిస్ట్రిబ్యూటర్సు, రాష్ట్రపతిరోడ్డు, సికిందరాబాదు

ప్రాణులూ - ప్రభావమూ

తే 4—11—66 ది, ఆంధ్రసచిత్రవార పత్రికలో 'ప్రాణులు— ప్రభావము' అన్న డా. గాలి బాలసుందరరావు గారి, అనువాద గ్రంథం మీద నా సమీక్షపై, శ్రీ పె. రా. శర్మగారు తే. 23—12—66 ది పత్రికలో విమర్శిస్తూ రాసారు. విమర్శలు రావడం సహజమే కాని, శాస్త్రీయ గ్రంథరచనలో గుణదోషాలను నిర్మొహమాటంగా బహిర్గతం చేసిన నా సమీక్షపై, సజ్జిక్ష లోతుపాతులు తెలిసిన శర్మగారు అలారాయడం ఆశ్చర్యంగావుంది.

నా సమీక్షను నేను 8 భాగాలుగా విభజించాను. అవన్నీకూడా ఎంతో ముఖ్యమైన విషయాలు. శర్మగారు వాటిలో మూడు నాల్గింటిని తాకలేదు. వారు ప్రస్తావించని అన్ని ముఖ్యమైన లోటు పాట్లను వారు అంగీకరించారనే తలుస్తాను.

శర్మగారు ''విమర్శకులు, రచయిత అనువాదం లోని తప్పులు లెక్కపెట్టేటప్పుడు, తమరు చాలా జాగ్రత్తగా ఉండాలనేందుకు ఈ విమర్శ ఒక చక్కటి నిదర్శనం'' అన్నారు. నేను కూడా అలాగే భావిస్తాను. ఇంతేకాక ప్రతి విమర్శ చేసేటప్పుడు కూడా వారు అతిజాగ్రత్తగా ఉండాలి. పైగా ఆ శాస్త్రంలో అనుభవంలేనివారైతే, ఈ విషయాలు తెలియవని అనుకోవచ్చు, విషయంలో ప్రవేశం ఉన్నవారు అలా రాయడం చాల విచారకరం.

1. అచ్చుతప్పులు: పుస్తకంలోని అన్నితప్పులను అచ్చుతప్పులని సమర్థించుకోలేము. ఇదీకాక నేను రాసిన అచ్చు తప్పులు విషయం, సామాన్యంగా దొర్లే అచ్చుతప్పుల గురించికాదు. శాస్త్రీయ గ్రంథాలు రాసేటప్పుడు అచ్చు తప్పుల విషయంలో మనం జాగ్రత్తపడాలి. ముద్రణాలయం మీద ఆరోపించడం భావ్యంకాదు. అప్పటికి కొన్ని దొర్లినా తప్పొప్పుల పట్టిక ఇవ్వవచ్చు. పుస్తకంలో అచ్చు తప్పులు ఎక్కువగా వుండడం, దానివల్ల అర్థాలు మారడం, విశదంకాకపోవడం, శాస్త్రీయంగా పొరపాట్లు జరగడంవల్ల, సమీక్షకునిగా నా బాధ్యత నేను నెరవేర్చేను. నేను ముందు రాసినవి కాక మరి కొన్ని ఉదాహరణలు పొందు పరుస్తున్నాను. సజ్జిక్షలో పరిచయముఉన్న శ్రీ శర్మగార్కి ఈ అచ్చు తప్పులవల్ల విషయం చదువరికి ఎలా అవగాహన కాకుండా ఉండేది గ్రహింపగలరు. ''ఉకరీరియా జెన్కో'' ''ఫ్లై'' (57), జవన్వైపీడియములు (132), పోజియా అంటే పాదములు (32), పాద్‌పాదము (48), థియొడెల్ (211).

2. మాతృకపేరు: పుస్తకంలో ఇది ''The Nature of Living things'' అనిఉంది. ''విమర్శకులు సూచించిన పేరుకు ఆంగ్లంలో అర్థం Living things in nature అన్నారు శర్మగారు. అయినా శర్మగారే మాతృకపేరు, 'Nature of Living things in nature' అన్నారు. అది వారి పొరపాటో, అచ్చు పొరపాటో! ప్రభావము అన్న పదానికి ''ప్రకృతి యొక్క (స్వ)భావము'' అన్నారు. ఇందులో కూడా అచ్చు పొరపాటు ఉన్నట్టుంది. వారు రాసినదంతా మాటల గారడీలాగావుంది. నేను తెలుగునాడి తెలిసిన వారిని సంప్రదించే, సమీక్షలో అలారాసాను. ఇప్పటికీ నేను రాసింది సరేనని భావిస్తున్నాను. ఇందులో రెండు విషయాలు ఉన్నాయి. పేరు, మాతృకకున్న

ఉత్తరాలు

పేరుకు సరియైన అనువాదమా, కాదా అని. రెండవది, పుస్తకంలో చర్చించిన విషయానికి తగినదా, కాదా అని. Nature అన్న పదానికి స్వభావము, ప్రకృతి అని అర్థం కాని ప్రభావము ఎన్నటికీకాదు. ఇక పుస్తకంలో ఎక్కువగా ప్రాణుల స్వభావము, ప్రకృతిని గురించి చర్చించేరేకాని వాటి ప్రభావము గురించి చర్చించలేదు. ప్రాణులు ప్రభావము అన్న పేరు పుస్తకానికి తగినది కాదని పునరుద్ఘాటిస్తున్నాను.

3. రచనాశైలి: నేను రాసినది వారు తప్పుగా ఉదహరించారు. నేను ఉపోద్ఘాతంలో ఉన్నమాటనే రాసాను. ''చదవాలనే అభిమానంకలవారు కూడా రెండు మూడు పేజీలు చదవగానే...... అని మానివేసే రీతిగా..............'' అని ఉపోద్ఘాతంలో వుంది. ''రెండు మూడుసార్లైనా తిరిగి చదవకుండా కొన్నిచోటులు అర్థంకావడం లేదు'' అని నేను రాసినట్టు శర్మగారు రాసారు. నేను అలా ఎక్కడా రాయలేదు. కాని పుస్తకం విషయంలో ఆయన రాసింది నిజమే. మహామేధావులు రాసిన గ్రంథాల గురించి వారు రాసారు. గొప్ప గొప్ప పుస్తకాలు సరిగా వెంటనే అర్థంకాకపోవడం ఒక యోగ్యతగా వారు భావించారు. సామాన్య పాఠకులకు అర్థం అయ్యే శాస్త్రీయ విషయాలు రాయడానికి మేధావుల పనిలేదు. విషయం అక్కడక్కడా కఠినమైనా వివరణ సులభంగా ఉండాలి. అనేకమైన కఠినపదాలు, భాష అనువాదకులు వాడారు. సరళంగా రాసివుండవచ్చును. ఎన్నో ఉదాహరణలు ఉన్నాయి. రెండు, మూడు చూపుతాను. ''ఉన్నత శ్రేణికి చెందిన..... జాత్యమైన విభజన ఒక విశిష్టమైన గోత్రాభివృద్ధి మార్గంలో రూపొంది...... కేంద్రనరాశయమునే శాసించే ఉత్కృష్టశక్తిగా...'' (23) ''ఒకస్వేలో (swallow) కీటకములు తిని జీవించే పక్షి విశేషము—పిండమైనా జిరాఫీ పిండమైనా ఇల్లాగే ప్రవర్తిస్తుంది'' (202) అయితే వివర్తమై వస్తుధూళిగా ఉండడంకంటే గోళాకృతిగల కణంగా ఏర్పడినప్పుడు ఆ గోళాంతర జీవితం గుట్టుగా సాగించుకోవలసిన అగత్యం ఏర్పడింది.'' (15)

4. సాంకేతికపదాలు, అనువాదాలు: వీటి గురించి రెండు అభిప్రాయాలు ఉన్నాయి. ఒకటి సాంకేతిక పదాలు యధాతథంగా వాడడం. రెండవది అనువదించుకోవడం. ప్రతి రచయిత అనువాదం చేసేటప్పుడు, తన కిష్టమైన పదం వాడుకోడానికి అధికారంవుంది. కాని ప్రతివారు ఇలా చేసుకుంటూ పోతూవుంటే ఇబ్బంది ఏర్పడుతుంది. ఒక పదాన్ని స్వీకరించేటప్పుడు అది సరియైనదా కాదా అన్న బాధ్యత వారిమీద వుందికదా? ఆ బాధ్యత నాదికాదు, డిక్షనరీది అంటే భావ్యంకాదు. శంకరనారాయణ సామాన్య పదాలవరకు ప్రమాణం అయివుండవచ్చు. శాస్త్రీయపదాలకు అందులో ఇచ్చినవి అన్నీ సరియైనవి కావు. శాస్త్రీయగ్రంథాన్ని అనువదించేప్పుడు పదానికిపదం అనువదించి రాయడంకాదని ఒప్పుకొంటారనుకుంటాను. మాతృకలోని భావాన్ని గ్రహించి మన భాషలోకి సాధ్యమైనంత మట్టుకు సరళంగా ఇవ్వడానికి ప్రయత్నించాలి. విషయం కష్టమైనప్పుడు భాష సరళంగా వుంటే మంచిది.

జాతి అనేది, Sex అనే పదానికి ఉపయోగించడం సరికాదు. 'జీవకణములు' అన్న పదం Cells కి వర్తిస్తుంది కాని sex cells కి వర్తించదు. Carnivora అనే దానిని మాంసాహారులు అని ఎలా అనువదిస్తారు? 'Carnivora' 'Mammalia'లో ఒక అర్డరు. మాంసాహారులు అనేవి అన్ని Phylae లోనూ వుండవచ్చుకదా. ఎలుగుబంట్లు కార్నివోరాకు చెందుతాయి. అయినా అందులో అనేకం మాంసాహారులు కాదుకదా? Primitive nervous system కి ఆదిమ నరాశయము అనడం భావ్యమా? పురాతన మానవులు జీవించిన స్థలాలు అని అర్థం రావడంలేదా? Parasitologistsకి పరాహారశాస్త్రజ్ఞులు అంటే ఇతరులమీద ఆధారపడే శాస్త్రజ్ఞులు అని అర్థం వస్తుందికదా? ఎక్కడో Entomologist కి కీటకశాస్త్రి అన్నారుట. ఈ అనువాదాలు ఉచితంగా లేవని నాభావం. డాల్ఫిన్ మన ప్రాంతంలో లేదని ఎలా చెప్పగలరూ? ఇండియా తీరంలో బంగాళాఖాతంలో ఉంది. అయినా మనకు తెలియనివి, మన ప్రాంతాల్లో లేనివాటికి పేర్లు యధాతథంగా వ్యవహరించుకొంటే వివాదం లేదు. శంకరనారాయణ డిక్షనరీలో ఉన్నదన్న మాత్రాన అది సరియైన అనువాదంకాదు. గండుమీను ఒకరకం చేప. డాల్ఫిన్ ఒకరకం తిమింగిలం.

హైబర్నేషను, ఈస్టివేషన్ అనేవి స్థూలంగా ఒకటే. అయితే ఒకటి శీతాకాలానికి, రెండవది ఎండాకాలానికి సంబంధించిన దశలు. కాని వాటిని వ్యతిరేక కార్యక్రమాలనడం సమంజసం కాదు. ఒక కాలంలో నిద్ర ఉందనుకోండి, అది మరొక కాలంలో నిద్రకు వ్యతిరేకం ఎలా అవుతుంది. అలా అయితే ''వ్యతిరేకం'' అనేపదం అర్థమేపోతుంది. పొడవు, పొట్టి, వివేకం, అవివేకం ఇలాటి వాటిని వ్యతిరేకం అంటాం కాని పై రెండు వ్యతిరేకం అనడం భావ్యంకాదు.

నా సమీక్షలో అచ్చుతప్పులు అని వివరించిన వాటికింద 15 తప్పులు పేర్కొన్నాను. అవన్నీ శాస్త్రీయంగా చాలా పొరపాట్లు. ఆ పదిహేను కూడా ఉదాహరణలు మాత్రమే. ఇంకా ఎన్నో అలాంటివి ఉన్నాయి. నేనిచ్చిన వాటిలో శర్మగారు 7, 8, మాత్రం ఎత్తిచూపి అవి తప్పులుకావని సమర్థించారు. మిగిలినవి వారు తప్పులనే అంగీకరించారని తలుస్తాను! అందువలన వాటిని గురించి రాయడంలేదు. వారు సమర్థించిన వాటినిగురించే రాస్తున్నాను.

(1) ''స్పాంజిజాతి వృక్షములు'' అనేది అచ్చు పొరపాటు అంటారు. అచ్చు పొరపాట్లవల్ల అక్షరాలు కొన్ని అస్తవ్యస్తం కావడం అవుతుంది కాని, ముద్రించేవారు, అనువాదంలోలేని ''వృక్షములు'' అనేది జొప్పించారనడం భావ్యంకాదు. ఒకచోట సరిగా ఉన్నంతమాత్రాన రెండోచోట అది తప్పు కాదనడం కూడా మంచిదికాదు.

(2). ''కుందేలు వంటి సస్తన జంతువు గుర్రముగా రూపొందడానికి జంతుశాస్త్రరీత్యా అసాధ్యమని విమర్శకుల అభిప్రాయం కాబోలు'' అన్నారు

(54 వ పేజీ చూడండి)

ఆంధ్రసచిత్ర వారపత్రిక

వ్యవస్థాపకులు :
దేశోద్ధారక కాశీనాథుని
నాగేశ్వరరావు పంతులుగారు

శుక్రవారం : 27—1—'67

పరాభవనామ సం॥ పౌష్య మాసం॥ బహుళ పాడ్యమి

సంపుటము : 59 సంచిక : 20

స్థాపితము :
1908

ముఖ్య సంపాదకుడు :
శివలెంక శంభుప్రసాద్

సంపాదకుడు :
శివలెంక రాధాకృష్ణ

ఆంధ్రపత్రిక కార్యాలయము
7. తంబుచెట్టి వీథి. మద్రాసు-1

చందా వివరాలు :
భారతదేశం

పోస్టు ద్వారా

సంవత్సర చందా	19.25
6 మాసముల చందా	9.6/
3 మాసముల చందా	4.10
విడిప్రతి	0.35

ఇతరదేశాలకు
ఓడమీద (Sea Mail)

సంవత్సర చందా	32.00
అర్ధసంవత్సర చందా	16.00

విషయానుక్రమణిక

ముఖచిత్రం : నటి కనకదుర్గ

కథలు :


తప్పు	— 12
లచ్చి	— 28
రెయిన్‌కోటు	— 39

సీరియల్ కథలు:

రామ్‌శాస్త్రి	— 10
అంతస్తులు - అభిమానాలు	— 20
సుప్రభాతం	— 34

శీర్షికలు, వ్యాసాలు, సినిమా.

ఉత్తరాలు — 4, ఊవెన్-కార్టూన్ — 5, న్యూఢిల్లీలేఖ — 6, లోకంపోకడ — 7, గోల్డ్‌ఫింగర్ — 8, వైజ్ఞానికగాథావళి — 19, గురుగోబింద్‌సింగ్ — 24, సినీలోకం — 25, వారఫలం — 33, కామరాజ్ — 4, మొండి కుమేత — 44, ఎప్పుడూ అందంగా కనిపించాలి!-45, ఎందుకు?—46, చిత్రసమీక్ష, చిత్రలహరి — 49.



వెల 35 పై.

శ్రీకృష్ణ

గోముఖ... ఆందోళనా లక్ష్యం?

అనకూడదుగాని, సాధారణంగా కామానికి ఎంత తహతహ వుంటుందో, ప్రస్తుతం పార్టీ టిక్కెట్లకూ అంతే వుబలాటంగా వుంది. ప్రతివారూ లోలోపల ఉవ్విళ్లూరుతూనే వుంటారు. కాని, నోరు విప్పేందుకు మాత్రం కొంచెం జంకుతూ వుంటారు. కార్యాలయాల్ని అధివసించిన కాంగ్రెసు కార్యకర్తలు, వారివారి స్థానాల్ని విడచి బయటికి వచ్చినప్పుడు వారి వైఖరులూ వేరుగానే వుంటుంటాయి. దీనికి సరైన ఉదాహరణ కావాలంటే, లాలా గుల్జారీలాల్ నందా చాలు. ఆయన పదవిలోవుండగా గోవధ నిషేధాందోళన గురించి ప్రభుత్వం ఎటువంటి స్థిరమైన అభిప్రాయంలో వుందో తెలిపి, ప్రభుత్వం తన విధానాన్ని మార్చుకోదని గట్టిగా చెప్పారు. అంటే ప్రభుత్వ విధానం అప్పటికీ ఇప్పటికీ ఒకేవిధంగా వుందన్న మాట. గోసంరక్షణ పూర్తిగా రాష్ట్రాలమీద ఆధారపడి వుందనీ, లిటిగేషన్ తీసుకొచ్చే నిర్ణయాన్ని మాత్రం ప్రభుత్వం చేయదనీ ఆయన ఢంకా భజాయించి సెలవిచ్చారు. ఇది ఆఫీసులో దేశీయాంగ మంత్రికుర్చీలో కూర్చుని చెప్పిన విషయం. విక్రమార్కుడి సింహాసన మన్నమాట! ఆ సింహాసనం నుంచి అవతికి వచ్చి, గోవధ నిషేధం వెంటనే అమలు జరపాలనే సాధుపుంగవుల్లో కలిసిపోయారు! ఆచార్య వినోబాభావే గార్ని కలుసుకున్న లాలాజీ, తాను ఆచార్యుల వారివద్ద శిష్యరికం చేయబోతున్నానని ప్రకటించారు. వినోబాభావేగారి ఆశ్రయంలో వుండి పోదల్చుకుంటే లోక్‌సభ ఎన్నికలకు లాలాజీ ఎందుకు నిలబడుతున్నట్టు? పెద్ద పెద్ద వాళ్లనందర్నీ ఆయన బహిరంగంగా విమర్శించారు. సరే, 1965 లో శ్రీ టి. టి. కృష్ణమాచారి బారి నుంచి తప్పిస్తానని కలకత్తా పరుగెత్తుకు వెళ్లి, అక్కడి వణిక్ప్రముఖులకు భరోసాయిచ్చి వర్తకం చేయవలసిన అగత్యం ఆయన కేమొచ్చిందట? అప్పుడు ఆయనకు తోడుగా పార్లమెంటరీ వ్యవహారాలమంత్రి బాబూ సత్యనారాయణ సిన్హా వున్నారు. ఒక ఇంటర్వ్యూలో ఒక ప్రధానమంత్రి యోగ్యాయోగ్యాల గురించి లాలాజీ నిరాఘాటంగా ప్రస్తావించారు. పోనీ, తమకా యోగ్యతలున్నాయా, అని? ఈ ప్రశ్న తేడానికి ఒక కారణముంది. లాల్‌బహదూర్ శాస్త్రి మరణానంతరం లాలాజీ ప్రధానమంత్రి అవుదామని తాపత్రయపడ్డారు. విమర్శించేవాడు గొప్పవాడని ఎలా అనుకోవాలి?

శ్రీయుతులు మొరార్జీదేశాయ్, లాలా గుల్జారీలాల్ నందా గార్ల వివరణల్ని దెబ్బతీస్తూ ప్రతిఘాతంగా దేశీయాంగ మంత్రి శ్రీ చవాన్ ఒక ప్రకటన చేశారు. ఆ ప్రకటన ఏమిటని? సంవత్సరము పొడుగునా శ్రీమతి గాంధి భారతదేశానికి చేసిన మేలు అంతా యింతా కాదు, అంచేత వచ్చే ఎన్నికల తర్వాతకూడ ఆమే ప్రధానమంత్రి అయి తీరాలి, అని. ఇక్కడ చవాన్‌గారి మాటలకు ఎంతయినా వ్యాఖ్యానం వుంది. శ్రీ చవాన్‌ను ప్రధానమంత్రిగా బలపరచినా, ఆయన ఇదే మాటమీద నిలబడతారా? లేకపోతే 'శివాజీస్టయిల్' స్వామిభక్తాయిది?? శివాజీ స్టయిల్ అంటే ఏమిటని? ఒకప్పుడు శివాజీ అఫ్జల్‌ఖాన్‌తో సౌభ్రాతృత్వాన్ని ప్రకటించాడు. నువ్వూ నేనూ ఒకటే, మన స్నేహం జగద్విఖ్యాత మవుతుంది అని తేనెలూరించాడు. అఫ్జల్‌ఖాన్ ఉబ్బి తబ్బిబ్బయిపోయాడు. శివాజీ అంతటివాడితో స్నేహంకన్నా ఏం కావాలనుకున్నాడు. శివాజీ వెచ్చని కౌగిలిలో ఇమిడిపోయాడు. అప్పుడు శివాజీ ఏంచేశాడని? అఫ్జల్‌ఖాన్ పక్కలో ఒక్కటే ఒక్క పోటు పొడిచాడు, అంతే. శ్రీ చవాన్ మాటలవల్ల ఒక్క విషయం సుబోధకమవుతుంది. ఆయన మొరార్జీదేశాయ్ పక్షంకాదు. ఒకవేళ మొరార్జీదేశాయ్ ప్రధానిగా నిలబడినా ఆయన్ను ఈయన బలపరచరూ, అని.

దేశ సౌభాగ్యంకోసం, శాంతి భద్రతలకోసం, మేము త్యాగాలు చేసేస్తున్నాం— అనే మహానుభావుల ఉపన్యాసాల వెనుక కపటం కనిపిస్తూ వుంది. దేశం బరువు బాధ్యతల్ని మోయగల్గింది ఒక్క కాంగ్రెసు పార్టీయే. అని లాలా గుల్జారీలాల్ నందా ఒకసారి అన్నారు. కాంగ్రెసు భుజస్కంధాల మీదున్న ఈ బరువును తొలగించి, కాంగ్రెసును వూపిరి పీల్చుకునేలా చేద్దామని ప్రతిపక్షాలు చూస్తున్నాయి. ఆవును సంరక్షించాలని జనసంఘం తంటాలు పడుతోంది. 'ఆవు' అనేది బూటకం. జనసంఘానికి కావలసింది వోట్లు!

బేషరతుగా సంధి చేసుకోడానికి ప్రభుత్వం ముందుకు రావాలంటూ గోసంరక్షణ సంఘం గోలపెడుతోంది. సమావేశమయేముందే గోవధ నిషేధం అవసరమని ప్రభుత్వం ఒప్పుకోవాలి అన్నారు. సరే సమావేశ మవండి చూద్దాం, అంది ప్రభుత్వం. ఇక్కడ చెప్పుకోతగ్గ ఇస్లాంమత ప్రవక్త కథ ఒకటి చెబుతాను!

ఇస్లాం మతప్రవక్త, ఆయన అనుచరులు ప్రతి సంవత్సరం మెక్కాను దర్శించడం ఆనవాయితీగా వుండేది. ఒక సంవత్సరం ఈ దండును మరో ప్రతిపక్షం ఎదుర్కొంది. ఫలితంగా ప్రవక్త, ఆయన అనుచరులూ మదీనాకు తిరిగి వెళ్లిపోవలసి వుంది. వ్రాతపూర్వకమైన ఒప్పందం జరిగిన తర్వాత పై సంవత్సరం మతప్రవక్తగారు మెక్కా వెళ్లడానికి అనుమతి లభిస్తుందన్నమాట.

ఒక ఒప్పందం తయారు చేసుకున్నారు. అందులో మహమ్మదు ఇస్లాం మతప్రవక్తగా అందరూ గుర్తించాలి! అనే నిబంధన ఒకటుంది. 'ఇస్లాం మతప్రవక్త మహమ్మదు అనే విషయంమీద మాకు ఎలాంటి భేదాభిప్రాయము లేద'ని రాసి వున్న ఒప్పందంమీద సంతకం చేయడానికి ప్రతివాదులు ఒప్పుకోలేదు: ప్రతిపక్షం బలం అధికమయి వుండడంచేత ప్రవక్త తలవంచక తప్పలేదు.

అదేవిధంగా, గోవధ నిషేధం తప్పనిసరిగా అవసరం అని గనక ప్రభుత్వం ఒప్పుకున్నట్టయితే, ఇక భేదాభిప్రాయా లెక్కడుంటాయి? ఆందోళనలెలా వుంటాయి? సంఘంయొక్క ఉద్దేశమేమిటట, ఆర్డినెన్సొకటి తయారు చేయమని అది ప్రభుత్వానికి సలహా యివ్వనున్నదా?

సంఘంలోని దురాచారాల

నుంచి ఆవును సంరక్షించే సంఘం కొన్ని ముఖ్యమైన ప్రశ్నలకు సమాధానం ఇవ్వవలసివుంటుంది. (1) కొన్ని రాష్ట్రాల్లో గోవధ నిషేధం ఎప్పుడో అమలుజరపబడింది కదా! అక్కడ కూడా ఈ ఆందోళన ఎందుకు? (2) నగర, పురవాసులే ఆందోళన జరపడానికి కారణమేమిటి? ముఖ్యంగా జనసంఘంవారు, ఆర్యసమాజం వారు తలదూర్చడానికి ఏమిటి కారణం? (3) ఎప్పుడూ సమయం దొరకనట్లు ఎన్నికలకు ముందుగానే ఆందోళన ఎందుకు లేచింది? (4) కలకత్తాలోను, తదితర నగరాలలోను హిందువులు ఆవును ఎంతో ఘోరంగా హింసిస్తున్నారు కదా, ఈ ఉద్ధారకులు క్రితం పదిహేడు సంవత్సరాలనుంచి ఎందుకు మడికట్టుకు కూర్చున్నారు? ఆవుకు జరిగే అన్యాయాలను ఎలా సహిస్తూ వచ్చారు? ఆవును క్రూరంగా హింసించే దేశం భారత దేశం ఒక్కటే. మరేదేశంలోను యింత దారుణం లేదు. గొడ్డుమీద అధికారంతో మన మెంత నిర్దయగా ప్రవర్తిస్తున్నామో ఆలోచించవలసిందే. జీవజంతువు లన్నిటినీ మనం హింసిస్తూనే వున్నాం. ఆఁ..., మనిషి మాటేమిటి?

1966 లో సాధువులు, సంత్‌లు, జగద్గురువులు రాజకీయరంగంలో ప్రవేశించారు. ఇది తీవ్రమైన, ఎంతో అపాయకరమైన పరిస్థితి. సంత్ ఫతేసింగ్ చాల చక్కని గుణపాఠాన్ని నేర్చుకున్నారు. ఆయన మళ్లీ జన్మలో ఎప్పుడూ నిరశన వ్రతం అవలంబించరు. ప్రభుత్వం పట్టిన పట్టు విడవకుండా వుంటే, మరే ఆచార్యులుగాని, జగద్గురువులుగాని మళ్లీ జోక్యం కలగజేసుకోరు!

జనరల్ కౌల్ జాతకం

జనరల్ కౌల్ ఇప్పుడు చర్చనీయమై వున్నారు. ఆయన తన పుస్తకంలో ఇద్దరు వ్యక్తుల్ని అధిక్షేపించారు. అందులో ఒకరు కీర్తిశేషులైన పండిట్ జవహర్లాల్ నెహ్రూ, రెండవవారు మన కృష్ణమీనన్. అదృష్టంకొద్దీ కౌల్‌ను ఎరిగివున్నవాళ్లలో కొందరు

దివంగతులయ్యారు. మరికొందరు రిటైరయ్యారు. తాము జనరల్‌గా ఎలా అయ్యారో, కొరియా యుద్ధంలో తాము ఎలాంటి పాత్ర ధరించారో వివరిస్తూ జనరల్ తిమ్మయ్య, నెహ్రూపోయినా తాము జనరల్ కౌల్‌కు చక్కని సమాధానం ఇవ్వగల్గుతారు.

జనరల్ కౌల్ గురించిన చరిత్ర ఇంకా ఒకటి రాయవలసి వుంది. జనరల్ సాహెబ్ సాయుకు సన్నద్ధమైనప్పుడు, -బ్రిటిషువారి కాలంలో ఆయన ఏ హోదాలో వున్నారో; ఎటువంటి పనిని ఆయనకు అప్పగించారో; ఇవన్నీ ప్రస్తావించవలసి వుంటుంది. శ్రీ ధర్మతేజా జనరల్ కౌల్‌ను కవుటుకు తీసుకొని అంతులేని జీతభత్యాల్ని కూర్చిపెట్టారు. ఆయన 'మార్షల్ ఫీ'తో సమానులైనారు. పండిట్ నెహ్రూను ప్రస్తావనగా చేసుకుని జనరల్ సాహెబ్ ఆర్మీనుంచి రిటరయినారు. ఆయనకు తేజా షిప్పింగ్ కంపెనీ వ్యవహారాలన్నీ కరతలామలకం. ధర్మతేజా పండిట్ నెహ్రూను ఎలా వశపరచుకున్నారో వివరిస్తూ ధర్మతేజా మీద ఒక గొప్ప ఉద్గ్రంథాన్ని రాయడానికి జనరల్ కౌల్ ఒక్కరే సమర్థులు. ఇంతకు ముందున్న ప్రధానమంత్రి పేరు ఎక్కడా రాకపోవడమనేది అంత గౌరవనీయమైన విషయం కాదు! నెహ్రూగారే గనక ఆసరాగా నిలబడకపోతే ధర్మతేజాకు అంత డబ్బు అప్పు పుట్టేది కాదు. ఈ అప్పుకు మొరార్జీ దేశాయ్, కీ శే. డా. సుబ్రమణ్యం తీవ్రంగా అధిక్షేపించారు.

జనరల్ కౌల్ తెలుపుకున్న కృతజ్ఞతలకు అవధుల్లేవు! ఆయన ఎన్నికలముందు శ్రీ కృష్ణమీనన్‌ను సవాలు చేస్తున్న పుస్తకాన్ని విడుదల చేశారు. పుస్తకంలోని కొన్ని కొన్ని విమర్శలకు పండిట్ నెహ్రూ కుమార్తె కూడా తట్టుకోగలిగి వుండాలి.

ఒక విషయంలోమాత్రం జనరల్‌కౌల్ పప్పులో అడుగేశారు. భారతదేశం రక్షణను కట్టుదిట్టం చేసుకొనక పోవడానికిగల కారణం శాంతిభద్రతలు కాదు. నెహ్రూగారు ప్రవేశపెట్టిన 'పంచశీల'అనే 'అడ్డుపుల్ల'. సందర్భవశంగా—అయిదేళ్లక్రితం ఏర్పరిచిన 'ఇండస్ట్రియల్ ఎగ్జిబిషన్'లో 'కాఫీ-పెర్క్యులేటర్ల'ను గర్వంగా ప్రదర్శించడంలో జనరల్ కౌల్ భుజాలు ఎగరవేశారు. ఈ తయారీల్లో ఆయన భాగస్వాములు ఎరి!

* * *

ఉద్యోగుల జీతాలు

కేంద్రప్రభుత్వం జీతభత్యాల విధానం, మాజీ విద్యామంత్రి శ్రీయుత చాగ్లా 'అందర్నీ సంతృప్తి పరచే' విధానం, ఇప్పుడొక సమస్యగా తయారై కూర్చుంది. ఈ సమస్య, రాబోయే ఎన్నికలను భయపెట్టడమేకాకుండా, సాఫీగా సాగుతున్న రాష్ట్ర పరిపాలనకు కూడా విఘాతం కలిగించింది. పాఠశాలల ఉపాధ్యాయుల జీతాలు పెంచినప్పుడు, ఆ బాధ్యతలో సగం తాము వహిస్తామని శ్రీ చాగ్లా హామీయిచ్చారు. బాగానే వుంది. 1921 నుంచీ 'విద్య' అనేది రాష్ట్ర ప్రభుత్వాల బాధ్యత అన్నారు. ప్రాథమిక పాఠశాలల నిర్వహణ పురపాలక సంఘాలవంతు అన్నారు. అయినా, మాజీ హైకోర్టు జడ్జిగారైన శ్రీ చాగ్లా, పెంచబడిన ఉపాధ్యాయుల జీతాల్లో యాభై శాతం కేంద్రం ఆదాయాల్లో నుంచి హామీ యిచ్చారు!

కేంద్ర ఉద్యోగుల జీతాలకి, రాష్ట్ర ఉద్యోగుల జీతాలకి ఎంతో తేడా వుంటూ వుంది. అంచేత రాష్ట్రంలోని ఆఫీసర్లు నిరంతరంగా కేంద్రంలోకి వలస వచ్చేయడం జరుగుతూ వుంది. భారత ప్రభుత్వపు ఆఫీసులు కొన్ని రాష్ట్రాల్లోనూ వున్నాయి. అక్కడ, కేంద్ర ప్రభుత్వంలోని ఒక సోదరుడు ఎక్కువ జీతం తీసుకుంటూ వుంటాడు, మరో సోదరుడు రాష్ట్ర ప్రభుత్వ జీతాలవారీగా తక్కువ తీసుకొంటూ వుంటాడు. కాని ఇద్దరూ చేసేది ఒకేరకపు ఉద్యోగం, ఒకే హోదా! మరోవిధంగా చెప్పాలంటే, ఒకేరకపు ఉద్యోగానికి రెండువర్గాల జీతాలున్నాయి. ఈ విధానం, రాష్ట్రప్రభుత్వోద్యోగుల్లో తీవ్రమైన అసంతృప్తిని రేపింది.

రాజకీయపరమైన కొన్ని ఒత్తిడులవల్ల, భారత ప్రభుత్వం ఈ విషయాన్ని కొంచెం పొంచి చూడడానికి అవకాశం కలిగింది. జీతాల వైఖరి బాగుండలేదని తెలుసుకుంది. ఒక 'కమిషన్'ను ఏర్పాటు చేసింది. ఈ కమిషన్, కరవుభత్యాన్ని సరిసమానం చేయడానికి, పరస్పరం కీచులాడుకోకుండా వుండడానికి ఒక పద్ధతిని అవలంబించింది. కేంద్రోద్యోగుల కరువుభత్యాన్ని కొద్దిగా పెంచి సహకార వేతనాన్ని ఏర్పాటు చేసింది!

అధికవ్యయంతోను, ఎదుగూ బొదుగూలేని ఆదాయంతోను సతమతమవుతున్న రాష్ట్రప్రభుత్వాలు తమ అసమర్థతను తెలియపరచుకున్నాయి. ఆందోళన లేచింది. కేంద్ర ప్రభుత్వంతో మేము సరితూగలేము అని మొరపెట్టుకున్నాయి రాష్ట్ర ప్రభుత్వాలు. ఈ ఆందోళన ఉత్తరప్రదేశ్‌లో తీవ్రరూపాన్ని దాల్చింది. పెంచబడిన బిల్లుకు తట్టుకోలేమని ప్రకటించింది రాష్ట్ర ప్రభుత్వం. ఇటువంటి ఆందోళనన్ని అణచడానికి కేంద్ర ప్రభుత్వం పట్టు విడవదని రాష్ట్ర ఉద్యోగులకు తెలియందేమీకాదు. శ్రీమతి ఇందిరాగాంధి ప్రభుత్వము యొక్క దృఢసంకల్పం అంటే ఏమిటో సంత్‌ఫతేసింగ్ దీక్షా విరమణలోను, గోసంరక్షణోద్యమంలోను తెల్లమవుతూనేవుంది. కేంద్రం ఖజానామీద కన్ను పడకుండా ముఖాన్ని చాటుచేసుకునే పద్ధతి ఏదో ఒకటి అవలంబించాలి!

లోకం పోకడ

"వియత్నామ్ యుద్ధంలో పెకింగ్ అమెరికాకి నేరుగా సహాయం చేస్తున్నదని సూచించేందుకు చాలా సంగతులు తోడ్పడుతాయి."

—'ప్రేవియాత్'లో 'అబ్సర్వర్'

* * *

శ్రీ అనిల్‌దేవ్‌ధార్‌కి ఇచ్చిన స్వర్ణపతకం బంగారుపూత పూసిన వెండిపతకం అనే ఫిర్యాదుని విశ్వ విద్యాలయం అధికారులు తనిఖీ చేస్తున్నట్లు పూనా విశ్వ విద్యాలయం రిజిస్ట్రార్ ఇవాళ (జనవరి 5) అన్నారు.

—వార్త

* * *

"......నా లోక్‌సభసీటు నా భార్యకి, నా ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ అధ్యక్ష పదవి నా కుమారుడికి ఇంకా నా......"

మరణశయ్యమీదనున్న కాంగ్రెసు పెద్దమనిషి 'ఆఖరిమాటలు'

—'హిందూస్థాన్ టైమ్స్' కార్టూన్ క్రింద వాక్యం

* * *

—"దేవాలయాలు, మఠాలు, మతసంస్థలు ఎంతో సంపన్నవంతములయినప్పటికీ—ఒకదానికి సాలు ఆదాయం కనీసం 2 కోట్లు—ఒక్కటీ సహాయం చెయ్యటంలేదు. (క్షామ నిధికి)....."సాక్" పెద్ద మొత్తం విరాళంగా పంపారు."

—శ్రీజయప్రకాశ్ నారాయణ్

* * *

పాట్నాలో జనవరి 13 న ఉపన్యసిస్తూ శ్రీ మొరార్జీదేశాయ్ నేటి పరిస్థితులలో గాంధీ టోపీ పెట్టుకొనటానికి కాంగ్రెసువారు భయపడుతున్నారనడం నిజం కాదన్నారు. 'నిజమయిన కాంగ్రెసువాది ఎవరూ ఈ భయాలకి లొంగరన్నారు.'

—వార్త

* * *


అప్పటి రక్షణశాఖమంత్రి శ్రీ కృష్ణమీనన్ ఎప్పుడూ నేరుగా శ్రీ నెహ్రూవద్దకే తమ ప్రతిపాదనలు తీసుకువెళ్లేవారు కాబట్టి తాము అవసరం రక్షణ వ్యయానికి ఎప్పుడూ అడ్డుపడలేదని మాజీ ఆర్థిక శాఖామంత్రి శ్రీ మొరార్జీదేశాయి— జనరల్ కవుల్ రాసిన పుస్తకంలో ఆయన చేసిన ఆరోపణ గురించి ఒక విలేఖరి అడిగినప్పుడు—అన్నారు.

—వార్త

* * *

అకాలీదళ్ (శాంత్‌వర్గం) లోక్‌సభకి తమ అభ్యర్థులపేర్లు కొన్ని ప్రకటించారు. భాటిండా నియోజకవర్గంలో నుంచుంటున్న శ్రీ లీకార్ సింగ్ శాంత్.తేసింగ్ కాదు ప్రయినరు.

—వార్త



రామ్‌స్‌గేట్ హోటల్‌లో భోజనం చేస్తూ బాండ్ గోల్డ్‌ఫింగర్‌ని ఎలా మంచి చేసుకోవాలా అని ఆలోచించాడు. అయితే మరీ 'కాకాపట్టినట్టు' ఉండరాదు.......

—లోకానుభవం బాగావున్న గడసరిపిండంలాగ నటిస్తే సరి. ఏదో మాంచి అవకాశంకోసం చూస్తున్న వాడిలాగా........

—రాయల్ సెయింట్ మార్క్స్ గాల్ఫ్ క్లబ్— గోల్డ్‌ఫింగర్ ఊళ్ళోవుంటే అక్కడ హాజరయి తీర్తాడు.....

''ఆఫ్టర్‌నూన్, బ్లాకింగ్. ఏదీ ఒక ఆట ఆడ్దామా......?''

''అరె! మిస్టర్ జేమ్స్! క్షమించండి, మరో మెంబర్—గోల్డ్‌ఫింగర్‌తో ఆడాలి......''



ఇతనికీ గోల్డ్‌ఫింగర్ అంటే ఇష్టంలేదు....

''నా కతను తెలుసు. మేమిద్దరం ఆడ్తాము...''

''అలాగే. నాకు బోలెడు పనుంది......''

''మరి నీ 'ఫీజు' మాట? అసలు గోల్డ్‌ఫింగర్అంటే నీ కెందుకిష్టంలేదు? చెప్పవోయ్ ఆల్‌ఫ్రెడ్......''

''ఆ, ఏముందండీ—తక్కిన మెంబర్లకి అతనితో ఆడాలంటే బెరుకు! నిజాయితీ ఉండాలికదండీ....

''అంటే మోసం చేస్తాడంటావా?''

''అంతమాట అన్నానా? అదుగో ఆయన కారు! పట్టి డబ్బారేకులది కదండీ?''



బాండ్ చాటుగా ఉండిపోయాడు. గోల్డ్‌ఫింగర్‌కి తను 'గాలం వేస్తున్నట్టు' అనుమానం రాకూడదు......

''క్లబ్ కి [illegible] చెప్పినా ఫరవా లేదు. [illegible]''

''ఎవరి దీ కారు—ఆడే మనిషేనా?''

''చెప్పలేనుసార్! మన మెంబర్‌దే, మిస్టర్ జేమ్స్‌బాండ్—వర్క్‌షాప్‌లో ఉన్నారు. మీరే ఆయన్ని అడగండి......''

''ఇంతకుముందే కలిశాముకదూ, మిస్టర్ బాండ్—''

''మై గాడ్! ఉలిక్కిపడ్డాననుకోండి! అరె గోల్డ్—గోల్డ్‌మాన్—ఆ—గోల్డ్‌ఫింగర్‌కదూ? మీ రెక్కడినుంచి వూడిపడ్డారూ?''



గోల్డ్‌ఫింగర్ 'ఎక్స్‌రే' చూపు బాండ్‌కి పుర్రెని దొల్చినట్లు అనిపించింది. అప్రమత్తుడయి జవాబు కోసం ఎదురు చూశాడు.

"మంచి ఆటగాడితో గొల్ఫ్ ఆడ్దామనుకున్నాను. వీతో ఆడ్తాను....."

"ప్రాక్టీసులో లేనుగాని—మీ ఇష్టం!"

"కాని ఒకటి గుర్తుంచుకోండి. నేను డబ్బుకోసం ఆడ్తాను. బంతిని ఇటూ అటూ సరదాకితడుతూ కూచోలేను......"

"మియామీలో నా దగ్గర దోచిన 10వేం డాలర్ల కోసం ఆడ్తాను—చెల్లింపయినా చేస్తాను. రెట్టింపయినాసరే......"

చేపగాలానికి తగులుకుంది ...

"జేమ్స్‌బాబూ, నే చెప్పింది గుర్తుంచుకుని అతన్నొక కంట కనిపెట్టండి........"

"థాంక్స్ ఆల్‌ఫ్రెడ్! అలాగే.....ఇక ... క్లబ్బుల సంగతి......"



గోల్డ్‌ఫింగర్ తూచినట్లు ఆడాడు. మంచి స్ట్రోక్‌లు. జాగ్రత్తగా ఆడాడు. మలుపు తిరిగే నరికి బాండ్ 'మూడు తక్కువ'లో ఉన్నాడు.


"చివరి చిల్లుదగ్గర బలేగా ఆడాడు...... బంకర్ బయటికి వచ్చినప్పుడు........"

"అవునుసార్ నే చూస్తూనే ఉన్నాను—ఇదుగో చూడండి....."

"వోహో అదా........"

"అంతేనండి. లోపలికి దిగి బంతి 'లై'ని బాగు చేసుకున్నాడు—ఇలా......అది పాత చిట్కా..... ఎప్పుడూ నెగ్గేరకం........"

"థాంక్స్ హాకర్, బాట్, బంతి ఇవ్వు— ఈ మ్యాచ్‌లో రెండోస్థానం నా కెందుకూ—?"



గోల్డ్‌ఫింగర్ మోసం మామూలుగానే సాగుతోంది—

"ముప్పయ్యేళ్లలో అటువంటి షాట్ చూడలేదుసార్—!"

'15 వ' దాంట్లో రంగు బయటపడింది—

"ఆ పుట్ గ్రీన్‌ని దాటి ఉండాలే?"

"ఓహో—హోల్‌కి ఎప్పుడూ ఛాన్స్ ఇవ్వాలి".

"ఇంకా మూడు ఉన్నాయి. ఈ మూడూ జాగ్రత్తగా గమనించాలి హాకర్—నే చెప్పేది అర్థమయిందా?"

"మీరు భయపడకండిసార్! నే నతన్ని కనిపెడ్తూనే ఉంటాము....."

(ఇంకా వుంది)

సీరియల్

రావుశాస్త్రి

వి.ఎస్.సుక్తాంకర్

4

(జరిగిన కథ : పేదరికంవల్ల ఒక షావుకారుగారి ఇంట్లో పనిమనిషి (షాగిర్ద్) గా కుదిరి తన పద్దెనిమిదవ ఏటదాకా చదువుకోకుండా ఉండిపోయిన రావ్ (శాస్త్రి) కి ఒకనాడు విద్యాభిలాష అత్యధికం అయి పని వదులుకుని కాశీ వెళ్లిపోతాడు. అక్కడ అతి కష్టంమీద పాఠశాలలోచేరి, శ్రద్ధగా చదివి గొప్ప పండితుడుగా పేరుపొందుతాడు. రావ్‘శాస్త్రి’గా మారిపోతాడు. గురువువద్ద సెలవు పుచ్చుకుని ఇంటికి వచ్చిన రావ్‌శాస్త్రి తల్లిని మరణశయ్యమీద చూస్తాడు. కొడుకు తెచ్చిన గంగాజలం, అతను శాస్త్రి బిరుదు సంపాదించుకున్నాడన్న వార్త తల్లి రాధాబాయికి సంతృప్తి కలిగిస్తాయి. అతనిని దీవిస్తూ ప్రాణాలు వదులుతుంది.)

పూనా నగర పరిసరాలలో ఒక కొండమీద ఉన్న పార్వతి దేవాలయం నేటికీ ఒక గొప్ప పుణ్యక్షేత్రం. దానిని ఆనాడు పీష్వా నానాసాహెబ్ కట్టించాడు. అది ఆయన కుటుంబానికి కులదేవాలయంగా ఉండేది. పీష్వారాజ్యంలో ఈ దేవాలయ వైభవం అవర్ణనీయం.

అప్పటికే నవరాత్రులు మొదలయి మూడు రోజులయింది. ఎందరో పథికులు వీలయినంత వేగంగా పార్వతి గుడివైపుకి వెళ్ళిపోతున్నారు. అక్కడ జరుగబోతున్న నవరాత్రయజ్ఞం చూడాలని వారి ఆదుర్దా. ఈ యజ్ఞాన్ని పీష్వా మహారావు స్వయంగా నడిపిస్తున్నాడు. ఎక్కడ ఆలస్యం అవుతుందో, అని కొందరు హడావుడిపడిపోతున్నారు.

ఇలా వెళ్ళేవారిలో ఆజానుబాహువయిన ఒక యువకుడు ఉన్నాడు. అతని దుస్తులు అతి సామాన్యంగా ఉన్నప్పటికీ, తలపాగతో ఠీవిగా, చూసే వారిలో గౌరవభావం కలిగించేలాగ కనిపిస్తున్నాడు. ‘ఎవరీ పెద్దమనిషి’ అనుకున్నారు కొందరు. ఎవరికీ ఈ ప్రశ్నకి సమాధానం తెలియలేదు. పెద్ద పెద్ద అంగలువేసుకుంటూ నడిచివెళ్ళిపోతున్న ఈ వ్యక్తి గమనానికి ఒక అంతరాయం కలిగింది. పార్వతి గుడి కొండ దగ్గరే గొడ్లమంద ఒకటి ఉంది. దృశ్యాన్ని బట్టి ఆ పశువుల యజమానులు వాటిని అమ్మివేస్తున్నారని ఈ పథికుడు గ్రహించాడు. వారిలో ఒకరిని సమీపించి నెమ్మదిగా ఇలా అడిగాడు:

“బాబూ, చాలాగొడ్లు అమ్మకానికి ఉన్నట్లున్నాయి, ఏమిటి విశేషం?”

“ఏముందయ్యా. రోజులట్లా ఉన్నాయి! మా బాధలు భగవంతుడికి తెలియాలి.....ఈప్రాంతాల్లో కరువు సంగతి మీరు వినేవుంటారు. మాకే తిండి లేక చస్తూవుంటే పాపం ఈ నోరులేని పశువులెక్కడ మేపగలం? వీటినమ్మయినా కాస్త పొట్ట నింపుకుందామని.......” అని దీనంగా జవాబు చెప్పాడు ఆ మనిషి. బక్కచిక్కిపోయిన పశువులని, వారి యజమానుల దుస్థితిని చూసిన ఆ తలపాగా వ్యక్తి ముఖంలో విషాదచ్ఛాయలు అలుముకున్నాయి. మౌనంగా ముందుకి నడిచి వెళ్ళిపోయాడు. అయితే ఇంతలోనే అతని కంటికి మరొక విషాద దృశ్యం కనిపించింది.

కొందరు చిన్నపిల్లలని బానిసలుగా అమ్ముతున్నారు వారి తల్లిదండ్రులు. దారిద్ర్యంవల్ల ఈ పని చేస్తున్నారని అడగగా తెలిసింది. అంతేకాక, యుద్ధంలో చనిపోయిన కొందరు సైనికుల సంతానం కూడా ఈ దురవస్థకి లోనయిందని తెలిసింది. ఒక పన్నెండు సంవత్సరాల బాలిక పరిస్థితి మరీ దీనంగాఉంది. విధవ అయిన ఆమె తల్లి ఏడుపు తలపాగా మనిషి కళ్ళు చెమర్చేట్లు చేసింది. బాలికని కొన్న వ్యక్తి తన వెంట రమ్మని హెచ్చరిస్తూవుంటే ఆమె తన తల్లిని, అన్న చెల్లెళ్లనీ వదలలేకపోతోంది. అసలు, దుఃఖంతో కుంగిపోయిన ఆమె కాళ్ళూ, చేతులూ ఆడటమేలేదు.

“కరువుకాలంలో పాలమే మి సాగుబడి చేస్తుంది! ఇలా తన పెద్ద కూతురిని అమ్మకనయినా కాస్త తెరిపి తెచ్చుకుందామని......” ఎవరో అన్న మాటలు తలపాగా ధరించిన వ్యక్తి చెవిన పడ్డాయి.

బాలికని గదమాయిస్తున్న మనిషితో, “అయ్యా ఆమె బెదిరిపోతోంది. కొంచెం దయతలచండి....” అన్నాడు.

అతనూ మంచివాడిలాగే కనిపించాడు. “ఏమి చెయ్యమంటారయ్యా ! కొనుక్కున్నది నా పై వారు. వారి ఆజ్ఞలని నెరవేరుస్తున్నానంతే! ఇంతకీ ఈ పిల్లని పార్వతిగుడిలో జరిగే యజ్ఞంలో ‘దాసీ దానా’నికి ఉపయోగిస్తారుట యజమాని ఎవరో కాదు, పీష్వాసాహెబ్‌వారే! సకాలంలో అక్కడికి చేరాలా?” అన్నాడు సంజాయిషీ చెప్పుకునే ధోరణిలో.

అదే సమయానికి అక్కడ పెద్ద డెక్కల చప్పుడు వినిపించింది. “కొట్వాల్‌సాహెబ్ వస్తున్నారు!” అనే వార్త అక్కడ ప్రతిధ్వనించింది” వారు సపరివారంగా వస్తున్నారు!”

కొట్వాల్, అతనితోబాటు మరికొంతమంది అశ్వికులూ అక్కడికి రానేవచ్చారు. తలపాగా మనిషిని చూడగానే కొట్వాల్ హడావుడిగా గుర్రందిగి ఆయనకి నమస్కారం చేశాడు. “మేము చెయ్యగలిగినదేమయినావుంటే సెలవివ్వండి!” అన్నాడు.

“అబ్బే—ఏమీలేదు! ఏమీలేదు!” అనేసి ఉపేక్షధోరి చకచక నడిచి వెళ్ళిపోయాడు.

“మీ కసలు బుద్ధుంటూ ఉందా !” అని కన్నెర్ర చేశాడు కొట్వాల్ అక్కడ నుంచున్నవారితో. “మన మరాఠా రాజ్య ప్రధాన న్యాయాధిపతికి తగిన మర్యాద చూపించాలని తెలీదూ! ఆయన చుట్టూ అలా ఎగబడ్తారా?”

ఆయన ఆగ్రహానికి జడిసిన కొందరు తమకి ఆ పెద్దమనిషి ఆనవాలు తెలియక అలా ప్రవర్తించామని క్షమార్పణకోసం వేడుకున్నారు. ‘సరే ఇకనయినా జాగ్రత్తగా ఉండ’మని హెచ్చరించి కొట్వాల్‌గారు తన దళంలో ఒకరిని అక్కడ కావలా ఉండి అలజడి లేకుండా చూడమని ఉత్తరువుచేసి గుర్రం ఎక్కి తమూవేగంగా గుడివైపు వెళ్ళిపోయాడు.

“ఈ బ్రాహ్మడు మన ప్రధాన న్యాయాధిపతా?”

“అవును, ఆయన పల్లకీ ఎక్కి రాక నడక సాగిస్తున్నాడేం?”

“పేదవారి బాగోగులు పట్టించుకునే పెద్దమనుషులెవరీ రోజుల్లో— పాపం ఆయనమాత్రం మంచివాడిలాగానే కనిపిస్తున్నాడు—”

ఇలా అనుకొనటం మొదలుపెట్టారు అక్కడి జనం. కొందరు తమ ప్రధాన న్యాయాధిపతిని గురించి మరికొంత తెలుసుకొనాలని అక్కడ కొట్వాల్ ఉంచి వెళ్ళిన భటుడిచుట్టూ మూగి మరికొన్ని ప్రశ్నలు వేశారు.

దేశ ప్రధాన న్యాయాధిపతిని గురించి మాట్లాడేందుకు అవకాశం దొరికినందుకు భటుడు ఉబ్బిపోయాడు. ముందు, వారందరినీ చివాట్లువేశాడు. తర్వాత వారికి రాజ్యాంగ విధానం గురించి కొంచెం చెప్పాడు. ఆ తర్వాత, “అసలు మన ప్రధాన న్యాయాధిపతిగారిపేరు రావ్‌ప్రభూణె. ఈ దేశంలో ఆయన కన్నా చదువుకున్నవాడులేడు! కాని,ఆయనకి డబ్బంటే ఆశ లేనే లేదు. నిజంగా ధర్మాత్మ అంటే రావ్‌శాస్త్రిగారే! ఇటువంటి మనిషి మన ప్రధానన్యాయాధిపతికావటం మన అదృష్టం! కొంతకాలం కిందట కాశీలో పెద్ద పండితసభచేసి శాస్త్రిబిరుదు, మహావస్త్రం సంపాదించుకున్నాడు. పాపం స్వగ్రామం మహాడ్‌కి తిరిగి వచ్చేశాడోలేదో తల్లిగారుపోయారు... ఊ!—ఆయన పాండిత్యం పీష్వాగారి చెవినపడింది. తమ కుమారుడు రాజకుమార్ మాధవరావుకి చదువు చెప్పమని కోరాడు. న్యాయాధిపతిగా ఉండమని కోరాడు! అందుకనే, తండ్రిపోయిన తర్వాత కూడా పీష్వా మాధవరావుగారికి గురువుగారంటే అంత గౌరవం! ప్రధాన న్యాయాధిపతిగా చేసేశారు!

“ఇంకా చెప్తాను వినండి ఆయన ప్రధాన న్యాయాధిపతి ఉద్యోగం చేస్తున్నాడా? కాని, ఆ ఉద్యోగానికి తగిన జీతం పుచ్చుకోననేశాడు. విద్య నమ్ముకునే బ్రాహ్మణుడు పెద్ద పాపి అంటాడు! తనకీ, తన భార్యకీ ఏటా రెండు జతల బట్టలు, రోజూ సరిపోయే తిండి—ఇవి మాత్రం పుచ్చుకుంటాడు! ప్రధాన న్యాయాధిపతికి ఇచ్చే అందలం ఎక్కడు. నౌకర్లు అనవసరం అంటాడు—ఇటువంటి న్యాయాధిపతి నెక్కడా చూడము! అసలాయన వచ్చిన తర్వాతనేకదా బీదవాళ్ల మొరవినే ప్రభువంటూ దొరికాడు...

“రాజూ, పేదా—అందరూ ఆయన కొకట్లే

ఇంత నిష్పక్షపాతి అయిన న్యాయాధిపతి ఉండడంటే నమ్మండి!''

''అరెరే—ఎంత పెద్దమనిషిని ఎంత చులకనగా చూశాము!......ఆయనని తెలిస్తే కాళ్ల మీద పడేవాడినికదా......ఇప్పటికయినా ఆయన క్షమార్పణకోసం వేడుకోవటానికేమి.....'' అనే మాటలు ఎన్నో నోళ్లనుండి వెలువడ్డాయి.

కొందరు ఆయన వెళ్లినదారినే వెళ్లటానికి ఉద్యుక్తులయ్యారు. మరికొందరు అటు వెళ్లనే వెళ్లారు. కొండ ఎక్కటానికి సిద్ధంగావున్న రామ్‌శాస్త్రిని సమీపించారు. అతను ఒక చిన్నవాగు పక్కనే నుంచుని అక్కడ తటస్థపడిన కొందరు అధికారులతో మాట్లాడుతూ ఉండటంచూసి కొంచెం వెనుకాడారు.

రామ్‌శాస్త్రి అధికారులతో వేఠ్—బిగార్ పద్ధతిని గురించి అడుగుతున్నాడు. అతను కొండ సమీపించే సమయానికి యజ్ఞానికి కావలసిన సామగ్రితో కొన్ని ఎద్దుబళ్లు నుంచుని ఉన్నాయి. వాటిని వేఠ్— బిగార్‌కోసం అధికారులు రప్పించారు. (వేఠ్—బిగార్ అంటే ప్రభుత్వం బలవంతంగా చేయించే సేవ అన్నమాట. ఈ పద్ధతి ప్రకారం పిలుపువచ్చినప్పుడు గ్రామాలలో వారు తమ గొడ్లతో బాటువచ్చి అధికారులు చెప్పినట్లు చెయ్యాలి. వేఠ్—బిగార్ మహారాష్ట్రానికి ప్రత్యేకంకాదు. భారతదేశం మొత్తం వాడుకలో ఉండేది.) అలిసిన ఎడ్లని నీరు తాగించటానికని వాగువద్ద బళ్లని ఆపినందుకు కొందరు అధికారులు బళ్లవారిని శిక్షించారు. వారికి కొరడా దెబ్బలు తగిలాయి. ఈ దృశ్యాన్నిచూసి రామ్‌శాస్త్రి చాలా బాధ పడ్డాడు. సంగతేమిటో కనుక్కొని మరేమీ మాట్లాడకుండా పార్వతి గుడికి వెళ్ళిపోయాడు. అతన్ని పలకరించటానికి ధైర్యం లేక ఆగిపోయారు వచ్చిన వారు.

అప్పటికే యజ్ఞ ప్రయత్నాలు చురుకుగా సాగుతున్నాయి. పురోహితులు, హడావుడిగా యజ్ఞగుండంచుట్టూ మూగి ఉన్నారు. మాధవరావు పీష్వా ఒక వేదికమీద కూర్చుని సంతృప్తితో ఈదృశ్యాన్ని చూస్తున్నాడు. రామ్‌శాస్త్రిని చూడగానే అవసరంగా దిగివచ్చి అతనిని సగౌరవంగా ఆహ్వానించాడు. తనతోబాటు వేదికమీద కూర్చోబెట్టారు.

''తమరితో అతి ముఖ్యమయిన విషయం గురించి మాట్లాడుదామని వచ్చాను. రాజభవనంలో తమర్ని కలుసుకునే అవకాశం లేకపోయింది. మన్నించాలి'' అన్నాడు రామ్‌శాస్త్రి గంభీరంగా.

''ఎంతమాట! నాతో ఎప్పుడయినా ఏ విషయం గురించిఅయినా మాట్లాడే హక్కుమీకు కాక మరెవరికుంది? పాపం ఎండలో ఇంత దూరం నడిచి వచ్చారన్నమాట! ఈ మూడురోజులూ భవనంలో ఉండక పోవటానికి కారణం ఈ యత్నం హడావుడివల్లనే.... ఇదీ మనదేశ క్షేమానికేకదా!''

రామ్‌శాస్త్రి వెంటనే జవాబు ఇవ్వలేదు. ఇంతకి ముందు బానిసగా అమ్ముడు పోయిన అమ్మాయిని అప్పుడే అక్కడికి తీసుకు వచ్చారు. ఒక బ్రాహ్మణుడికి దానంగా ఇవ్వటంకూడా జరిగి పోతోంది. భయంతో ఏడుస్తున్న ఆ పిల్ల కొంగుని ఆ బ్రాహ్మణుడి పంచకి ముడివేసి మంత్రపఠనంతో అతనికి ఇచ్చివేశారు.

రామ్‌శాస్త్రి ఈ దృశ్యాన్ని సూచిస్తూ, పీష్వాతో వినయంగా, దృఢమయిన స్వరంతో, ఇలా అన్నాడు: ''ప్రభువులు యజ్ఞకాండని సక్రమంగా చేయిస్తున్నారనటానికి సందేహంలేదు. ఈ దాసీదానాన్ని చూడండి— అమ్మాయి పాపం! తల్లి ప్రేమని నోచుకోలేక అమ్ముడుపోయింది. ఇప్పుడు ఏలినవారి రాజ్యక్షేమంకోసం దానంగా ఇచ్చేస్తున్నారు. ఈ దారుణమయిన దానం నిజంగా దేవతలకి సంతృప్తి కలిగిస్తుందా?''

పీష్వా సమాధానం ఇచ్చేలోపుగా రామ్‌శాస్త్రి తిరిగి ఇలా అన్నాడు:— ''ఈరోజు నాకు చాలా విషయాలు తెలిశాయి. యుద్ధంవల్ల దేశంలో నరహీనం వచ్చింది. నిరుపేదలయిన పల్లెజనం తమ పశువులనేకాక, పిల్లలని సయితం అమ్ముకుంటున్నారు. నిప్పుమీద ఆజ్యంపోసినట్లు, మన రాజ్యాధికారులు వేఠ్—బిగార్‌తో వారిని మరింత హింసపెడుతున్నారు!

''ఏలినవారు నన్ను క్షమించాలి! నాకే కాక సకల మహారాష్ట్ర సామ్రాజ్యానికీ మీరు ప్రభువులు! స్వతంత్రించి మాట్లాడుతున్నందుకు నన్ను అపార్థం చేసుకొనవద్దని కోరుతున్నాను! ఈ యజ్ఞ యాగాలు చేయించటంకన్నా పరిపాలనమీద కొంత దృష్టి సారించారంటే దేశానికి మరింత మేలు చేసినవారవుతారు. ధర్మప్రభువులు, మీకు ఇది తెలియనిదికాదు! ఎన్ని శాస్త్రాలు చదివినా, ఎంతజ్ఞానం సంపాదించుకున్నా తోటి మానవుని బాధని సహించలేక కరుణతో కన్నీరు తుడిచినప్పుడు లభించినంత పుణ్యం రాదంటారు!''

ఇలా అనేసి రామ్‌శాస్త్రి మరొకసారి పీష్వాకి వంగి నమస్కరించి గబ గబ యజ్ఞశాలని వదిలి వెళ్ళిపోయాడు.


* * *

మర్నాడు రాజధాని ఒక వింత వార్తతో మారుమోగిపోయింది. నవరాత్రి ముగిసేదాకా వదిలి రారనుకున్న పీష్వా మాధవరావు యజ్ఞశాలని మధ్యలోనే ఆ దినమే తిరిగి వచ్చేసి రాచకార్యాలలో మునిగి పోయారుట!

మరి రెండు దినాలు గడిచాయి. ప్రజలని మరొక వింత సంభ్రమాశ్చర్యాలతో ముంచివేసింది. ప్రతి వీధిలోనూ దండోరా వేస్తున్నారు.

''వినండహో! పీష్వావారు పుణ్యప్రతాప్ మాధవరావు సాహెబ్‌వారు సెలవిచ్చేదేమనగా ఈనాటి నుంచీ ప్రభువులు వేఠ్—బిగార్ పద్ధతిని రద్దు చేస్తున్నారు! వినండి! వినండహో! ఇకపైన వేఠ్—బిగార్ అనుసరించిన వారందరినీ పీష్వావారు కఠినంగా శిక్షిస్తారు! వినండి వినండహో—''

(సశేషం)





మురళీకృష్ణ

"నను పాలింప.. నడచి.. వచ్చితివో..." శ్రావ్యమైన కంఠంతో మధురంగా పాడుతోన్న పాట విన వడగానే అలవాటు ప్రకారం కాళ్ళు ఆగిపోయాయి. గత నాలుగైదురోజులుగా తను అక్కడకు వచ్చేసరికి ఆ పాట వినపడడం, తనకు తెలియకుండానే ఆగి పాట పూర్తయేవరకు విని వెళ్ళడం జరుగుతోంది. ఆవిడ ఆ అరుగు మీద కూర్చొని సంగీత పాఠాలు చెప్పడం తనకు కొత్తేమీకాదు, కాని యింతకుముందు తానా విషయానికంతగా ప్రాధాన్యత నిచ్చేవాడు కాదు. సాయంత్రం కాలేజీ నుండి యింటికి రాగానే, వదిన యిచ్చిన కాఫీ త్రాగాక, బట్టలు మార్చుకొని పార్కుకు వెళ్ళి విశ్రాంతి తీసుకోవడం తన కలవాటు. కాని యీమధ్య కొన్నాళ్ళుగా పార్కుకని వెడుతూ రాజ వీధి మలుపు తిరిగి దీక్షితులవారి ఎత్తు అరుగుల యింటి దగ్గరకు వచ్చేసరికి, "నను..పాలింప.." పాట శ్రావ్యంగా విన్పించడం, పాట పూర్తిగా విన్న తర్వాత గానీ కదలకపోవడం నిత్యకృత్యమైంది. తన కిష్టమైన మోహనరాగం ఆవిడ ఆలాపించడంలో వుందో లేక మోహనరాగం పాడడంతో ఆవిడ కనపర్చే ప్రత్యేకత ఏమైనా వుందో లేక త్యాగరాజు మోహనరాగంలో తన సాహిత్యాన్ని మేళవించిన పద్ధతిలో వుందో తనకు తెలియదు కాని ఆపాట ఆవిడ పాడే పాటలన్నింటిలోకి ప్రత్యేకంగా వుంది. రోజూ ఐదారు నిమిషాలసేపు తనను ఆకట్టుకొని నిల్చుండేలా చేస్తోంది.

అప్పటినుండి ఆవిడను గురించి తెలుసుకోవాలని వుంది. కాని ఓ యువతి ఆడపిల్లలకు సంగీత పాఠాలు చెపుతున్నపుడు, రోడ్డు మీద నిల్చొని వినడమే కొందరి దృష్టిలో అసభ్యతగా కన్పడవచ్చు. ఇక ఆవిడ వైపు నిశితంగా చూడడంకాని, ఆవిడను గురించి ఆరా తీయడంకాని చూస్తే, మరి చెప్పక్కర్లేదనుకొని, పార్కు వైపు కాలు సాగించడం జరుగుతోంది రోజూ. అయినా మోహనరాగం సృష్టించిన ఆసక్తి నా ఆతృతని పెంచింది.

ఓ పెండ్లికాని అమ్మాయిని గురించిన వివరాలు అమ్మనడిగే ధైర్యంలేక, అమ్మలేని సమయం చూచి వదిన నడిగాను. "ఏమిటి విశేషం?" అంటూనే చెప్పింది వదిన. సారాంశం ఏమిటంటే—ఆవిడ పేరు 'సరస్వతి.' తాలూకాఫీసు గుమాస్తా సుందరరామయ్యగారి ఏకైక పుత్రిక. చక్కగా కర్ణాటక సంగీతం పాడుతుంది. ఏదో మధ్యతరగతి కుటుంబం గనుక చుట్టుపట్ల వున్న అమ్మాయిలకు సంగీత పాఠాలు చెపుతుంది. మేమున్న వీధికి వాళ్ళున్న యిల్లు కాస్త దూరం కాబట్టి వదినకూ ఆవిడకూ పెద్ద పరిచయం లేదు. కాని రెండుమూడు సార్లు పేరంటంలోనో, దేవాలయంలోనో మాట్లాడిన పరిచయం మాత్రం వుంది. కాకపోయినా వుద్యోగాలు చేసే అమ్మాయిలంటేనూ, ట్యూషన్లు చెప్పే అమ్మాయిలంటేనూ సొసైటీ కాస్త యింటరెస్టు చూపుతుంది కాబట్టి, వదిన ఆ ఇన్‌ఫర్మేషన్ యివ్వగలిగింది.

ఆరాత్రి పెరట్లో కొబ్బరిచెట్టు క్రింద వెన్నెలలో పడుకొని 'మోహనరాగం' కూనిరాగాలు పాడుకొంటున్నపుడు ఆవిడ మధురగానం జ్ఞాపకం వచ్చి నా సంగీతం ఆపివేశాను. వచ్చీరాని నా సంగీత జ్ఞానంతో ఆ పాటకూ—త్యాగరాజుకూ అన్యాయం చేయడం యిష్టంలేక! ఆవిడ పేరు 'సరస్వతి' అనే కంటే 'సుగాత్రి' అనివుంటే మరింత బాగుండుననిపించింది. నిద్రకి ఒరిగే ముందు ఆవిడ నా అభిమాన వ్యక్తి అయిందని నిర్ణయించుకొని, మరీ నిద్రపోయాను.

మరురోజు సాయంత్రం మళ్ళీ దీక్షితుల వారి ఎత్తు అరుగుల యింటి ముందు ఆవిడ 'మోహన' నన్ను సమ్మోహితుణ్ణి చేసి నిలవేసింది. వాళ్ళ వాకిలి ప్రక్కన వున్న మునిసిపాలిటీవారి సువాసనను లెక్కజేయక కళ్ళు మూసుకొని నిల్చొన్న నేను—ఎవరో పిలిచినట్లయి యీ లోకంలోకి వచ్చాను. చేతితో తట్టి పిలిచిన వ్యక్తి వైపు చూశాను పరిశీలనగా! ఆ పెద్దమనిషికి యాభై యేళ్ళుంటాయి. నెరిసిపోయిన తల—ముక్కు మీదకు జారిన సులోచనాలు జీవితంలో అలిసిపోయి వంగిపోతున్న శరీరం అక్కడక్కడా అతుకులు కన్పించే పొడుగాటి చొక్కా—ఓ చేతిలో గొడుగు మరో చేతిలో నిండుగా పైళ్ళు—చూడగానే చెప్తున్నాయి ఆయన గుమాస్తాగిరి వెలిగిస్తున్నారని! "బాబూ! రోజూ సాయంత్రం చూస్తున్నాను, ఏమిటి పాటేనా వింటున్నారు?

మా అమ్మాయే పాడేది." "మా" అన్నచోట నొక్కి పలుకుతున్నప్పుడు ఆయన కళ్ళలో మెరుపు నేను గమనించకపోలేదు.

"కావండి..." వినయంగా జవాబు చెప్పాను.

"లోపలికి రండి! అక్కడ కూర్చొని విందురు గాని"—అన్న ఆయన ఆహ్వానం ఓవిధంగా వింతని పించింది నాకు. ఎందుకంటే ఓ అమ్మాయి పాడే సంగీతం, అందులోనూ శ్రావ్యంగా వున్నప్పుడు వీధిలో పోయే వారికి ఆసక్తిజనకం కావడంలో ఆశ్చర్యంలేదు. చాలాగా ఎంతోమంది ఆవిడ గానాన్ని రోడ్డు మీద నుండే వింటూండవచ్చు. తత్ఫలితంగా వీధిన వెడుతూ కొంతసేపు ఆగి పాట విని వెళ్ళే శ్రోతలు ఆయనకూ క్రొత్త కాకపోవచ్చు. అలాంటప్పుడు ఆయన ఆహ్వానం నాకు కొంచెం సంకోచం కల్గించిన మాట నిజమే.

"అక్కడే నిలబడ్డారేం? ఫరవాలేదు లోపలికి రండి!" అని ఆ పెద్దమనిషి మరోసారి అనడంతో ఆయ నన్ననుసరించాను.

మేము లోపలి కడుగు పెట్టేసరికి, ఆరోజు పాఠం పూర్తయింది కాబోలు శిష్యురాండ్రందరూ యిండ్లకు వెళ్ళే సంభ్రమంలో వున్నారు. వాళ్ళందరూ బయటకు వెళ్ళే దాక ఓ ప్రక్కన నిల్చొని, తరువాత అరుగు మీద కూర్చొన్నాము.

"అమ్మాయ్! ఓ సారి యిలా రామ్మా" పిలిచా రాయన.

గుమ్మం దగ్గిర గాజుల చప్పుడుకు దృష్టి నటు వేపు మళ్ళించాను. రోజూ నన్నాకట్టిన 'మోహన' రాగాలాపన కర్తను దగ్గర నుండీ మొదటిసారిగా చూశాను. ఇరవై వసంతాలు నిండిన ఆ సంగీతమూర్తి పెద్ద అందకత్తేమీ కాదు, కాని ఆ కళ్ళలో ఏదో ఆకర్షణ వుంది!

"మా అమ్మాయి సరస్వతి!".... "చూడమ్మా! వీరు రోజూ నీ పాటకోసం మన గుమ్మం దగ్గర గుడారం వేస్తున్నారు. ఈరోజు లోపలకు వచ్చారు నా ఆహ్వానంతో.." ఇరువురినీ పరిచయం చేశారు సుందరరామయ్య.

చిరునవ్వుతో సిగ్గును మిళాయించి, "నమస్కారం" అంది ఆవిడ. అది కూడా మోహనంగానే వుందనిపించింది.

నన్ను గురించి వారికేం తెలియదు కాబట్టి నన్ను నేను వివరంగా పరిచయం చేసుకోక తప్పలేదు. 'ఫలానా' అని చెప్పగా, మా వదినను తనకు కొద్దిగా తెలుసునంది. "మా యిద్దరికీ కాఫీ కలిపి తీసుక రామ్మా! మీ అమ్మనడిగి!" అన్నారాయన గోడకు చేరగిలబడి.

కాసేపు నిశ్శబ్దం రాజ్యం చేసింది. మాటలెలా సాగించాల్లో తెలియలేదు నాకు. ఏమిటో ఆలోచిస్తున్నారు సుందరరామయ్య.

లోపలి నుండి ఏవో మాటలు విన్పించాయి అప్రయత్నంగానే నా చెవులటు వైపు కేంద్రీకరించాయి.

"ఆయనకేం! చెపుతూనే వుంటారు మహారాజు! మింగ మెతుకు లేకపోయినా మీసాలకు సంపంగి నూనె కావాలన్నాడట, అలా వుంది. ఈ అతిథి మర్యాదలలోనూ, బంధుప్రేమతోనూ యింత స్థితికి వచ్చింది సంసారం...సరే! ప్రక్కయింటి కెళ్ళి రెండు చెంచాలు కాఫీపొడి పట్రా సరసూ!" మాటలలో విసుగు స్పష్టంగా ధ్వనించింది. పాపమూ యిల్లాలు ఎంత బాధ పడుతోందో!

"వాళ్ళింటి కెళ్ళనమ్మా! ఇప్పటికే రెండుమూడు సార్లు కాఫీపొడి, పంచదార యింకా ఏవో బదులు తెచ్చాను. అన్నింటికీ వెడితే—" అర్థోక్తిలో ఆపింది దీనస్వరంతో.

"ఎలాగో అడిగి తీసుకురా తల్లీ, ఏంచేద్దాం"

"............."

ఆ తర్వాత మాటలు వినబడలేదు... లోపలి కెందుకు వచ్చానాని బాధ, ఈయన కాఫీ కెందుకు చెప్పి పంపాడా అన్న చింత కలిగింది నాకు.

ఇంతలో సుందరరామయ్య ఏదో చెప్పనారంభించారు.

"రేపు శ్రావణమాసంలో ముహూర్తాలు పెట్టుకొన్నాం నాయనా అమ్మాయికి! ఎలాగో దాన్నొక అయ్య చేతిలో పెడితే నాకు సంతృప్తి. అయినా మా అమ్మాయికేం తక్కువయ్యా? అదృష్టం దాని నొసటనే వ్రాసుంది. కాకపోతే అంతటి ఐశ్వర్యవంతులు వాళ్ళంతట వాళ్ళు రావడమేమిటి, వెంటనే అన్నీ స్థిరపడిపోవడమేమిటి చెప్పు?... అబ్బాయి తండ్రికి పాతికెకరాల మాగాణి, నాలుగైదు ఎకరాల మామిడి తోటలు, రెండు 'ల' కారాల రొక్కం—యింతకు మించి ఏం కావాలి మరి?!.. అసలు అది పుట్టినప్పుడే నాకు తెలుసు—దానికోసం ఏ మహారాజో వెతుక్కొని వస్తాడని!..."

"నాన్నా! కాఫీ!" అమ్మాయి పిలుపుతో వుపన్యాస ప్రవాహానికి ఆనకట్ట వేశారాయన. కాఫీ తాగుతూ ఆలోచించాను నేను... ఆయన చెప్పిన సంబంధం తాలూకు వివరాలు కాస్త ఎబ్బెట్టుగా కన్పించాయి. ఆయన చూస్తేనేమో మామూలు గుమాస్తా—అంత పెద్ద సంబంధం తేవడ మేమిటి, వారితో సరితూగడ మేమిటి? అనిపించక పోలేదు.

ఇంతలో సుందరరామయ్య కాఫీ ముగించి, మళ్ళీ వుపన్యాసం సాగించారు. "అంత పెద్ద సంబంధం కలిసి వచ్చేటప్పుడు, ఏడువేల కట్నమేపాటు అంటారు? అసలు లాంఛనంగా వారు అడిగారు కాని ఏడువేలు వారికేమూలకు లెక్క? ఆఁ!... అయినా మా 'సరస్వతి'కేం లోపమండీ? అసలది వారింటి కోడలు కావడం వారి అదృష్టం కదూ!.."

ఈ సంభాషణతో ఆయన స్వభావం కాస్త పసిగట్టగలిగాను. ఉన్నది లేనిది కల్పించుకొని గొప్పగా చెప్పుకొనే తత్వంగా కన్పిస్తోంది ఆయన ధోరణి. ఏదో సామెత చెప్పినట్లు, "ఇంటివారు కస్తూరి వారు..." అన్న రీతిగా! దాదాపు నెలరోజులలో జరుగ బోయే వివాహానికి అన్నివేలు సర్దగలందుకు ఆయన భరోసా ఏమిటో?... అయినా అంత తక్కువ వ్యవధిలో ఎదుటి వ్యక్తిని గురించి అంచనా వేయడం భావ్యం కాదేమోననుకొన్నాను!

"చీకటి పడుతోంది. వెళ్ళొస్తానండీ!" అంటూ లేచాను.

"అప్పుడప్పుడు వస్తూండు నాయనా!...నాకోసం కాకపోయినా మా 'చెల్లాయి' పాట కోసమైనా"

ఆయన సంబంధం కలిపిన తీరు ఆశ్చర్యమేసింది. కాని మరుక్షణంలోనే ఎంతో సంతోషించాను.. ఆ 'సుగాత్రి' చేత 'అన్నయ్య' అని మధురంగా, ఆప్యాయంగా పిలిపించుకోగలిగిన అవకాశం కలిగినందుకు.

"అలాగేనండీ!..." అని ఆయన వద్ద సెలవు పుచ్చుకొని, గుమ్మం వైపు చూశాను. చేతి వేళ్ళతో చీర చెరగు మెలివేస్తూ నిల్చొని ముసిముసిగా నవ్వింది.

"వెళ్ళొస్తానమ్మా." నాకు తెలియకుండానే కంఠంలో ఆప్యాయత ధ్వనించింది.

"మంచిదన్నయ్యా! మీ అభిమానానికి కృతజ్ఞురాలిని!.. ఆ! వీలున్నప్పుడు మీ వదినగారి నోమాటు మాయింటికి తీసుకరండి" అంది సరస్వతి.

సమాధానంగా తలవూపి, మెట్లు దిగి రోడ్డు మీదకు వచ్చేశాను....

ఆ రాత్రి భోజనం చేస్తూ జరిగిన సంగతి అమ్మకూ, వదినకూ చెప్పాను.

"అబ్బాయిలతో మాట్లాడేందుకే సిగ్గుపడే వాడివి, అమ్మాయితో ఎలా మాట్లాడేవయ్యా వేణూ!" అంటూ నవ్వింది వదిన.

"పోనీలే! 'అన్నయ్య' అని పిలిచే వారెవరూ లేరని కొరవ పడేవాడివిగా, నీ ముచ్చట తీరి ఓ 'చెల్లెలు' దొరికింది" అంది అమ్మ. ఆమాట నిజమే! అమ్మకు ఆడపిల్లలు లేనందున, 'ఎవరైనా చెల్లెలుంటే, బాగుండు'నని నేను అనుకొనేవాణ్ణి. అమ్మ అన్నట్లు ఇప్పుడా ముచ్చట తీరింది.

"నిన్నెపుడయినా వాళ్ళింటికి తీసుక రమ్మంది వదినా" అన్నాను సరస్వతి తరపున ఆహ్వానిస్తూ.


"....." వదిన జవాబు చెప్పలేదు. అమ్మ వంక చూచింది.


"వెళ్ళిరా శాంతా! తీరినప్పుడెపుడో సాయంత్రం వెళ్ళి, తర్వాత మనింటికి తీసుక రావమ్మా! వస్తూ పోతూ వుంటేనే పరిచయాలు, స్నేహాలు ఏర్పడేది." అమ్మ గ్రీన్ సిగ్నల్ యిచ్చింది.

ఓ రెండు మాసాలు గడిచాయి. మా రెండు కుటుంబాల మధ్య పరిచయం బాగా పెరిగింది. కనీసం రెండురోజుల కొకసారైనా నేను యింట్లో వున్న సమయంలో యింటికి వచ్చేది సరస్వతి.. 'అన్నయ్యా', 'అన్నయ్యా' అంటూ తెగ మాట్లాడి, నన్ను మాట్లాడించేది. ఇద్దరి మధ్యా ఏ అరమరిక, దాపరికం లేని సన్నిహితులయ్యాము. ఆడపిల్లలు లేని కొరత 'సరస్వతి'తో తీర్చుకొనేది అమ్మ. అంతగా చేరిపోయింది మా కుటుంబంలో సరస్వతి!

కాని యీ మధ్యకాలంలో ఓ ముఖ్యసంఘటన జరిగింది. బహుశా ఆ సంఘటన జరిగిన తర్వాతనే, మానసికంగా క్రుంగిపోయిన సరస్వతిని ఓదార్చడం మూలాన నేనూ సరస్వతీ మరింత సన్నిహితులయ్యామేమో అనిపిస్తుంది. గతమాసంలో జరుగవలసిన సరస్వతి పెండ్లి అర్థాంతరంగా ఆగిపోవడమే ఆ సంఘటన! తల్చుకొంటేనే యిప్పుడు గూడా ఎంతో బాధ వేస్తోంది!!

సుందరరామయ్య గారితో మొదటిసారిగా పరిచయమైనప్పుడు ఆయనను గురించి నాలో పొడసూపిన భావం అక్షరాలా నిజమైంది. పైపెచ్చు సరస్వతితోడి సన్నిహితత్వం వలన ఆయనను గూర్చి మరింత తెలిసింది. ఏమాత్రం లేకపోయినా బోలెడున్నట్లు యితరులతో చెప్పుకోవడం ఆయనే స్వభావం. అది ఎలాంటి పరిణామాలకు దారి తీస్తుందా అన్న యోచన ఆయనకు కలుగదు. దానికి తోడు కాస్త 'అహం' వున్న వ్యక్తి. అవసరం వున్నప్పుడు యెదుటివాడిని చేయి చాపి అడగడం యిష్టంలేకపోయినా





తెలివిగా సంపాదించి అవసరం గడుపుకోవడం ఆయనకు చేతకాదు. తన వారెవరైనా అవసరం గ్రహించి తెచ్చి యిస్తే పుచ్చుకొంటాడు, అదీ ఏదో వాళ్ళ తృప్తికోసం తీసుకొంటున్నట్లు—ఈ తత్వమే సరస్వతి వివాహం ఆగిపోవడానికి కారణమైంది.

పిత్రార్జిత మంటూ ఓ ఎకరం పొలం తప్ప మరేం లేదు. నెలయేసరికి చేతిలో పడే నూటపాతిక రూపాయల జీతం, సరస్వతి సంగీతం ట్యూషన్ల వలన వచ్చే ఓ పాతిక రూపాయలు. ఈ సంపాదనతో యిల్లు గడవాలి. పక్షవాతంతో మంచంలో తీసుకొంటోన్న ముసలి తల్లి మందులూ మాకులూ, భర్తపోయి పుట్టింట్లో చేరిన చెల్లెలూ, బిడ్డలూ—అందరూ కలిసి యింట్లో ఏడెనిమిది మంది జనాభా—'బ్లాక్ మార్కెట్'లో తప్ప మామూలు ధరలకేవీ లభించని రోజులు—ఈ పరిస్థితిలో ఏదో తగిన సంబంధం మాడక అందని పళ్లకు అర్రులు చాచినట్లు పై అంతస్తులకి సంబంధం చూడడం, వాళ్ళు లాంఛనంగా అడిగిన కట్నం ఏడువేలు ఏపాటులే అన్నట్లు చెప్పడం—నిజంగా సుందరరామయ్య మూర్ఖత్వానికి, లేని డాబుసరి నటించే తత్వానికి నిదర్శనం.

ముహూర్తం నిశ్చయంచేసుకొన్న రోజు పెండ్లి వారు కట్నం డబ్బును గూర్చి ఓ నిబంధన పెట్టారు. వివాహానికి మూడురోజుల ముందుగా ఐదువేల రూపాయలు అందజేయాలనీ, లగ్నం సమయంలో మిగతా డబ్బు యివ్వాలనీ చెప్పారు. బావిలో నీరు చేది అందివ్వగలిగేంత నిశ్చింతగా, సరేనన్నారు సుందరరామయ్య. ఉన్న ఎకరం పొలం అమ్మగా మూడువేలకంటే ఎక్కువ రాలేదు. మిగిలిన మొత్తం ఎలా తేవడమూ అన్న చింత సుందరరామయ్యకు పెండ్లి పదిరోజుల సమీపానికి వచ్చేవరకుగానీ కలుగలేదు.

సుందరరామయ్య బావమరదు లిద్దరూ వూళ్లోనే వున్నారు. పెద్దతను విశ్వనాథం. నెల్లూరులో పేరు పొందిన క్రిమినల్ లాయర్. కారులో తప్ప నేల మీద కాలు మోపే అవసరం లేని స్థితి ఆయనది. రెండో బావమరది రంగనాయకులు. కొన్నాళ్ళు మైకా వ్యాపారం చేసి, లాభం గడించి ప్రస్తుతం రాజకీయ వ్యాపారం చేస్తున్న వ్యక్తి. ఆయన కూడా బాగా కలిగినవాడే! సుందరరామయ్య తన అవసరానికి వారిని చేరి ఏమాత్రం అడిగినా వాళ్ళు, ముందు నిలబడి అన్నీ చేసేవాళ్లే! తాను వెళ్ళి 'దేహి' అని అడుగక్కర్లేదు. మాచనప్రాయంగా అడిగితే చాలు! కాని సుందరరామయ్యలో వున్న దుర్గుణం అదే! "తను వెళ్ళి వాళ్ళనడిగే దేమిటి? తన కుమార్తె పెండ్లి విషయం వాళ్ళకు తెలియదూ? వారే వచ్చి పలుకరించి, అవసరం తీర్చవలసిన బాధ్యత వాళ్ళకు లేదూ" అన్నది సుందరరామయ్య నిశ్చితాభిప్రాయం. దానికి తోడు పరిచయస్థుల వద్ద బావమరదులను గూర్చి నిందా పూర్వకంగానూ, నిరసనగానూ మాట్లాడడం చేత, సరస్వతి పెళ్ళి విషయంలో వాళ్ళిద్దరూ దూరంగానే వుండిపోయారు. కాని చెల్లెలి మీద ప్రేమతోనూ, మేనకోడలి మీద అభిమానంతోనూ చెరొక వేయి రూపాయలు పంపారు మరో మూడో మనిషి ద్వారా... ఎలాగో మొత్తం కలిసి ఐదువేలు సమకూడింది. ఇక మరి మిగిలిన రెండువేల కట్నం, లాంఛనాలకు పెండ్లి ఖర్చులకు మొత్తం కలిపి మరో నాలుగు వేలయినా కావాలి. నిశ్చితంగా వ్యాఖ్యానాలు చేస్తూ రోజులు వెళ్ళదీశారు సుందరరామయ్య.

పెండ్లి అయిదురోజులుంది.. పత్రికలూ అవీ తాహతుకు మించి భారీఎత్తులో అచ్చువేయించి పంచిపెట్టారు. బంధువులు ఒకరొకరే రాసాగారు. పెండ్లి పనులు ఒకదాని వెంట మరొకటి చురుకుగా సాగిపోయాయి.

ఆ సాయంత్రం చీకటి పడిన తర్వాత సరస్వతి మా యింటికి వచ్చింది. అమ్మతోనూ వదినతోనూ మాట్లాడాక నా గదిలోకి వచ్చింది, చేతిలో కొన్ని శుభలేఖలు పుచ్చుకొని.

"ఏమిటిది సరస్వతీ! నీవే అందరినీ స్వయంగా ఆహ్వానించేలా వున్నావే?" అని పలుకరించాను.

"అందరినీ కాదన్నయ్యా! అప్తులను, స్నేహితురాండ్రను మాత్రం." చేతిలో వున్న శుభలేఖల్లో నుండి ఒకటి తీసింది.

"ఇదుగో అన్నయ్యా!" అని నా చేతిలో శుభలేఖ వుంచి, "ఆశీర్వదించు చెల్లెలిని" అంటూ అమాంతం మోకాళ్ళ మీద కూర్చొని నా పాదాలు పట్టుకొంది. ఆక్షణంలో ఏమని జవాబు చెప్పాలో తోచలేదు నాకు.

"లే చెల్లాయ్!" అని లేవదీస్తుండగా, ఆమె కనుకొలకులలో నుండి రెండు కన్నీటి బొట్లు నా పాదాలపై బడ్డాయి.

"ఏమిటిది సరస్వతీ! శుభమా అంటే, కంట తడి...?"

"కాదన్నయ్యా!..." మరేదో చెప్పబోయింది కాని గొంతు జీరవోయింది.

కన్నీళ్ళు తుడుచుకొని నా వైపు చూసింది. నిశితంగా ఆవిడ కళ్ళలోనికి చూచాక గ్రహించగలిగాను—అవి ఆనందభాష్పాలేకాని దుఃఖాశ్రువులు కావని! కన్నెమనసులోని తీయని వలపు తలపులు, రాబోయే వైవాహిక జీవితంలోని మధురానుభావాల వూహలు, ఇంకా మరేవో మాటల కందని ఆశలు, కోరికలు, భావాలు ఆ కళ్ళలో ప్రతిఫలించాయి ఆక్షణంలో!!

చెమ్మగిల్లిన కళ్ళతో మౌనంగా మనసులోనే ఆశీర్వదించాడు.

"అన్నయ్యా! నీవు రేపటినుండే సెలవు పెట్టాలి. చూచేవాళ్ళు నిజంగా మా అన్నయ్యే పెండ్లి జరిపిస్తున్నట్లుండాలి. అమ్మను, వదినను రెండురోజుల ముందే పంపించాలి..." ఇంకా ఏదో చెప్పుకపోయింది, అమాయకంగా సంబర పడిపోతూ.


"నీవింతగా చెప్పాలా చెల్లాయ్! నాకు మాత్రం తెలీదుటమ్మా! స్వంత చెల్లెలు కాకపోయినా నీవు నాకు దేముడిచ్చిన చెల్లెలివి. అంతేకాదు, 'మోహన' మనోహరంగా పాడి నన్నాకట్టిన చెల్లాయివి. నిజంగా ఇన్నాళ్ళకూ నీ పాటకు సార్థకత ఏర్పడింది. 'నిను పాలింప...'ఆ అదృష్టవంతుడు వడచి నీదగ్గరికు వచ్చాడు కదూ సరస్వతీ!...ఆ! ఇంతకూ బావగారెలా వుంటారేమిటి?" అనేసరికి సరస్వతి బుగ్గలు జడలోని ముద్దమందారతో పోటీపడ్డాయి.

సిగ్గుతో ముడుచుకు పోయింది క్షణకాలం!

"వెళ్లొస్తానన్నయ్యా! స్నేహితురాళ్ళిళ్ళకు వెళ్ళి శుభలేఖ లివ్వాలి" అంటూ వెళ్ళిపోయింది సరస్వతి.

ఆ మరునాడు సాయంత్రం సుందరరామయ్య చెప్పి పంపగా కాలేజీ నుండి రాగానే వాళ్ళింటికి వెళ్ళాను. నే వెళ్లేసరికి ఎవరో నలుగురైదుగురు కూర్చొని డబ్బు విషయం మాట్లాడుతున్నారు. వారిని పరిచయం చేశారు సుందరరామయ్య. వరుడి తండ్రి, మేనమామ ఒప్పందం ప్రకారం ఐదువేల రూపాయలు పుచ్చుకోవడానికి వచ్చారు. మిగిలిన వారు ఇరుగుపొరుగువారు.

"మీరెన్ని చెప్పినా లాభంలేదు సుందరరామయ్య గారూ! మాట అన్న తర్వాత నిలకడ వుండాలి. ఆరోజు సరేనన్నారు కదా. ఇప్పుడు మూడువేలు చేతిలో పెడితే ఎలా?.... ఏంలాభం లేదు" చాలా నిష్కర్షగా



పెద్దాయన పలికి పోయినాడు. "అయినా కూడా ఏమి కూర్చాను రామశేషయ్యగారూ! కానీ పెండ్లి ఖర్చులు క్రిందనే ఖర్చయింది. మిగతా సైతం ఆ రోజుకు సర్దుతాను గదా!" అని అబ్బాయి తండ్రి వైపు చూశారు సుందరరామయ్య.

ఆయన తనదేమీ లేనట్లు తన బావమరిది వైపు చూశాడు. కాని అతడు ఏమాత్రం లొంగలేదు. సుందరరామయ్య ఎన్నోవిధాల బ్రతిమాలాడు. అక్కడున్న అందరూ చెప్పి చూశారు. నా చేతనయింతవరకూ నేనూ ప్రయత్నించాను. ఊహూ! తాము పట్టిన కుందేటికి కాళ్ళే లేవన్న వాదం వాళ్ళది! చివరకు, చేతిలో వుంచిన డబ్బును విసిరికొట్టి ఈ సంబంధం, ఈ పెండ్లి ప్రయత్నాలు మానుకోమని, నిర్దాక్షిణ్యంగా వెళ్ళిపోయారు.

ఏమైతేనేం, సుందరరామయ్య అత్యాశ వలన మూడురోజులలో జరుగబోయే సరస్వతి పెళ్ళి అర్ధాంతరంగా ఆగిపోయింది. జరుగుతోన్న పెళ్ళి పనులన్నీ ఎక్కడివక్కడే నిలిచిపోయాయి. వచ్చిన బంధువర్గం సుష్టుగా తిని, తర్వాత నాలుగు రకాలుగా దుయ్యబట్టి వెళ్ళిపోయారు. వీధిలోని వాళ్ళు పలువిధాలుగా విమర్శించారు. అసలు ప్రస్తుతం లోకంలో జరిగేదేమిటంటే—ఏ కారణం చేతనో ఏ సంఘటన జరిగితే దానికి పలుకారణాలు కల్పించి పెంచిపోషించినంతవరకూ ప్రచారం చేసి ఆ వ్యక్తిని మానసికంగా హింసించి, తాము సంతోషించడం!

సరస్వతి యీ సంఘటనతో చాలా క్రుంగిపోయింది. వీధి ముఖం చూడడానికి కూడా జంకింది చాలా దినాలు. నేను వెళ్ళినప్పుడు, 'అన్నయ్యా!' అని చేతులు పట్టుకొని కన్నీళ్ళు పెట్టుకొనేది. ఓదార్పు అనేది ఆ పరిస్థితిలో అవసరమే అయినా, అది సరస్వతిని తృప్తిపరచ లేకపోయింది.

జీవితంలో ప్రధాన ఘట్టమైన 'వివాహం' ఫలానా వ్యక్తితో అని స్థిరపడ్డాక, తనే స్వయంగా శుభలేఖలు అందించి, కాబోయే జీవిత భాగస్వామితోడి మధుర జీవితయాత్రా పథాన్ని గూర్చి తీయటి కలలు కని, జీవితానికి సార్థకతా, పరమసుఖా— సౌఖ్యమూ, సౌరభమూ ఏర్పడబోతోందని మురిసిపోయే సమయంలో 'వడ్డించిన విస్తరి' ముందు నుండి లాగి వేసినట్లయేసరికి కన్నెహృదయం ఎలా బాధపడుతుందోనన్న సంగతి అప్పట్లో సరస్వతిని చూచి గ్రహించగలిగాను.

కాని ఆ సమయంలో కూడా సుందరరామయ్య మీద జాలి కంటే కోపం కలిగేది, ఆయన మాటలు వినేసరికి. జరిగిన దాంట్లో తన తప్పేమీలేనట్లు, అసలేమీ జరుగనట్లు మాట్లాడేవాడు.

"వాళ్ళు గాకపోతే వాళ్ళ బాబులాంటి సంబంధం తెచ్చి చేస్తాను, ఏడువేలు కాకపోతే ఎనిమిదివేలు పోసి! అయినా మా అమ్మాయికేం తక్కువని?... వాళ్ళ యింటి కోడలుగా పొందే అదృష్టం వాళ్ళకు లేదు. ఏం చేస్తాం?"

కనీసం కుమార్తె మానసిక క్షోభనయినా గుర్తించాడు కాదేమిటా అనిపించింది ఆయన ధోరణి చూస్తే!

* * *

....మరో ఆరునెలలు గడిచాయి.

ఆ మధ్యకాలంలో రెండుమూడు సంబంధాలు ప్రయత్నించారు సుందరరామయ్య, కానీ ఏవీ స్థిర

తప్పు

పడలేదు. తర్వాత ఒంగోలులోని సంబంధం ఒకటి మాట్లాడారు. అయితే యీసారి కూడా ముందుగా ఎవరికైనా సంప్రదించడంకానీ, ఎవరితోనైనా చెప్పడంకానీ చేయక పోవడమే గాకుండా, తాహతు, అంతస్థు, గతంలో జరిగిన సంఘటన—ఇవేవీ గమనించలేదు సుందరరామయ్య. ఎలాగో ఆసమయంలో సరస్వతి నా కోసం చెప్పి పంపింది, కాని సరిగ్గా అదే సమయంలో ఏదో అర్జంటు పని తగలడం మూలాన వెళ్ళడం కుదరలేదు. మరునాడు తెలిసిన విషయమేమిటంటే—వరుడు ఒంగోలులోని ఓ లాయరు గారబ్బాయి. ఎమ్. ఏ. ప్యాసయి వుద్యోగాన్వేషణ చేస్తున్న వ్యక్తి. తండ్రికి ఆస్తి, హోదా బాగున్నాయి! ఆరువేల కట్నం, ఆడబడుచు కట్నాలు, ఇతర లాంఛనాలు—వగైరా వగైరా! అన్నిటికీ తల వూపాడట సుందరరామయ్య... బాగానే వుందనుకొన్నాము.

కాని దురదృష్టవశాత్తూ యీ సంబంధమూ తప్పిపోయింది. అయినా ఒకందుకు మేలు! గతంలో లాగా పత్రికలూ అవీ పంచిపెట్టి, అన్నిపనులు చేసుకున్న తర్వాత గాకుండా, వాళ్ళ ధర్మమా అని ముందుగానే తెలియజేశారు. లగ్నం స్థిరం చేసుకున్నాక వారికి ఎవరి ద్వారానో తెలిసిందట యిదివరకటి విషయం. అందుచేత వెంటనే తమకు ఆరువేలు అందజేయవలసిందనీ, ఆ తర్వాతనే పెండ్లి ఏర్పాట్లు చేసుకోవలసిందనీ చెప్పారు. నిర్ణీత సమయానికే డబ్బు వేలకువేలు సమకూర్చలేని సుందరరామయ్య వున్నట్లుండి ఆరువేలు ఎలా తేగలడు?..తత్ఫలితంగా సంబంధం మొదటి దానిలాగానే అయింది. దెబ్బ తగిలిన కాలికే ముల్లు గుచ్చుకొన్నట్లయింది సరస్వతికి. మరింత క్రుంగిపోయింది మానసికంగా. పోనీ ఆతర్వాతనైనా సుందరరామయ్య ధోరణి మారలేదు, సరికదా యీ రెండు సంబంధాల వాళ్ళను కలిపి దుయ్యబట్టడం, మళ్ళీ సంబంధాలు వెతకడం, గాలికబుర్లు చెప్పడం పరిపాటయింది. "సంబంధాలు వెతుక నవసరంలేదు. నేను పెళ్ళి చేసుకోను." అని భీష్మించుక కూర్చొంది సరస్వతి తన తండ్రి చేసేపనులకు. పాపం సరస్వతి తల్లి, కుమార్తెను ఓదార్చలేక భర్తకు చెప్పలేక మధ్యలో సతమతమయింది. ఆవిడ కోరికపైన, ఏదో తగిన సంబంధం నాకు తెలిసినంతవరకు విచారించ ప్రయత్నించాను కాని సుందరరామయ్య వాటిని "ఆ! ఇవెంతలే" అని తేలికగా నాలిక చప్పరించి, కొట్టి పారేసేవాడు.

ఒక్కొక్క సమయంలో సరస్వతి కంట తడి పెట్టుకొని, నాతో చెప్పేది, "నాకెక్కడయినా ఓ వుద్యోగం చూసి పెట్టన్నయ్యా! నీకు పుణ్యముంటుంది. మా నాన్న నాకు వివాహం చేసే పరిస్థితి ఈ జన్మలో రాదేమో? కనీసం నా కాళ్ళ మీద నేను నిలబడి, పొట్ట పోసుకునే ఆధారం దొరికితే చాలు!" అని. పాపం మనసులో ఎంత బాధపడి వుండకపోతే ఆ మాటలనేదో...?

"సరేలేమ్మా! అలాగే ప్రయత్నం చేస్తాను!" అని ఆవిడను సమాధానంతో తృప్తిపరిచేవాడినే కాని సరస్వతి వుద్యోగం చేయడం మనసులో నా కిష్టముండేది గాదు. పెళ్ళి చేసుకొని హాయిగా కలకలలాడుతూ ఉల్లాసంగా చూడాలన్నదే నా ఆశ. కాని నా ఆశ, సరస్వతి కోరిక తీరే రోజు ఎప్పుడు వస్తుందో అనిపించేది.

....అలా కొంతకాలం గడిచింది. సరస్వతి తల్లి ఒత్తిడి చేత నేనే ఓ సంబంధం ప్రయత్నించాను. అబ్బాయి నాకు పరిచయమున్న వ్యక్తి కావడంచేత అన్నీ స్థిరపరచే బాధ్యత నేనే తీసుకున్నాను, నా చేతి మీదుగానైనా సరస్వతి నో యింటిదాన్ని చేద్దామని. వరుడు బి. ఏ. ప్యాసయి యు. డి. సి.గా పని చేస్తున్నాడు. మేడలు, కార్లు లేకపోయినా ఏదో కొద్దిపాటిగా కలిగిన కుటుంబమే. అయినా కట్నంకానుకల విషయంలో అబ్బాయి మాట చెల్లలేదు. తండ్రి ముందు అతడు నోరెత్తలేడు. అందుచేత ఆ విషయంలో నేనెంత ప్రయత్నించినప్పటికీ సఫలం కాలేదు. నాలుగువేల కట్నం, మరి యితర లాంఛనాలు వగైరాలన్నీ మాట్లాడుకొన్న తర్వాత, మరుసటి నెలలోనే ఓ సుముహూర్తం స్థిరం చేయబడింది. పెండ్లి పనులేవీ ఆడంబరంగా చేయవద్దని సుందరరామయ్యను నొక్కి చెప్పాను...

...రోజులు గడిచి ముహూర్త దినం సమీపించింది.....

పెండ్లి ముందురోజు సాయంత్రం వియ్యాలవారందరూ వచ్చారు. విడిదిలో సకలమూ అమర్చబడింది. కాని ఏక్షణంలో ఏం దురుసుగా మాట్లాడుతాడోనని సుందరరామయ్యను అప్పుడప్పుడూ హెచ్చరించవలసి వచ్చేది. కాని అనుకొన్నంతా అయింది. 'ఎదురుకోలువు' (ఎదురుకోలు) కార్యక్రమం పూర్తయి వధూవరు లిరువురూ పీటల మీద కూర్చున్నారు. పురోహితుడేవో వేదమంత్రాలు వల్లిస్తూ, వారిరువురినీ శాస్త్రోక్తంగా ఒకటి చేస్తున్నారు.. ఇంతలో వున్నట్లుండి పెండ్లి పందిరిలో ఓమూల నుండి కేకలు, ఘర్షణ వినపడి, నలుగురూ అటు చేరారు. ముక్కోపి, చండశాసనుడు అయిన వరుడి తండ్రి సుందరరామయ్య మీద మండిపడుతున్నాడు. తీరా ఆరాతీస్తే, "డబ్బుకు గడ్డితిని, అబ్బాయిని నాలుగు వేల రూపాయలకు అమ్ముకొన్నారని", ఇంకా ఏదో దురుసుగానూ, నిందాపూర్వకంగానూ పదిమందిలో అన్నాడట సుందరరామయ్య. దాంతో యిరువురి మధ్యా మాటామాటా పెరిగి, చివరకు రామ రావణ యుద్ధంగా పరిణమించింది. ఎవరెన్ని విధాల క్షమార్పణలు చెప్పినా ఆ పెద్దమనిషి తగ్గలేదు. విసురుగా వివాహ వేదిక దగ్గరకు వచ్చి, పెండ్లికుమారుని పీటల మీద నుండి లేవదీశాడు.

"సిగ్గూ—అభిమానం వున్న వాడివయితే నా వెంట రారా! ఈ సంబంధం, వీరి మర్యాదా మనకక్కర్లేదు.. ఇంకా నిలబడుతావేం రారా!" అని గుడ్లురుమేసరికి, దాదాపు ఆరడుగుల మనిషి పిల్లిలా తండ్రి ననుసరించేయబోయాడు. నేను కల్పించుకొని, అతడి దగ్గరకు వెళ్ళి, అలా చేయడం న్యాయంకాదని బ్రతిమాలాను. కాని నిస్సహాయంగా తండ్రి వైపు చూపించాడు.

స్త్రీ సహజమైన లజ్జను, అభిమానాన్ని చంపుకొని, పెళ్ళిపీటల మీద నుండి లేచి వెళ్ళిపోబోయే వరుడి పాదాలపై బడి, దీనంగా అతడి కళ్ళలోకి చూచింది, "తన జీవితాన్ని అన్యాయం చేయవద్దని" ఆ చూపులకు కొడుకు లొంగిపోతాడేమోనని, "ఏరా

నిలబడ్డావే? మాతోబాటు వస్తావా? సుమ్మర్నుంచి నీవి వెళ్ళమన్నావా?" అని తండ్రి మరోసారి కంఠక్షౌ(ర చేసేసరికి, పాదాలంటిన అబలను (తోసివుచ్చి వీధిలోకి నడిచాడు ఆ (ప్రబుద్ధుడు. రంగురంగుల విద్యుద్దీపాలతో కలకల లాడుతున్న పెండ్లి పందిరి మరుక్షణంలో కళావిహీనమయింది. రసాభావ కావడంతో విమర్శలు, వ్యాఖ్యానాలు, ఓదార్పులు—ఏదో సినిమాలో ఘట్టం చూస్తున్నట్లు కండ్లముందే క్షణాల మీద జరిగిపోయింది.

గదిలో దూరి, తలుపులు వేసుకొని రోదిస్తున్న సరస్వతి ముఖం చూడలేక, కండ్లు తుడుచుకొని యింటికి నడిచాను. నా చేతుల మీదుగా సరస్వతి నో యింటిదాన్ని చేద్దామని చేసిన (ప్రయత్నమిలా అయేసరికి, మరింత బాధ కలిగింది...

...ఆ మరునాడే చాలా అర్జంటు పని మూలాన హుటాహుటిగా హైదరాబాదు వెళ్ళవలసి వచ్చింది. వెళ్లేముందు సరస్వతిని చూడడం కూడా కుదరలేదు. కాని వదినతో చెప్పి వెళ్ళాను, "సరస్వతి ఏ అఘాయిత్యమైనా చేస్తుందేమో? కాస్త కనిపెట్టి వుండమని!"—

పని పూర్తి చేసుకొని హైదరాబాదు నుండి తిరిగి వూరికి రాగానే, పరిచయస్థులూ నలుగురూ చెప్పిన మాటలు విని ఆశ్చర్యపోయాను, "ఏమిటీ సరస్వతి యింత పని చేసిందా?" అని! అడుగులు త్వరత్వరగా వేసి యిల్లు చేరాను. వీధి వరండాలో అన్నయ్య వడిలో కూర్చొని ఆడుకొంటున్న వారిజ 'చిన్నా!' అంటూ కాళ్ళకు చుట్టుకొంగి. గబగబా బ్యాగు తీసి బిస్కట్ ప్యాకెట్ కోసం చేయి పెట్టేసరికి సరస్వతికిగాను హైదరాబాదు నుండి తెచ్చిన గాజుల ప్యాకెట్ చేతికి తగిలి, మనసు కలుక్కుమంది. బ్యాగు ఓ మూల విసిరిపడేసి, వంటింటిలోకి వెళ్ళాను. కూరగాయలు తరుగుతూ కూర్చొని వుంది వదిన. నన్ను చూచి పలుకరించింది..

"దారిలో నేను విన్న విషయం నిజమేనా వదినా?"

"ఏ విషయం?"—అర్థమయీ, కానట్లు చూసింది నావైపు.

"అదే!..సరస్వతి..." ఆ తర్వాత చెప్పడానికి నోరు రాలేదు నాకు.

"అవును వేణూ! నలుగురూ అలాగే అంటున్నారు. నిజానిజాలు భగవంతుడికే తెలియాలి." అంది ఎంతో బాధపడుతూ.

"సరస్వతి లేచిపోయిందా...?!" తల్చుకొనేసరికి బుర్ర తిరిగిపోయింది. అలాగే (బ్రాంతపడిపోయాను..

"నాలుగురోజుల (కితం ఓసారి సరస్వతి మనింటికి వచ్చింది. నీవు వూరి నుండి తిరిగి వచ్చేలోగా తాను ఎక్కడో బంధువుల వూరికి వెడుతున్నాననీ, బహుశా యిప్పుడల్లా తిరిగి రాకపోవచ్చుననీ చెప్పి, నీవు వస్తే యిమ్మని ఓ వుత్తరం యిచ్చి వెళ్ళింది. అందులో ఏమైనా సూచన(పాయంగా నీకు (వ్రాసిందేమో చూడు బాబూ!... నీ టేబుల్ సొరుగులో వుంచాను వుత్తరం"—

వదిన మాటలు పూర్తిగా విన్పించుకోక, త్వరత్వరగా గదిలోనికి పరుగెత్తి, టేబుల్ సొరుగులోని వుత్తరం చేతిలోకి తీసుకున్నాను. ఆతృతగా మడతలు విప్పి, చదివాను....

"వేణు అన్నయ్యా!

ఈ పరికి నీవు నలుగురూ అనుకొనే మాటలు విని ఆశ్చర్యపోవడమే గాకుండా ఎంతో బాధపడిపోతుంటావు, 'ఏమిటి చెల్లాయి యింత పనిచేసిందా?' అని.. కదూ! పరిస్థితుల (ప్రాబల్యం ఒక్క 'సరస్వతి'నే కాదు ఏ (స్త్రీనయినా ఎంతటి సాహసానికైనా పురికొల్పుతుంది.

నేను అదృశ్యమైన మరుక్షణం నుండి వూళ్ళో ఎవరైనా పురుష పుంగవుడు కన్పించడం లేదా అని కూడా లోకులు వెతుకుతూ వుంటారు. అది లోక సహజం. కాని ఒకటి మాత్రం నిజమన్నయ్యా! గుండె మీద చేయివేసి చెప్తున్నాను, నీ చెల్లెలు ఎప్పటికీ ఏ నీచానికీ పాల్పడదు!

మగువ మదిలో వలపు తలపు పొంగకుండా వుండాలే కాని, అది ఒకసారి రేకెత్తాక వరద గోదావరిలా పొంగి పొర్లుతుంది. కాదంటే, ఆ జ్వాల కార్చిచ్చులా మనిషిని నిలువెల్లా దహించి వేస్తుంది. ఇది ఒకరి దోషం కాదు! (ప్రకృతి ధర్మం!!

నా జీవితంలో వివాహ ఘట్టం ఎలా పరిణమించిందోనన్న దానికి నీవు (ప్రత్యక్ష సాక్షివి. ఒకసారి, రెండుమార్లు కాదు—మూడుసార్లు యజ్ఞవాటికలో బలి పశువులాగా నిలబడ్డాను. చివరకు మిగిలింది జీవచ్ఛవమైన (బతుకు. అలాంటి పరిస్థితిలో కన్నె మనసు ఎంతబాధపడుతోందో మాటలలో (వ్రాయడం కష్టం. నేనెన్నాళ్ళున్నా వృద్ధకన్యనై పోవలసినదే తప్ప, మానాన్న నాకు సలక్షణంగా వివాహం చేసే ఘడియ వస్తుందని నేను ఆశించడానికి కూడా భయపడుతున్నాను. ఇలా (వ్రాస్తున్నందుకు మన్నించు!

లోకంలో సుందరరామయ్య లాంటి తండ్రులూ, సరస్వతి లాంటి కుమార్తెలూ ఎంతోమంది బాధపడుతూనే వున్నారు. అలాంటి పరిస్థితిలో వాళ్ళకి మిగిలేవి రెండేమార్గాలు. ఒకటి—లోకం నుండి నిష్క్రమించడం! రెండు—తనదారి తాను వెతుక్కోవడం!!


ఆత్మహత్య చేసుకోవడం పిరికితనం కావచ్చు, లేదా సాహసం కావచ్చు. కాని నాలో ఆభావం లేదు. అందుకే రెండవ మార్గాన్ని చూచుకొంటున్నాను. కాని లోకులనుకొంటున్నట్లు 'లేచిపోవడం'తో కాదు. ఏదో నాకున్న విద్యార్హతలతో ఓ జీవనోపాధి కల్పించుకొని, నా జీవితానికి కావలసిన తోడు నేను నిర్ణయించుకోడానికి. ఏ మహిళా సంస్థ ఆ(శయానికో వెడతాను. జీవితంలో స్థిరపడ్డాక మళ్ళీ నీకు తెలియజేస్తాను. కాని అంతవరకు దయచేసి, నా వునికి ఎవ్వరికీ తెలియజేయవద్దు.

సంఘం దృష్టిలో నేను చేస్తున్న పని 'తప్పు' కావచ్చు. నిజమే! ఇప్పుడున్న వ్యవస్థ అది. కాని యిది 'తప్పు' కాదని నా అభి(పాయం. నాతో నీవు ఏకీభవిస్తావనుకొంటాను.


నా సాహసానికి మన్నించి, యీ చెల్లెలిని ఆశీర్వదించన్నయ్యా!

—సరస్వతి."


ఉత్తరం మడిచి టేబుల్ (డ్రాయరులో పడేసి, అలాగే కూర్చుండిపోయాను.. "అవును సరస్వతీ!.. జీవితంలో శాప(గస్త అయిన (స్త్రీ అలాగే అణగారిపోకుండా తనకు తాను ధైర్యంగా నిలబడి, తన జీవిత పథాన్ని తాను వెతుక్కోవడం యీ 'యుగసంధి'లోని పెద్దతరం వారి దృష్టిలో 'తప్పు' కావచ్చు. కాని దీనిని నిందించక, అభినందించే యుగం కూడా వస్తుంది. ఆరోజు కోసమే ఎదురు చూద్దాం!.. ఏది ఏమైనా నీవు ఎక్కడైనా సుఖంగా వుండటమే నేను కోరేది!" అని మనసులోనే మౌనంగా సరస్వతిని దీవించాను.



ఔషధం సేవించక ముందు



ఔషధం సేవించిన తరువాత



జీవన్ టోన్

గవర్నమెంటు

రిజిష్టర్డు నం. 218726

TRADE AYURVEDIC MARK

ట్రేడ్ మార్కు

పత్రికలలో ప్రకటనచేసిన ఔషధాలను సేవించి, నిరాశను పొందినవారు అనేకులున్నారు. కాని జీవన్ టోన్‌ను కొనుక్కొని దానిని ఉపయోగించి ప్రయోజనం పొందండి. జీవన్ టోన్ కేవలం వనస్పతి కొవ్వునుంచి తయారు చేయబడింది. జంతువుల కొవ్వు చేరుటవల్లనే ఇలా అనుకోనటువంటి బలిష్టతకు కారణం అని కొందరు అనుకోవటం పొరపాటు.

జీవన్ టోన్ గుణములు

ఎంత మంచి ఆహారం తిన్నా, ఎముకల పోగువలె, బలహీనంగా ఉండేవారు కొంతమంది ఉన్నారు. అట్టివారికి జీవన్ టోన్ మంచి బలాన్ని, లావును, బరువును ఇస్తుంది. ఆకలిలేని వారికి మంచి జీర్ణశక్తినిస్తుంది. ఇది బలహీనత, కాళ్ళుచేతులు తేలిపోవుట, తల తిరుగుడు, రక్తహీనతలను పోగొట్టి పరిపూర్ణమైన దేహారోగ్యాన్ని, పుష్టిని ఇస్తుంది. శరీరం ఎరుపురంగు పొందటానికి జీవన్ టోన్‌తో టొమాటోలు తీసికొండి. ఆరోగ్యవంతులకు కూడా జీవన్ టోన్ మంచిది.

జీవన్ టోన్ తీసుకొన్నప్పుడు మీరు కొంత శరీర వ్యాయామం చెయ్యటం అవసరం. లేకపోతే మీ శరీరం అనవసరంగా లావెక్కుతుంది. కావలసిన బరువు, బలిష్టత చేరినవెంటనే జీవన్ టోన్ సేవించటం నిలపటం మంచిది. స్థూలకాయులు జీవన్ టోన్ తీసుకోవటం మంచిదికాదు. అట్టివారు జీవన్ టోన్ తీసుకుంటే మేము బాధ్యులంకాము. స్త్రీలు బహిష్టుకాలంలో తీసికొనగూడదు. ఇతర వివరాలు మందుతో పంపబడతాయి.

వెల: 450 గ్రాములు రు. 10/— (పోస్టుచార్జీలు రు. 3/—)


స్కిన్ లిమ్స్

యవ్వన సౌందర్యం కలిగియుండటం వరప్రసాదం. స్కిన్ లిమ్స్ మీ చర్మాన్ని, మొటిమలు, పోటుకప్పు మచ్చలు, వివర్ణత, కోతలు, శోభినుంచి కాపాడుతుంది. స్కిన్ లిమ్స్ ముఖమందలి మడ్డి తొలగించిన తరువాత వాడవలెను. మీరు ఏ స్నోనుగాని, పౌడరునుగాని వాడవచ్చును. స్కిన్ లిమ్స్ ఒక కోర్సు రు. 12/—.

Dr. VASAN,

JOTHI HOSPITAL

P. B. No. 1413, 24, VENKATANARAYANA ROAD, T. NAGAR, MADRAS-17.



భూ భౌతిక సంవత్సరము

వైజ్ఞానిక గాథాశతి-89


పూర్వమెప్పుడో దేవతలూ అసురులూ పాల సముద్రాన్ని చిలికేరని విన్నాం. మందరపర్వతము కవ్వమైనదటా, వాసుకి అన్న మహానాగము తాడు అయిందట. ముందు విషము పుట్టినా తరవాత అమృతము పుట్టిందటా, రత్నాలూ అప్సరసలూ వైద్యులూ—చాలా చాలా—పుట్టినవట. దాని నిజము మాట మనకు తెలియదుగాని 1957 వ సంవత్సరము జూలై 1 వ తేదీ మొదలు 1958 డిసెంబరు 31 వరకూ జరిగిన ఏడాదిన్నర కాలం లోనూ 67 దేశాలకు చెందిన వైజ్ఞానికులు పెద్దా చిన్నా సహాయకులూ చేరి 80,000 దాకా గలవారు, 8000 పరిశోధనా కేంద్రాలలో భూమిని గురించిన విశేషాలు ఇంకా సేకరించాలన్న బృహద్యత్నము చేశారు. భూగర్భ రచనా, భూమికి చేరేవీ భూమినుంచి పోయేవీ కిరణాలూ, భూమిని చుట్టి వున్న గాలిపొరలో జరిగే వింతప్రక్రియలూ వారి లక్ష్యము. పరిశోధనా కేంద్రాలు భూమి మీద అన్ని చోట్లలోనూ ఏర్పరిచారు. ఉత్తరధ్రువము నుంచి దక్షిణధ్రువము దాకా అన్నిదేశాలలోనూ,అట్లాంటిక్కు పసిఫిక్ సముద్రాల మీదా కేంద్రాలు ఏర్పరిచారు. అందరూ కనుక్కున్న విజ్ఞాన విషయాలూ మూడు కేంద్రాలకు పంపాలని ఒప్పందము. గడచిన యుద్ధంవల్ల, ఆ యుద్ధానికి ముందు కొన్నిదేశాల వారు కనుక్కున్న విజ్ఞానము ధ్వంసమైంది. అలాటి విపత్తు ఈ కార్యక్రమానికి రాకూడదని పైజాగ్రత్త పడ్డారు. అన్నిదేశాల లోనూ భూమి వాతావరణ పరిశోధన జరగవలసిన దినాలు ముందుగానే నిర్ణయించారు. భూమి అంతటా జరిపిన అవలోకనాల వల్ల ఒకనాడు భూమి వాతావరణ పరిస్థితి ఏ రీతిగా వుంటుందో తెలుస్తుందీ, అలాటి దినాలు చాలా ఏర్పరచడమువల్ల ఏడాదిన్నరలో పంచిన వేర్వేరు దినాలలో భూవాతావరణము ఏ రీతిగా మారుతూ వచ్చిందో తెలుస్తుంది.

ధ్రువప్రాంతాలలోనూ మహాసముద్రాల విశాల వక్షము మీదా, సముద్రాంతర భూగర్భమునందూ, భూమి నావరించిన గాలిపొరలకు పైనా పరిశోధనలు చెయ్యడము చాలా కష్టమైన పని కావడాన్ని ఎవ రెవరో ఒకొక్కచోట చేసేవారు ఆ పరిశోధనలు. ఈ భూభౌతికవర్ష (ఐ. జి. వై. ఇయర్) కార్యక్రమంలో ఈ క్షేత్రాలన్నిటా వెల్లువలాగ జరిగేయి పరిశోధనలు. సముద్రగర్భంలో ఉన్న పర్వతశ్రేణి—అట్లాంటిక్కులో ఉత్తరదక్షిణాలకూ, ఆఫ్రికాని దిగువ నుంచి చుట్టి మడగాస్కర్ దాకా ఎక్కి మళ్లీ ఆస్ట్రేలియా దిగువకు వెళ్లేటిది—కనుకున్నారూ, పసిఫిక్ మహాసముద్రపు నైరుతి మూలల్లో మాంగనీసూ, రాగీ, నిక్కెలూ, ఇనుమూ కలిసి ఉన్న ఖనిజం లక్షలాది చదరపు మైళ్ల మేరలో వ్యాపించి ఉందని కనుక్కున్నారు...గినీగుడ ప్రవాహము ఆఫ్రికాకి పశ్చిమాన్న బయలుదేరి ఫ్లారిడా పశ్చిమ ఇండియా దీవుల నడుమ నుంచి న్యూయార్కును రాసుకుంటూ పోతుందని మనము జాగ్రఫీలో చదివేము. ఈ ప్రవాహానికి దిగువనా, పసిఫిక్ మహాసముద్రంలో భూమధ్య రేఖ వెంబడిని పశ్చిమానికి ప్రవహించే సముద్ర ప్రవాహం క్రిందనా వ్యతిరేక ప్రవాహాలున్నాయట. ఉత్తరధ్రువము దగ్గిర మంచుగడ్డ కరిగిపోతున్నదట క్రమంగా. ఈ మార్పుని తొందర పెట్టడానికి "ఆసియా ఈశాన్యపు కొసనీ అమెరికా వాయవ్య కొసనీ కలిపే బేరింగు సంధి దగ్గర వారధి కట్టి పసిఫిక్ సముద్ర జలాలను ఆర్కిటిక్ సముద్రంలోకి ఎందుకు తోడరాదూ" అని ఆలోచిస్తున్నారట రష్యావారు. వారి ఉత్తర తీరపు రేవులు మంచు విడిపోవాలని వారి ఆదుర్దా... భూమి పైపొరకు దిగువన 1800 మైళ్ల వరకూ మొదటి పొర ఉన్నది. పై పొర సుమారు 20 మైళ్ల దళసరిది. ఈరెండు పొరలకూ నడుమ కొంతకాళీ వంటి పొర—పొర అనీ అనకూడదు దానిని—ఉన్నదటా, మొహోరోవిసిక్ అనే భూగర్భశాస్త్రజ్ఞుడు కనుక్కున్నాడు. భూమికి ఈ ఇరవై మైళ్ల లోతుకీ రంధ్రమా చేసి ఈ 'పొర' సంగతి తెలుసుకోవాలని యత్నిస్తున్నారు!

గాలిలో వున్న అంగారామ్ల వాయువు క్రమ క్రమంగా ఎక్కువవుతోందటా, క్రీ.శ. 2000 నాటికి ఇప్పుడున్న దానికి ముప్పాతిక పాళ్లు ఎక్కువౌతుందిట. భూమి మీద వేట్ట ఎక్కువై మంచు కొండలూ గడ్డలూ కరిగి సముద్రపు నీటిని ఎక్కువ చేస్తాయిటా సముద్రతీరపు పట్టణాలు నీటమునుగుతాయట.

భూమి గోళాకారంగానూ, అండాకారంగానూ కాక దక్షిణము వైపు కొంచెము ఉబ్బి బేరిపండు ఆకారంగా వున్నట్టు, మొదటి వాన్‌గార్డు ఉపగ్రహమ వెళ్లిన కక్ష్యకూ లెక్కగట్టిన కక్ష్యకూ గల తేడాను బట్టి లెక్కవేశారు. ఇదివరకు గాలి సాంద్రత ఈ ఊరు పైనా ఆవూరు పైనా జరిపిన బెలూనూ,రాకెట్టూ, రాకూనూ పరిశోధనల వల్ల తెలిసింది. ఇప్పుడు ఉపగ్రహాల ప్రయాణాన్ని బట్టి భూమి చుట్టూ చాలా మేర, గాలి ఒత్తిడీ, సాంద్రతా తెలుసుకున్నారు. సూర్యుడి నుంచి X కిరణాలు వస్తూన్నట్టు తెలుసుకున్నారు. భూమిని చుట్టి గుమ్మడికాయ డొల్లవలె అపాయకరమైన అయానావరణాలున్నాయని వాన్ ఆలెన్ కనుక్కున్నాడు. భూమికి 40000మైళ్లలో మరొక అయానావరణమూ ఉన్నదట.

ఉపగ్రహాల్ని రష్యావారు మాటినా అమెరికన్లు మాటినా భూభౌతిక సంవత్సర కార్యక్రమంలోని పనిగానే. భూమి చుట్టూ సూరేసి మార్స్ దాకా అయిదు వందల మైళ్ల ఎత్తున తిరగడము దగ్గర్నుంచి, చంద్రుడికి ప్రదక్షిణించి, మనకు ఇంత వరకూ కానరాని చంద్రగోళపు అవతలి ముఖము ఫోటోలు పంపీ, శుక్ర, అంగారక గ్రహాలకు వెళ్లడము దాకా చేశాయి ఉపగ్రహాలు. ప్రపంచము మొత్తమ్మీద అందరు వైజ్ఞానికుల దృష్టినీ ఏకముఖము చేసి, విశ్వములో మనకు ఒకరకపు ఐక్యత వున్నదని నిరూపించి ప్రబోధించింది భూభౌతికవర్ష కార్యక్రమము. ఒక 18 నెలలపాటు వైజ్ఞానికులు రాజకీయ వాతావరణ విభేదాలు లెక్క లేకుండా భూమిని పరిశీలించారు. సముద్ర మథనము తర్వాత జరిగినది ఇదే గొప్ప కూడిక. అది జరిగి ఉండకపోతే ఇదే మొదటి మానవ సంఘటనా విజయము.





అంతస్తులు అభిమానాలు

ఉన్నవ విజయలక్ష్మి

జరిగిన కథ

భర్త సారధి ప్రోత్సాహంతో ఇందిర ప్రయివేటుగా చదివి బియ్యే పాసయింది. గిరి, పద్మ ఇద్దరు పిల్లలు కలిగారు. ఒకరోజు సారధి హఠాత్తుగా కన్ను మూశాడు. ఇందిర ఉద్యోగం చేయడానికి నిశ్చయించుకుంది. ఇంటిదగ్గర పరిస్థితులు నచ్చక, స్వర్ణసహాయంతో హైద్రాబాద్‌వచ్చి స్వశక్తిమీద లెక్చరరు కాగల్గింది. గిరి ఎమ్మెస్సీ పూర్తి చేశాడు. అతను వ్యాపారం చేయడానికి సమ్మతించింది తల్లి.

9

"చూశావా, ఇప్పుడు మనం బయలుదేరివా అంతే అయేది. పాపం, ఇవాళ ఆబహుమతి మా అన్నయ్య పుచ్చేసుకున్నాడు." అంది పద్మ అనుపమతో.

కాస్సేపటి తరువాత పనిముగించుకుని ఇవతలకి వచ్చిన ఇందిర అక్కడే కుర్చీలో, ఏదో ఆలోచిస్తున్నట్టు ఎటో చూస్తూ, ఒళ్లో రైన్‌కోటు పడేసుకుని ఒంటరిగా కూర్చున్న కొడుకుని చూసి.

"పద్మరాలేదూ..."అంది.

"ఆమెగారికిప్పుడు నేను కనిపిస్తానా? వాళ్ల ఫ్రెండొచ్చింది" అన్నాడు చిరచిరలాడుతూ.

"ఎవరు అనుపమా? ఎప్పుడొచ్చింది...."

హాయిగా పద్మ మంచంమీద కూర్చుని ఛెస్ ఆడుకుంటున్నారు పద్మ అనుపమ. ఇందిరను చూస్తూనే మర్యాదగా లేచినిలబడింది:

"కూర్చో అమ్మా. ఎంతసేపయింది వచ్చి, తడవలేదు కదా" అంది ఆదరంగా.

"ఆ. పైవాళ్లతో చక్కగా తియ్యగా మాట్లాడుతుంది. నేను ప్రయాణం అయేసరికి కన్నుమంది— అన్నింటికి భయమే. కాస్త తడిస్తే ఏం వాని పోతావా?" విసుక్కున్నాడు గిరి.

"పదులే—సినిమాకు వెళ్దాం రమ్మన్నాను. ఇవాళ తీరిప ఇచ్చేటట్టు లేదు." అంది పద్మ కిటికీలోంచి బయటికి చూస్తూ, వాన నిలిచి కురుస్తూనేవుంది.

"ఇలాంటప్పుడు బురద, చిదరలో ఇక్కడా అక్కడా తిరిగే కంటే వేడివేడి కాఫీతాగి ఇంట్లోనే హాయిగా కబుర్లు చెప్పుకుంటూ కూర్చుంటే బాగుంటుంది " ఇందిరమాటలకి,

"ఇప్పుడే తాగివచ్చాను. మరిప్పుడు నాకు కాఫీ వద్దు" అంది అనుపమ.

"పోన్లే కాసేపయాక "అంది పద్మ

ఇందిర నవ్వి, "హాల్లోకి పదండి అందరం కూర్చోవచ్చు. అన్నయ్యకి ఏం తోచటం లేదుట" అంది

"మా ఆట కాస్త పాడుచేస్తున్నావు—అయితే పేకాడాలి." ... అందరం కలిసే పేకాడాలి."

అనుపమ ఉలిక్కి పడినట్లయి, "నాకుబాగా రాదు. " అంది మొహమాటంగా. కొద్దిగాపరిచయంవున్నా మేడమ్ తోటి, ఆవిడ కొడుకుతోటి కూర్చుని పేక ఆడేంత చనువులేదు

"ఫరవాలేదులే— నేను ముక్కల పేర్లు కూడ మరిచిపోయాను— కాలక్షేపానికి ఆడ్డమేగా " ఇందిర బలవంతం చేసింది.

"పదబాబూ, బెట్టు చెయ్యక " పద్మ మంచం మీదనుంచి లేచి అలమారులో పేక చేతిలోకి తీసుకుంది.

హాల్లో జల్లచుట్టూ నలుగురూ చేరారు. పద్మ, అనుపమ ఒకజట్టు. గిరి, ఇందిర ఒకజట్టు.

"కారుకొంటాను కొంటాను అంటూ ఎన్నాళ్ల నుంచో ఊరిస్తున్నావు చక్కగా కారుంటే ఈ పాటికి సినిమాకి వెళ్లిపోదుమా?" అంది పద్మ ముక్కలు కలుపుతూ.

"సరేలే. కారుంటే నేనెప్పుడో వెళ్లిపోయేవాడిని, మీకోసం కూర్చుంటానా?" అన్నాగడు గిరి.

రెండు ఆటలు తిరిగేసరికే అనుపమ బిడియం మొహమాటం ఎగిరిపోయాయి. నాకు బాగా రాదు అని ఆ అమ్మాయి అన్నమాట అబద్ధం అని తేలిపోయింది. పాపం ఇందిర మరచిపోయిన మాటమాత్రం నిజం.

గిరి ఒక్కడూ ఎంత బాగా ఆడినా గెలుపు ఎక్కువగా పద్మ పక్షానికే వస్తూండేది. కాస్సేపు పట్టుదలగా ఆడినా చివరికి విసుగు వచ్చింది అతనికి

ఏదో ఆలోచిస్తూ తాపీగా ముక్కలు పేర్చుకుంటున్న అనుపమ పద్మకేకతో ఉలిక్కిపడి ఏమిటన్నట్లు చూసింది.

"అన్నయ్య చూసేస్తున్నాడు."

అనుపమ చెయ్యిదగ్గరగా తీసుకుని, "అవును కాదూ, అసలే మీరు ఓడిపోతున్నారు, ఇలా అన్యాయయంచేస్తే పూర్తిగా వోడిపోతారు" అంది.

"మీరు కనిపించేలా పట్టుకుంటే ఎవరైనా చూస్తారు మరి."

"ఇలా వంగిచూస్తే ఎలా పట్టుకున్నా కనిపిస్తాయి "

"నిజమే ఇందాక ఇటూ అలాగే చూడబోయాడు. చేతకాకపోతే మానెయ్యండి, అంతేకాని చూసి ఆడటం ఏమిటి?—అలా చూస్తూ కూర్చుంటావేమిటమ్మా, అన్నయ్యకి చెప్పు. లేకపోతే మేం పోయి హాయిగా ఛెస్ ఆడుకుంటావ్స్." అంది పద్మ గయ్యిమంటూ

"అవును గిరి వాళ్లన్నది నిజమే. నువ్వు సీరియస్‌గానే ఆడాలి మరి " అంది ఇందిర

"నిజమే. తప్పునాదే ఒప్పేసుకుంటున్నాను ఈ ఆట కలిపేద్దాం " అంటూ ముక్కలు క్రింద పడేశాడు. ఆడినా లాభం లేదని

అనుపమ గబుక్కున వాటిని బొత్తిపెట్టి గిరిముందుకు తోస్తూ,"అహ అలావీల్లేదు ఎన్నిసార్లు చూసినా మాకేం ఫరవాలేదు. ఈ ఆట ఆడి తీరాల్సిందే " అంది బలవంతంచేస్తున్న ధోరణిలో.

ముచ్చటగా ఆసంభాషణ ,వింటూ కూర్చున్న మేల్కొన్న ట్లుగా, "నువ్వేం ఆడావు, ఇది ఎవరు వేశారు." అని అడగటం మొదలు పెట్టింది. తల్లి పరధ్యానం చూసి ఇవాళ ఆ ఇద్దరూ ఆడపిల్లల చేతిల్లోనూ తను చిత్తుగా వోడిపోవటం తథ్యమని మనుకుని, ఎలాగైనా ఆటకలిపేసి లేచిపోతే బాగుండునని చూస్తున్నాడు గిరి.

అతని మొర ఆలకించినట్లే ఓ ఆపద్బాంధవుడు వీధిలోంచి మెల్లిగా పిలిచాడు

ఆట ధోరణిలో, వాళ్ల గొడవలో అది ఎవరి గొంతో సరిగా తెలియలేదుకాని ఎవరో పిలిచినట్లే అనిపించింది అందరికీ.

"అబ్బ, మంచి పట్టులో వుండగా వచ్చాడు ఎవడో. నువ్వు లేవని చెప్పేస్తాను" అని లేచింది పద్మ.

కర్చీఫ్‌తో మొహం తుడుచుకుంటూ, మరో చేత్తో రైన్‌కోటు బటను, విప్పుకుంటూ నిలబడిన వ్యక్తిని చూసి, ఇతన్నితో ఏం చెప్పటమా అనుకుంటూనే గ్రిల్ తలుపు కొద్దిగా తెరచి "అన్నయ్యలేడు" అంది మెల్లిగా. రవంత చిలిపితనం కూడా అందులో తొంగిచూసింది. చిత్రంగా ఒక్కక్షణం పద్మమొహంలోకి చూసి, తలుపుతోసుకుని చొరవగా లోపలికి వస్తూ, "ఇంతవానలో వెనక్కి వెళ్లడం నాతరంకాదు. అతను లేకపోయినా కాస్సేపు

క్కడే కూర్చుంటాను. మీకేం అభ్యంతరం ఉండ దనుకుంటాను. "అని వెళ్లి ఓకుర్చీలో కూర్చున్నాడు.

రాబోతున్న నవ్వుని బలవంతాన అణచిపెట్టుకుని వెనక్కి తిరగ బోయింది పద్మ.

"హాస్యానికయినా అబద్ధం ఆడటం మీకు చేత కాదు. గిరిని పిలవండి" అన్నాడు వాసు చిన్నగా నవ్వుతూ.

పద్మ నవ్వుకుంటూ లోపలికి వెళ్లిపోయి అన్నగారిని పంపించింది.

"ఇంట్లో కూడ ఫుల్ డ్రెస్‌లో వున్నావే." అన్నాడు వాసు.

"మీయింటికి రావాలనే బయలుదేరా. అసలే జలుబుగావుంటే వానలో ఎక్కడికీ అంటూ అమ్మ హారతి పట్టింది. మరి నోరు మూసుకుని కూర్చున్నాను మీ ఇంట్లో ఎవరూ వద్దనలేదూ."

"మేం పదిమంది వున్నాం. ఎవరు ఎక్కడ తిరిగివస్తున్నది అజాపజా వుండదు—భోజనంవేళకి అందరం కనిపిస్తే చాలు. మీరిద్దరే కనుక మీ అమ్మ చెరో కంటితో కాపలాకాస్తూ ప్రాణాలన్నీ మీమీదే పెట్టుకుని వుంటారు. కాస్త జలుబు చేస్తే బెంగపెట్టుకు పోయే రకం కాదు మావాళ్లు" అన్నాడు వాసు నవ్వుతూ.

"ఇప్పుడేం చేద్దాం."

"ముందు రఘు దగ్గరికిపోదాం — అతను వుంటాడో వుండడో— సరే తరువాతి సంగతి అక్కడే డిసైడ్ చేయొచ్చు— కాస్త ఆలశ్యం అయినా ఖంగారుపడవద్దని మీ అమ్మతో చెప్పి మరీరా." అంటూ మరో సలహా కూడ ఇచ్చాడు వాసు.

గిరి లేచిరాగానే, కాఫీ ప్రయత్నంలో పడిన ఇందిర, కూతుర్ని పిలిచి, "ముందు వాళ్లద్దరికీ టిఫిన్ ఇచ్చిరా. వాన కాస్త తగ్గింది. ఇంకవుండరు." అంది.

* * *

ఆఖరి పరీక్షవ్రాసి హుషారుగా ఇంటికి వచ్చిన పద్మ తల్లి భారంగా మూలుగుతూండటం చూసి తెల్లబోయి,

"ఏమ్మా అలావున్నావు." అంది.

"అబ్బ తల పడిపోతోంది. వళ్లంతా నొప్పులు. జ్వరం వస్తుందేమోననిపిస్తోంది." కుర్చీలో వెనక్కివాలి, కణతలు నొక్కుకుంటూ అంది ఇందిర.

పద్మ తల్లిచెంపలు తడిమిచూసి "జ్వరంలేదు, కాస్త అమృతాంజనం రాస్తామండు. ఆ తలనొప్పి తగ్గిపోతుంది." అని పెరట్లోకివెళ్లి కాళ్లు కడుక్కుని వచ్చింది.

కళ్లు మూసుకుని పడుకున్న తల్లి పక్కలో కూర్చుని మందురాస్తూ, "తలనెప్పి తగ్గగానే మళ్లీ లేచి తిరగకు. ఇవాళ్టికి రెస్టుతీసుకో. రాత్రి వంట నేను చేస్తాను." అంది ముందే చెప్తున్నట్లు. ఏ మాత్రము వోపికవున్నా తల్లి పడుకోదని, తనని ఏ పనీ ముట్టుకోనియ్యదనీ అమ్మాయికి తెలుసు.

వంటపేరు వినగానే గుర్తు వచ్చినట్లు "నువ్వు కాఫీ తాగావా, మరిచేపోయాను చూడు. డికాషన్ వేసివుంచాను. వెళ్లి కలుపుకో." అంది ఇందిర.

మరి కాస్సేపటికి ఆవిడ భయపడినట్లే జ్వరం వచ్చింది. ఆవిడ చెప్పకూడదనుకున్నా తల్లి మొహం చూసి కనిపెట్టిన పద్మ, చెయ్యి వేసి చూసి, "అబ్బ. బాగానే వుందమ్మా. ఇంతలో ఇలా వచ్చిందేమిటి? అన్నయ్యకి ఫోనుచేస్తామండు." అంది.

"ఫోనెందుకూ. ఏదో అయిపోయిందని వాడు భయపడతాడు. కాస్సేపటిలో ఎలాగూ వచ్చేస్తాడుగా. రాగానే డాక్టరు దగ్గరికి వెళ్లి మందు తెచ్చుకుంటా." అని కళ్లు మూసుకుని అటుతిరిగి పడుకుని,

"పోనీలే, నీ పరీక్షలయాక మంచి ముహూర్తం చూసుకుని మరీ వచ్చింది నా మూలుగు— ఇంకా ప్రాక్టికల్సు వుండిపోయాయి." అంది.

లేచి చూశారా, బాగా ఎక్కువగా వుందా" అంటూ గబగబ గదిలోకి వస్తూంటే, ఇందిర మెల్లిగా లేచి కూర్చుని, "అంత ఖంగారేంలేదు— నువ్వెళ్లి ముందు కాఫీ తాగిరా— డాక్టరు దగ్గరికి వెళ్దాం." అంది.

"నువ్వు రాలేవేమో. డాక్టర్నే తీసుకొస్తాలే." అన్నాడు గిరి చెల్లెలు తెచ్చిన కాఫీగ్లాసు అందుకుంటూ.

"నయమే. మరి అంతలేవలేకుండా లేను. వెళ్దాం



"వాటికి చాల టైముందిలే. మెల్లిగా చూసుకో వచ్చు— అయినా రేపటికి నీకు తగ్గిపోతుంది." అని, తల్లి వద్దు వద్దు అంటున్నా అన్నగారికి ఫోను చేసివచ్చి,

"చూశావా, ఫోన్ చెయ్యడం ఎంత మంచి దయిందో. ఇవాళ వాళ్లంతా ఎక్కడికో వెళ్లివద్దాం అనుకున్నారట. కాస్త ఆలశ్యం కూడ అయేది." అంది పద్మ తల్లిపక్కలోకూర్చుని కణతలు ఒత్తుతూ.

మరో పది నిముషాలలోనే వచ్చిన గిరి "వెంప పద."

అందరూ అనుకున్నట్లు మర్నాటికి జ్వరం తగ్గలేదూ సరికదా, ఒక్క రాత్రికే మరీ నీరసించిపోయి, వాలుగు అడుగులు వేసే శక్తికూడ లేనట్లు తూలిపోసాగింది. తల్లి స్థితిచూసి,

"డాక్టర్ని తీసుకొస్తాను." అని వెళ్లిపోయాడు గిరి.

డాక్టరు వచ్చి చూసి మందు ఇచ్చాడు. మర్నాటికి కూడ ఏమీ గుణం కనిపించలేదు. మరో రెండు

రోజులు గడిచిపోయాయి. టైఫాయిడ్ అని నిర్ధారణ చేశాడు డాక్టరు. వింటున్న అందరి గుండెలు అదిరిపోయాయి. మిన్ను విరిగి మీదపడిపోయింది అన్నట్లే వుంది అందరికి.

డాక్టర్ని పంపివచ్చిన గిరి, టేబిల్ నానుకుని దిగులుగా నిలబడిపోయిన చెల్లెలి మొహంలోకి చూశాడు. ఇద్దరూ ఒకే విషయం గురించి ఆలోచిస్తున్నారు— "తమకి జ్ఞానం వచ్చిన తరువాత ఒక్కరోజయినా తల్లి ఇలా మంచంమీద వుండటం వాళ్ళు ఎరగరు. విశ్రాంతి అనేదిలేకుండా, నిరంతరం శ్రమించే తల్లే వాళ్ళకి తెలుసు. ఇప్పుడు ఒక్కసారే ఇంత భయంకరమైన జ్వరం— తండ్రికి కూడ......"

ఎలాగో తను ధైర్యం తెచ్చుకుని "భయంలేదు." అని చెల్లెలికి చెప్పాలి అనుకున్న గిరి నోరు పెగలలేదు. మౌనంగా బాధగా ఒకరి కళ్ళల్లోకి ఒకరు చూసుకుంటూ నిలబడిపోయారు.

"పిల్లలకి నువ్వు వున్నావు ఇందూ—" అంది. అణువణువులోనూ సారధి మాటలే ప్రతిధ్వనిస్తున్నాయి—

"కొన్ని సంవత్సరాల క్రితం సరిగ్గా ఇదే జబ్బు వారిని మాకు దూరంచేసింది. మళ్లీ ఈనాడు పిల్లలకి నన్ను దూరం చెయ్యటానికి మృత్యువు ఈ రూపంలోనే వచ్చింది. నేను ధైర్యంగా వాళ్ల బాధ్యత అప్పగించగలిగే వాళ్ళు ఎవరున్నారు? ఎవ్వరూ లేరు. గిరి జీవితం వో గాడిలో పడిపోయి నట్లే, వాడికేం భయంలేదు. కాని పద్మ— మానవ జీవితాలు బుద్బుదప్రాయమైనవి. వాటికి ఏక్షణములో ఏం జరుగుతుందో ముందుగా మనం కొంచెంకూడ గ్రహించుకోలేం అనే విషయాన్ని అనుభవపూర్వకంగా తెలుసుకున్న నేను కూడ అవివేకిలా ఇది చేస్తాను అది చేస్తాను అనుకుంటూ దాని విషయంలో బాధ్యత విస్మరించాను. నలుగురు చెప్పినట్లు దానికి పెళ్ళి చేసేసివుంటే ఇవాళ ఇంత బెంగ పెట్టుకునే అవసరం లేకపోయేది.... అయినా నేనేమంత అనుచితమైన పని చేశాను. కాలానికి తగినట్లు, అందరి ఆడపిల్లల్లాగే అదీ చదువు కోవాలను కోడమే పొరపాటా— కొంత చదువూ అయింది, యుక్తవయస్సూ వచ్చింది, అమ్మాయి అభిప్రాయం తెలుసుకుని నా బాధ్యత తీర్చుకోవాలని నేనూ అనుకుంటూనే వున్నాను— ఈలోపునే నాకు రోజులు నిండిపోవాలా? పిల్లల ఆటపాటలు ముద్దుముచ్చట్లు చూసుకునే అదృష్టం వారికి లేనట్టే, వాళ్ళు పెళ్లి బట్టలలో కళకళలాడుతూండగా చూసే అదృష్టం నాకూలేదు....."
మూసివున్న కళ్లనుంచి పక్కలకి జారిపోతున్న కన్నీళ్లని కొంగుతో తుడుస్తూ,

"అమ్మమ్మని రమ్మని వ్రాస్తాం" అంది పద్మ. భయంతో ఆ అమ్మాయి గొంతు బిగుసుకుపోతున్నట్టేవుంది.

పద్మచేయి పుచ్చుకుని పక్కన కూర్చోబెట్టుకుని, "ఎందుకమ్మా అందర్నీ శ్రమపెట్టటం. గంపంత సంసారం. లలితపిన్ని బాలింతరాలు. శీలపిన్ని పురిటికి వచ్చిందిట. అందర్నీ అలా వదిలి ఆవిడెలా రాగలదు? రాలేకపోయాననే అది బాధపడుతుంది. అందుకే ఏం రాయకండి. ఎవరు వచ్చిమాత్రం చేసేది ఏముంది— నాకేం భయంలేదు— స్వర్ణకి వోసారి

అంతస్తులు - అభిమానాలు

ఫోన్ చెయ్యండి. తను వచ్చి కాస్సేపు కూర్చుంటే మీకెంతో ధైర్యంగా వుంటుంది." అంది పిల్లలు బెదిరిపోకుండా తను ధైర్యం తెచ్చుకుని.

గిరివెళ్లి స్వర్ణకి ఫోన్‌చేసి, "వో గంటలో వస్తానంది." అంటూ తల్లి మంచం పక్కనే కూర్చున్నాడు మళ్లీ.

"ఒకసారి అనుపమకి కూడ చెప్పరా. ఆ అమ్మాయి వస్తే పద్మకి కాస్త కాలక్షేపం అవుతుంది." అంది ఇందిర.

దిగులుగా నిశ్శబ్దంగా వున్నట్లున్న వాతావరణానికి స్వర్ణరాకతో ఒక్కసారిగా చైతన్యం వచ్చినట్లయింది.

"ఏమిటిదీ? పిల్లల్ని మరీ హడలగొట్టేస్తున్నారట." గల గల మాట్లాడుతూ కుర్చీ మంచం దగ్గరగా జరుపుకుని కూర్చుంది.

"ఇంట్లో పెద్ద వాళ్ళెవరూ లేకపోవడంతో మరీ బెదిరిపోతున్నారు. మా వాళ్లకి ఉత్తరం వ్రాసినా మా అమ్మ పెద్దది రాలేదు, చెయ్యలేదు. వూరికేనే వాళ్లని ఇంగారుపెట్టటం ఎందుకని వద్దన్నాను." అంది ఇందిర.

"ఏం అక్కర్లేదు. ఇంత వూరుండగా మిమ్మల్ని చూసుకునే వాళ్లే వుండరా. నేను రోజూ వస్తూంటాను. కావలిస్తే రాత్రిళ్లు కూడ పడుకుంటాను. సరేనా?" అంది పద్మవంక చూసి ధైర్యం చెప్తున్నట్లు.

"మీర మాట్లాడుతూంటేనే మాకెంతో ధైర్యంగా వుంది." అంది పద్మ.

"అయినా భయమెందుకు. మందులు లేవా డాక్టర్లులేరా— మీ నరసమ్మని ఇక్కడే వుండి పొమ్మనండి పోనీ. నీకు మీ అమ్మకీ కూడ సాయంగా వుంటుంది."

చాలాసేపు అలా ఖబుర్లు చెప్పి "రాత్రి ఫోన్ చేస్తాను. రేపు మళ్లీవస్తాను." అంటూ వెళ్లిపోయింది స్వర్ణ.

అనుపమకి చెప్పరావటానికి గిరి బయలుదేరబోతూంటే ఆ అమ్మాయే వచ్చింది.

"మీ కోసమే రావాలను కుంటున్నాను." అన్నాడు గిరి కారుదిగి.

అతని మొహంచూసి తెల్లబోయి, "ఎందుకని?" అని అడగబోతూంటే,

"అమ్మకి జ్వరం. పద్మ ఒక్కతే మరీ పిచ్చి దానిలా కూర్చుంటోంది. కాస్త కాలక్షేపం అయినా అవుతుందని మిమ్మల్ని రమ్మని చెప్పాలనే వస్తున్నాను." అన్నాడు గిరి.

"ఎప్పట్నించి? బాగా ఎక్కువగా వుందా?" అంది అనుపమ అతనితోపాటు లోపలికివస్తూ.

"ఎక్కువగా ఏం లేదనుకోండి. టైఫాయిడ్. భయపడటం సహజంకదా."

అనుపమ మాటలు వినిపించి ఇవతలకి వచ్చింది పద్మ. ప్రేమగా ఆ అమ్మాయి భుజంమీద చేయివేసి ఇందిరగదిలోకి నడిచింది అనుపమ.

పక్కలో కూర్చుని మృదువుగా నుదుటి మీద వేసిన చేతిని తన చేతులలోకి తీసుకుంటూ కళ్ళు తెరిచి, "వచ్చావామ్మా, మీ స్నేహితురాలికి కాస్త ధైర్యంచెప్పు. ఈ నాలుగు రోజులనించి వాళ్ళు భోజనం కూడ సరిగా చేస్తున్నట్లు లేదు." అని చెప్తూంటే ఇందిర కంఠం కొద్దిగా వణికింది.

"మీరసలు ఎక్కువగా మాట్లాడకూడదు. రెస్టు తీసుకోవాలి— వాళ్లకోసం మీరేం బెంగ పెట్టుకోకండి. మీరు మళ్లీ లేచి మామూలుగా తిరిగేదాకా మా యింట్లోంచి అన్నం తెచ్చిపెట్టి వాళ్ళు తినేలా చూస్తాను."

ఇందిర చిన్నగా నవ్వి "బలేదానివే. అంత శ్రమ అక్కరలేదులే." అంది.

"శ్రమకేముంది. మా అమ్మ వండి ఇస్తుంది. నేను కేరియరులో పెట్టి తీసుకువస్తాను. నాకు తెలిస్తే మొన్నటినుంచే ఆ పని చేద్దును." అనుపమ మాటలు వింటూ పద్మ తెల్లబోయింది. "ఎన్ని ఖబుర్లు చెప్తోంది— వాళ్లమ్మకి రెండు రోజులు మామూలు జ్వరం వచ్చేసరికే అన్నం నిద్ర మాని ఏడుస్తూ కూర్చుంది. మా అమ్మకి టైఫాయిడ్ అని తెలిసికూడ కాస్తయినా భయపడటంలేదు— ఎవరైనా అంతేనేమో. మనకి వచ్చినప్పుడు కొండంతదిలా కనిపించే కష్టం, మరొకరికి వచ్చినప్పుడు గోరంతలా కనిపిస్తుంది. అలాంటి ధైర్యమే ఈమెదికూడ." అనుకుంది.

అనుపమ ఇందిరతో ఖబుర్లు చెప్తూనే "హాస్యం కాదు పద్మా. నేను నిజంగానే పంపిస్తాను. నువ్వు వంట ప్రయత్నం చెయ్యకు." అంది.

"నయమే. నాకు చేతకాదనా— నువ్వు రోజూ వచ్చి ఖబుర్లు చెప్తేచాలు ఇంకేం చెయ్యక్కర్లేదు." అంది పద్మ.

చీకటిపడుతూండగా వెళ్తానని లేచింది అనుపమ.

"నరసమ్మ నా దగ్గరుంటుంది. మీ రిద్దరూ వెళ్లి తనని దింపిరండి." అని పంపించింది ఇందిర.

స్వర్ణ అన్నట్లే మర్నాటినుంచీ వచ్చేపోయే వారి సందడి బాగా ఎక్కువయిపోయింది. రోజూ విధిగా స్వర్ణ అనుపమ వస్తూండేవారు. ఒక్కోసారి అనుపమ తల్లి యశోద కూడ వచ్చి చూసి వెళ్తూండేది. ఇంక రఘు, వాసులు అన్నింటికి తామే వున్నామంటూ, గిరి ఎక్కడికి కదలక్కరలేకుండా ఇందిరకి కావలసిన మందులు పళ్లు అవి కూడ వాళ్లే తీసుకు వస్తున్నారు. ఇంత మంది చూపిస్తున్న ఈ అభిమానానికి ఆదరణకి ఇందిర మనస్సు సంతృప్తితో నిండిపోయింది.

"నా పిల్లలు బొత్తిగా దిక్కులేని వాళ్ళుకారు. అవసరం అయితే ఆదుకునే ఆప్తులు కావలసినంత మంది వున్నారు— నేను వూరికేనే భయపడ్డాను." అనుకుంది.

రోజులు సాఫీగానే గడుస్తున్నాయి. భయంలేదు అనుకుంటున్న సమయంలో వోనాడు పరిస్థితి అందరికీ ఆందోళన కలిగించసాగింది. ఉదయం నుంచీ కళ్ళు మూసుకుని మగతగా పడుకున్న ఇందిర మధ్య మధ్య ఎవరితోనో మాట్లాడుతున్నట్లే కలవరించటం మొదలు పెట్టింది— ఉదయం నుంచీ పద్మ కన్నీళ్ళు కట్టుబడనేలేదు. మాట పలుకూలేకుండా ఎటో దూరంగా చూస్తూ తల్లి మంచం ప్రక్క కుర్చీలో కూర్చుండిపోయాడు గిరి.

(సశేషం)

గురుగోబింద్ సింగ్



గురుగోబింద్ సింగ్

[జనవరి 18 వ తేదీన గురుగోబింద్‌సింగ్ 300 వ జన్మదినోత్సవం సిక్కులు ప్రపంచమంతటా జరుపుతారు. ఈ సందర్భంలో 'గురుగోబింద్ సింగ్ ఫవుండేషన్' వారు పంపిన ఫోటోవ్యాసం ఒకటి ఈక్రింద ప్రచురిస్తున్నాము.]

గురుగోబింద్‌సింగ్ 10 సిక్కు 'సిద్ధు' లలో చివరివాడు. సంఘ సంస్కర్తగా, పుణ్యపురుషుడుగా నాయకుడుగా, స్వేచ్ఛావాదిగా, యోధుడిగా అద్వితీయుడు.

ఆయన జన్మించిన సంవత్సరం, షాజహాన్ చని పోయిన సంవత్సరం. ఔరంగజేబ్ అప్పటికి ఎనిమిది సంవత్సరాలుగా ఢిల్లీనుంచి ఏలుతున్నాడు. గోబింద్ తండ్రి 'గురుతేఘ్ బహదూర్' గురు నానక్ స్థాపించిన పరంపరలో 9 వ వాడు. (గురు అర్జున్ సింగ్ ఈయనకి తాతగారు. జహంగీర్ జులుం కింద మరణశిక్ష అనుభవించాడు.) అప్పటికే ఔరంగజేబ్ దుష్టపరిపాలనకి కొందరు ఎదురు తిరుగుతున్నారు. మొగల్ చక్రవర్తిని ఎదిరించిన యోధులలో గురుతేఘ్‌బహదూర్ ఒకడు.

గోబింద్‌సింగ్ పాట్నాలో జన్మించాడు. 9వ ఏటవరకూ అక్కడేఉండి, ఆతర్వాత 'శివాలిక్' పర్వతాలలో ఉన్న 'ఆనంద్‌పూర్'కి వెళ్ళాడు. ఏడవఏట సంస్కృతం, హిందీ, పారశీక భాషలు అభ్యాసం ప్రారంభం అయింది అతనికి.

కాశ్మీర్‌లో మహమ్మదీయ ప్రభువుల వత్తిడి ఎక్కువ అయింది. వారి బాధలు తట్టుకోలేని కొందరు పండితులు తేఘ్‌బహదూర్ శరణుజొచ్చారు. ఆ సమయంలో అక్కడఉన్న గోబింద్‌సింగ్, 'ధర్మాన్ని' రక్షించగలిగింది 'నువ్వే'నని తండ్రితో అన్నాడు. ఆయన కొడుకు మాటలకి సంతోషించి మొగల్ చక్రవర్తికి సందేశం పంపాడు—తనని మతం మార్చుకునేట్లు చెయ్యగలిగితే తక్కినవారంతా కూడా మారుతారని, చక్రవర్తి "మరణమా, మహమ్మదీయమతమా?" అని తేఘ్‌బహదూర్‌ని అడిగాడు. ఆయన తన దృఢసంకల్పాన్ని తెలిపాడు. 11—12—1675న గురు తేఘ్ బహదూర్ కి శిరచ్ఛేదం చేశారు.

గోబింద్‌సింగ్ 9 ఏళ్లప్పుడు గురువు అయిపోయాడు. ఆయన ఎన్నో సంస్కరణలని తీసుకువచ్చాడు. అంతేకాక, తన అనుచరులకి తీవ్రమయిన క్రమశిక్షణ అలవాటు చేశాడు.


ఒకనాడు (30—3—1699) ఒక సభలో గురుగోబింద్ ఇలా అన్నాడు: "నాకు ఈదినం ఒక శిరస్సు అవసరం. నిజమయిన సిక్కు ఎవరయినా ఉంటే ముందుకురావచ్చు!" ముందు ఆయన మాటల అర్థం ఎవరికీ బోధపడలేదు. గురువు మూడుసార్లు తన కోరిక వెలిబుచ్చాడు. చివరికి లాహోర్‌నుంచి వచ్చిన "దయారామ్" అనే అతను, "నా శిరస్సు ఇదే ప్రభూ!" అని ముందుకి వచ్చాడు. గురుగోబింద్‌సింగ్ అతన్ని గుడారంలోకి తీసుకువెళ్ళాడు. రక్తసిక్తమయిన ఖడ్గంతో తిరిగి వచ్చాడు వంటరిగా. సభికులు అదిరిపోయారుకాని వారి గురువుకి మరి నలుగురు తలలు సమర్పించుకున్నారు. ఇప్పుడే కేశ, కంఘ (దువ్వెన), కర (ఇనప కంకణం), కఛ్ (లాగూ), కృపాణ్ — ఈ అయిదూ సిక్కుల ప్రత్యేక ధార్మ్యాలు అయిపోయాయి.

గోబింద్‌సింగ్ నాయకత్వంకింద మొగల్ నిరంకుశత్వానికి ఎదురుగా పెద్ద ఉద్యమం లేచింది. ఇంతలో ఔరంగజేబ్ కూడా మరణించాడు. బహదూర్ షా గోబింద్‌సింగ్ శక్తిని గుర్తించి అతనితో సంధి చేసుకున్నాడు. అంతేకాక, ఇద్దరూ అన్ని మతాలకీ న్యాయం జరిగే విధానాలు అవలంబించాలని నిశ్చయించుకున్నారు.

ఇది ఇలా ఉండగా బహదూర్‌షా తమ్ముడు కామ్‌బక్ష్ అన్నకి ఎదురు తిరిగాడు. అతని మీదకి దండెత్తి వెళ్ళాడు బహదూర్ షా. గోబింద్‌సింగ్ అతనితోబాటే వెళ్ళాడు. మొగల్ చక్రవర్తి, సిక్కు గురువు స్నేహంగా ఉండటం మంచిదికాదని సిర్‌హింద్ నవాబు నవాబ్‌వజీర్‌ఖాన్ అనుకున్నాడు. ఇద్దరు పఠానులని వీరివెంట పంపించాడు. నాందేడ్ దగ్గర వారు పడుకుని ఉన్న గోబింద్‌సింగ్ గుండెల్లో బాకు పొడిచారు. దెబ్బతిన్న గోబింద్‌సింగ్ లేచి ఒకడిని చంపేశాడు. రెండవవానిని అతని అనుచరులు హతమార్చారు. ఈవార్త విన్న బహదూర్ షా ఒక ఇంగ్లిష్ డాక్టర్ ('కోల్') ని పంపించాడు. ఆ వైద్యుడు గాయాన్ని నయం చేశాడు. కాని గోబింద్‌సింగ్ అశ్రద్ధవల్ల అది మళ్లీ రేగింది. గురుగోబింద్‌సింగ్ అక్టోబర్ 7, 1708 తెల్లవారిజామున ఈలోకాన్ని వదిలి వెళ్ళిపోయాడు.

గురుగోబింద్‌సింగ్ ఎంత గొప్ప యోధుడో, అంత సహనశీలికూడా. సర్వమతాభివృద్ధి అతని జీవితాశయం. హైందవులు, మహమ్మదీయులు, సిక్కులు అందరూ అతని అనుచరులయ్యారు.

శ్రీ హర్బన్‌సింగ్



'పి. ఎస్.'

ఈనాడు ఇంటి అధికారం స్త్రీలదా? పురుషులదా?

ఒకనాడు ఇంటి అధికారం కేవలం పురుషులదే నని నిస్సందేహంగా చెప్పవచ్చును. ఇంటి అధికారం, అంటే గృహనిర్వహణ పూర్తిగా ఆనాడు పురుషుల అధీనం. ఇల్లు, కుటుంబంలోవారి మంచిచెడు గులు, శుభకార్యాలు మొదలలైనవాటిని గురించి పురుషులు చేసే తుది నిర్ణయాలు, ఏపనికి ఎంత ఖర్చు చెయ్యాలి, ఎవరికి ఎలాంటి బట్టలు కొనాలి, మొదలైనవి కూడా పురుషులే నిర్ణయించేవారు. అంగడికివెళ్ళి వస్తువులు కొనితేవడం వారి వంతయితే వేవురు అతిథులు వచ్చినా అలసి పోకుండా వంటలు పిండివంటలూ చేసి అపర అన్నపూర్ణ అనిపించు కొని సంతోషపడేవారు ఆనాటి గృహిణులు. పొయ్యి మీద అన్నం ఎసరు పడేసి కూరలకోసం బజారుకి పరుగెత్తే అవసరం వాళ్ళకి వుండేదికాదు. మడువా లోగిళ్ళు, మాగాణి భూములూ ఆనాడు వున్నాయి. కనుక స్త్రీలు వండడం వార్చడం, పిల్లల్ని చూసు కోవడం, వింటే ఏపురాణమో వినడం, వెడితే ఏ సెల్ళికో వెళ్ళడంతో సరి పుచ్చుకునేవారు. ఇక పురుషులకి భూములద్వారా ఆదాయం అందుతూ వుంటే తీరిగ్గా ఇల్లు అజమాయిషీ చేస్తూ కూర్చునే వారు కాబోలు!

ఈనాడు అలాకాదు.

ఈనాటి గృహస్థులలో నూటికి డెభ్భై అయిదు మందికి మడి మాన్యాలు లేవు. ఇంటి జరుగు బాటుకోసరం ఏదో ఒకడుద్యోగం చేయడం తప్పని సరి అయింది. ఉద్యోగం పెద్దదైనా చిన్నదైనా, ఎక్కువ ఆదాయం తెచ్చిపెట్టినా, తక్కువ తెచ్చి పెట్టినా, టైం ప్రకారం రోజూ ఆఫీసుకు వెళ్ళడం తప్పనిసరి. ఇక క్యాంప్‌లపై వున్న ఉద్యోగాలు సరేసరి ఈకారణంగా పురుషులకి తీరుబడి తగ్గిపోయింది. అంతేకాదు ఈనాటి గృహిణులు విద్యావతులు. సంసారం హాయిగా ఎలా సాగించాలో ఎరిగినవారు కావడం వల్ల ఆర్థిక శాఖను గృహిణికి అప్పగించవచ్చునని విశ్వాసాన్ని పురుషులు అభివృద్ధి చేసుకుంటున్నారు. గృహిణి అంటే కేవలం వంటచేసే యంత్రం కాదనీ, వంటకి యంత్రాలూ కుక్కర్లూ, గాస్ స్టౌలూ వేరేవున్నాయనీ, గృహిణి ఇంటికి యజ మాను రాలనీ తానెంతో ఆమెకూడా అంతేననీ ఈనాటి గృహస్థులలో చాలామంది గ్రహించడం ముదావహం. ఇందుకు గత శతాబ్దంగా ఆర్థిక సాంఘిక వైజ్ఞానిక రంగాలలో ప్రపంచవ్యాప్తంగా వచ్చిన విపరీతమైన మార్పే కారణం. స్త్రీ విద్య, స్త్రీకి ఆర్థిక స్వాతంత్ర్యం, స్త్రీలకి కూడా ఉద్యోగాలు యివన్నీ ఈనాడు తిండీ బట్టవలె నిత్యావసరాలని అందరూ అంగీకరించారు కనుక పురుషులతో సమానంగా స్త్రీలు చదువుకుని అంతో ఇంతో విజ్ఞానం, సంస్కారం, వివేకం సము పార్జించుకున్న తరువాతనే వివాహం చేసుకుంటు న్నారు.

బాధ్యతగల గృహిణులుగా గృహాన్ని 'స్వీట్‌హోం' లేకపోతే 'స్వర్గసీమ' చేసు కోగలుగుతున్నారు. బాల్య వివాహాలు, అవిద్య, అజ్ఞానం ఇవి ఎక్కువగావున్న ఆకాలంలో స్త్రీ స్వతంత్రంగా ఏ నిర్ణయమూ చేయగలిగిన స్థితిలో వుండేది కాదేమో! అందుకే ఆమెకి ఒకరు దీపం చూపాలి. అడుగు జాడలలో ఆమె నడవాలి. కానీ ఈనాడు పరిస్థితులు మారాయి. ఆత్మ విశ్వాసం స్వతంత్రమైన ఆలోచనా శక్తి నేర్పులూ అలవరచుకుని తమ ఇంటిని తామేతీర్చి దిద్దుకుని 'సెభాష్' అనిపించుకుంటున్నారు. గృహి ణులు స్వగ్రామాన్ని తల్లి దండ్రులనీ, అక్క చెల్లెళ్ళనీ విడచి కొన్ని వేలమైళ్ళదూరం భర్తతో వెళ్ళి...... అందుచేతనే ప్రస్తుతానికు సాయంత్రం పర్సుతెచ్చి అర్ధాంగికిచ్చి తనకు అవసరమైన డబ్బులడిగి తీసుకుని హాయిగా కాలం వెళ్ళ బుచ్చ గలుగుతున్నారు. చాలా మంది గృహస్థులు......పిల్లలు, వాళ్ళబట్టలు, స్కూలు ఫీజులు, నౌకర్లు, వాళ్ళకి జీతాలు, సరు కులు తెచ్చుకోడం, ఆఖరికి బ్యాంకులో డబ్బు దాచుకోడం, రేడియో లైసెన్సు కట్టడం, ఒకటే మిటి ఈనాటి గృహిణికి అనేక బాధ్యతలు వచ్చాయి. ఇవ్వే కాదు. భర్త సంపాదన చాలక పోయినప్పుడు గృహిణులు ఉద్యోగాలు కూడా చేస్తున్నారు. అటు ఉద్యోగంచేస్తూ, యిటు ఇల్లు చక్కదిద్దుతూ, జీవి కాలాన్ని ఒక నిముషమైనా వ్యర్థపరచకుండా సద్వి నియోగం చేసుకుంటున్నారు.

''కార్యేషుదాసీ, కరణేషుమంత్రీ'' అన్నట్లు ఇంటిలో ప్రతివిషయంలోనూ తానే అయి అజమా యిషీచేస్తుంది గృహిణి. అంతేకాదు. తీరికకాలాన్ని లలిత కళలకోసం వినియోగించి చేసి మంచి రచ యిత్రులుగా చిత్రకారిణులుగా పైకి వస్తున్నారు.

స్త్రీ అంటే అదొక ప్రత్యేకమైన జాతికాదనీ, మనలాగే మనస్సూ, మేధస్సూ కలిగిన మనిషి అనీ తన జీవితానికి ఆమే, ఆమె జీవితానికి తనూ వెలుగు రేఖలనీ, మనస్సు విప్పి మనస్సుతో వేదన చెప్పుకో దగిన ఒకే ఒక స్నేహితురాలనీ, పురుషులుగుర్తించి గౌరవించే రోజులు వచ్చాయి. శుభం. ఇక ఇంటి అధికారం స్త్రీలదా, పురుషులదా అని వేరే ప్రశ్న వేసే అవసరం లేదు. ఇంటి అధికారం ఇద్దరిదీ. ఆ అధికారంతో వచ్చిన బాధ్యతలూ ఇద్దరివే. అయితే గార్హ్యంలేని ఎన్నో హక్కులూ, బాధ్యతలు ఈనాటి గృహిణికి లభించాయి అందుకు సంఘ సంస్కర్తలకూ, వైజ్ఞానిక రంగానికీ స్త్రీలు కృతజ్ఞులు. ●

రాజకుమారి కార్తిని

(అది19వ శతాబ్దం చివరి భాగంలో ఒకరాత్రి. జావాలో ఒక పదమూడేళ్ళ బాలిక తన శయన మందిరంలో కూర్చుని వార్తాపత్రిక ఏదో చదువుతోంది. హఠాత్తుగా పత్రికని ఇవతల పడవేసి కిటికీలోనుంచి ఆకాశంలో ప్రశాంతంగామెరుస్తున్న నక్షత్రాలవైపు చూసింది.)

''ఈక్షణం నాహృదయం ఎలా ఉప్పొంగి పోతోంది! భారతవనిత పండిత రమాబాయి జీవిత చరిత్ర నన్నెంతో ఉత్తేజపరిచింది! ఆకాశంలో మెరిసే చుక్కలకన్న ఉజ్జ్వలమైన కాంతి ఆమెది! ఆ మహావనిత ప్రసరించిన వెలుగే నాజీవితానికి మార్గదర్శిని కావాలి. దయామయుడవైన అల్లా! నాకీ పత్రికచదివే అవకాశం కలిగించినందుకు నీకు మరో వందనం అర్పిస్తున్నాను.'' అనుకుంది ఆపిల్ల. (కార్తిని తండ్రి ఒక చిన్నదేశానికి రాజా. డచ్‌వారుఇండోనేషియాని జయించిన తరువాత తమ స్వతంత్రాన్ని కోల్పోయిన వారిలో ఒకడు.)

''భారతదేశంలో ఎలాగో మా ఇండోనేషియాలో కూడా స్త్రీలు అజ్ఞానమనే అంధకారంలో దారితెలియక తిరుగుతున్నారుకదా! ఆడవారికి చదువు అవసరమనే వాళ్ళలో నేనూఒకడిని. నాకుమార్తె 'కార్తిని'కి ప్రత్యేకంగా గురువులని కుదిర్చి ఇంటిదగ్గర చదువుచెప్పించాను కాబట్టి సరిపోయింది. యూరోపియన్ స్త్రీలు శ్రద్ధవహించి నేర్పటంతోఆమెకి ఫ్రెంచి, డచ్ రెండూ బాగా వచ్చాయి. కాని ఈ విద్య ఒకవిధంగా ఇబ్బందిగానే వుంది! అమ్మాయి పెళ్ళి చేసుకోనంటోంది...... భారతవనిత పండిత రమాబాయి లాగే తనూ స్త్రీ విద్యా ఉద్యమానికి జీవితం ధారపోస్తానంటూంది.... ఆమెని ఆపవలసిన పనిలేదు! కాని ఆపుణ్యస్త్రీ ప్రభావం నా కుమార్తెమీద ఎంతగావుంది!'' ఇలా ఉన్నాయి అదే సమయంలో కార్తిని తండ్రి ఆలోచనలు. (పండితరమాబాయి తండ్రి గొప్ప సంస్కృత పండితుడు మంగుళూరు దగ్గర చిన్న గ్రామం ఆయనది. ఆనాటిసమాజం స్త్రీవిద్యని ఆమోదించేది కాదు. అయినప్పటికీ విద్యాభిమానం కల వ్యక్తి కాబట్టి కుమార్తెకు సంస్కృత భాష బాగా నేర్పటంతోపాటు ఆమెకి బాల్యంలో వివాహం చెయ్యటానికి కూడా నిరాకరించాడు అందువల్ల ఆయన్ని వెలివేశారు. వెలవల్ల ఆయన చాలాకాలం అడవిలో జీవితం గడపవలసివచ్చింది ఆకాలంలో ఆయన ఎన్నో కష్టాలకి లోనయ్యాడు కొద్దికాలం తరువాత ఈ లోకాన్ని వదిలి వెళ్ళిపోయాడు. రమాబాయి తమ్ముడితో బాటు అఖిల భారత దేశ పర్యటన ప్రారంభించింది. ఎన్నో చోట్ల ఎందరినో పండితులని తన పాండిత్యంతో ఆశ్చర్య పరిచింది. బొంబాయి, కలకత్తా నగరాలలో బహిరంగసభలు చేసి విశేషజనాదరణని పొందింది. ఇరవైఏళ్ళు వచ్చిన తర్వాత ఒకబ్రాహ్మణేతరుడైన యువకుని వివాహం చేసుకుంది. ఇది ఆ కాలాని కొంత విరుద్ధంగానేవున్నప్పటికీ వారి వివా

రాజకుమారి కార్తిని

జీవితం సంతోషంగానే గడిచింది. కాని, రెండ సంవత్సరాలలో రమాబాయి భర్త హఠాత్తుగా ప్రాణాలు విడిచాడు. రమాబాయి దుఃఖానికి అంతు లేదు. భారత స్త్రీజాతినిఉద్ధరించటమే ఇక తనజీవితానికి మిగిలిన దనుకొన్నది)

"రమాబాయి ఎంత సాహసం గల స్త్రీ! మగవారు సంయితం చెయ్యటానికి వెనుకాడే సముద్రాంత ప్రయాణం చేసింది. తన చిన్న కూతురితో ఇంగ్లండ్ వెళ్లింది! అక్కడ స్త్రీల కళాశాలలో సంస్కృతం నేర్పి జీవనోపాధి కల్పించుకుంది. ఆమెకి ఇంగ్లండ్‌కి వెళ్లేదాకా ఇంగ్లీషు భాష రాదు! అక్కడికి వెళ్లిన తరువాత ఆ భాషని నేర్చుకుంది..."

కార్తిని ఇంకా రమాబాయినిగురించే ఆలోచిస్తోంది. (కార్తిని తన పద్దెనిమిదవఏట ఒక ఇండోనేషియన్ రాజకుటుంబపు యువకుడిని వివాహం చేసుకుంది. అదృష్టవశాత్తు ఆమెభర్త ఉదారస్వభావుడు, ఆధునిక దృక్పథం కలవాడు. తమదేశంలో స్త్రీ విద్యోద్యమం తన ఆశయం, అని నిశ్చయించుకున్న భార్యకి పూర్తి ప్రోత్సాహం ఇచ్చాడు)

*   *   *

"కార్తినిని భార్యగా పొందగలగటం నా అదృష్టం! బీదకుటుంబాలలోని ఆడపిల్లలికి విద్యాభ్యాసం మరింత అవసరం అంటుంది. ఆమె ఆశయాలు నిజంగా ఉదాత్తమయినవి " ఇలాఅనుకున్నాడు ఒకనాడు కార్తిని భర్త.

"భారత దేశానికి తిరిగివచ్చిన తర్వాత రమాభాయి బొంబాయి రాష్ట్రంలో ఒకచిన్న వూరిలో 'శారదా సదన్'అనే విద్యాసంస్థ ప్రారంభించింది. ఇక్కడ చాలా వితంతువులకి నివాసం, ఆడపిల్లలకి చదువూ ఈరెండూ ఏర్పాటు చేసింది. ఆకాలంలో క్షామాలు తరుచు వస్తూవుండేవి. అప్పుడు బీద రైతులు తమ కుమార్తెలిని పడువృత్తిలోకి అమ్మేవారు. ఈపద్ధతిని నిర్మూలించటానికి రమాబాయి ఎంతో కృషిచేసింది. ఆమె, ఆమె సహధ్యాయినులు కరువు ప్రాంతాలకి వెళ్లి ఆడపిల్లలని రక్షించేవారు. వారిని శారదా సదన్‌కి తీసుకువచ్చి చదువుచెప్పి, వారికి వివాహం కూడా చేసి పంపేవారు!. అక్షర జ్ఞానంమాత్రమే కాక గుణం కూడా ప్రధానం కదా! దీనిని రక్షించటం నా జీవిత పరమావధిగా పరిగణిస్తాను....." కార్తిని ఆలోచనలు ఇలా సాగాయి. అప్పుడు.

(పెళ్లి అయిన కొద్ది కాలంలోనే కార్తిని జావాలో ఒక ఆడపిల్లల పాఠశాల స్థాపించింది. ఇది పూర్తిగా ప్రజాదరణ పొందినదని తెలుసుకున్న తర్వాత దేశంలో ఇతర ప్రాంతాలలోను మరికొన్ని పాఠశాలలని స్థాపించింది. నేడు ఇండోనేషియా మొత్తంలో ఉన్న ఆడపిల్లల స్కూళ్లకి 'కార్తిని పాఠశాల'లనే పేరుపెట్టారు.)

ఈ మహా వనిత తన 25 ఏట అకాలంగా మరణించింది. ఇండోనేషియాలో ఆమె మరణించిన దినాన్ని పవిత్రవార్షికంగా పరిగణించి సెలవు ఇస్తారు. కాని రాజకుమారి కార్తిని స్మృతి చిహ్నాలన్నిటిలోనూ గొప్పవి ఆమె పేరుతో నడుస్తున్న పాఠశాలలే.

—వి సు]



మడిసెవ వెంకటేశ్వరరావు

నా న్నగారేదో పనిమీద పట్నంపోతూ ఒకసారి పొలం ఒకసారి చూచి రమ్మని నాకు పురమాయించారు. వరేలెమ్మని బయలుదేరాను.

పొలం మావూరుకు సుమారుగా రెండుమైళ్ళకు పైగా వుంటుంది. నాకు నడవటం మొదటినుంచీ అలవాటే కాబట్టి అర్థగంటలో అతి సునాయాసంగా గమ్యస్థానం చేరుకున్నాను.

పొలంచూచుకొనేసరికి నాలోని రైతు హృదయం ఆనందంతో పొంగిపొరలింది. బడితెడు బడితెడు కంకులు. కంకుల నిండా వజ్రాల్లాంటి వడ్లు. ఇప్పుడిప్పుడే పాలు పోసుకుని గట్టిపడుతున్నాయి. ఇంకో పక్షం రోజులు దేవుడు తిన్నగాచూస్తే ఎకరానికి పాతిక బస్తాలకు తక్కువరావు.

మలయమారుతం మెల్లమెల్లగా వీస్తోంది. సస్యశ్రీ సంతసంతో నాట్యం చేస్తోంది. చేనిగట్టున సరిహద్దు సర్వేరాయి మీద చతికిల బడ్డాను.

పెద్దకాల్వలో రెండునావలు తెరచాపలెత్తుకొని ఆ పిల్లగాలి తోపుడికి మెల్లమెల్లగా సాగిపోతున్నాయి. బోదిలోనుంచి ఒక చిన్నచేప ఎగిరి గట్టుమీద పడి మళ్ళా అటూ ఇటూ కొట్టుకొని నీళ్ళలో పడిపోయింది. కన్నంలోంచి ఎండ్రకాయొకటి బయటకు తొంగిచూచి, నన్నుచూచికాబోలు మళ్ళా లోనికి వెళ్ళిపోయింది. ఒక నత్త తన గుల్లమూతిని తెరచుకొని, మీసాలు ముందుకుచాచి కన్పించనంత మెల్లగా ముందుకు సాగుతోంది. మెల్లగా నేత్తో పైకి తీశాను. గుల్లలో వక్కి ద్వారం మూసేసింది. విప్పేందుకు ప్రయత్నించాను. కాని, లాభంలేక పోయింది. విసిరి చేలోకి గిరాటేసి చెయ్యి శుభ్రం చేసుకొని లేచి నిలబడ్డాను.

ఎదురుగా లచ్చి!!

ఆ నిర్మానుష్య ప్రదేశంలో ఒక్కసారిగా లచ్చిని ఒంటరిగాచూచి, ఆడపిల్లలా సిగ్గుతో కుంచించుకుపోయాను. నాకు తెలియకుండానే నా తల నవ వధువు శిరస్సులా వంగింది. హృదయం దడదడలాడింది.

తూములో వగావికి నీళ్ళవేగంతో ప్రవహిస్తున్నట్లుగా గలగలా నవ్వింది లచ్చి. వోరగా చూచాను. ఆ సమయంలో నేనే స్త్రీని. ఆమే పురుషుడు.

నెత్తిమీదున్న గడ్డితట్ట మెల్లగా దించి గట్టుమీదెట్టింది. కొడవలి పైన గుచ్చింది. నెత్తిమీది గుడ్డచుట్ట దులిపి క్రిందేసుకు కూర్చుంది.

"అబ్బాయిగోరూ......"

"...............”

"ఏందుండి అది..... ఆడపిల్లకన్నా అన్యాయంగా సిగ్గడిపోతారు...."

"లక్ష్మి."

"నాపేరు లక్ష్మికాదు."

"మరి?"

"లచ్చి"

నాకు నవ్వొచ్చింది. అయితే లచ్చి ఎదుట నవ్వలేక పోయాను. పూర్వంగా గుంపులుగా పోతున్న తెల్ల కొంగలను చూస్తూవుండి పోయాను. కాని లచ్చి నవ్వుతోంది. ఎందుకు నవ్వుతోందో కూడా నాకు తెలియలేదు. అయోమయంగా ఆమె కళ్ళల్లోకి చూచాను.

"అబ్బాయిగోరూ... మీరలా ముఖం పెడితే నాకు మళ్ళా నవ్వొస్తోందండీ...." అంటూనే మరీ పగలబడి నవ్వింది లచ్చి. నేను క్షణకాలం నివ్వెరపోయాను. ఆపైన కాస్త తేరుకుని పేలవంగా నవ్వాను. నానవ్వు నాకే పేలవంగా కన్పించింది లచ్చిలా స్వచ్ఛంగా నేను నవ్వలేనేమో!

"సరేగానీండి. పిల్లిపెసరకాయలు తింటారా?"

వద్దని తల అడ్డంగా తిప్పాను.

"ఎందుకనేమిటి— తినకూడదా?"

"తినకూడదనే నియమమేమీ లేదనుకో. కాని నాకేమిటో తినాలని లేదు."

"ఐతే తినాలిసిందే. తింటం ఆరంభిత్తే అదే తినాలని పిస్తాది."

నేను కాదనలేక పోయాను. అలాగ అవునని అనలేదు. మౌనం అర్ధాంగీకారంగా భావించి తన వడిలోనుంచి గుప్పెడు కాయలుతీసి నాముందు పోసింది. వాటిలో పచ్చివీ ఎండినవీ కూడా వున్నాయి. అంతక్రితం అలవాటేగనుక మెల్లగా మునివళ్ళతో కొరికి తినసాగాను.

ఏమిటో ఆ బలహీనత! మొదటినుంచీ ఆమె సమక్షంలో నా బలహీనత బయట పడుతూనే వుంది. అందుక్కారణం మాత్రం ఇతమిద్ధంగా చెప్పలేను. జీవితంలో వూహాకందని అనుభవాలుంటాయని నా కిప్పుడిప్పుడే అర్థమవుతోంది. నా బలహీనతే మమ్మల్ని సన్నిహితులుగా చేసిందేమోనన్న భావనకూడా నాకుంది. ఆమె నుంచి కూడా అలాంటిదేదో తత్వం నన్నాకట్టుకొనివుంటాలి. అంతకు మించి మా పరిచయానికి కారణం వెదకడం వ్యర్థం.

"అబ్బాయిగోరూ..."

"ఏమిటి లచ్చీ.."

"ఏందో ఆలోచిత్తున్నట్టున్నారే!"

"అవును లచ్చీ నిన్నుగురించే ఆలోచిస్తున్నా."

లచ్చి కళ్ళు పెద్దవిచేసి క్షణకాలం ఆశ్చర్యంగా చూసింది నావైపు. మళ్ళా అప్పుడే గలగలా నవ్వేశి లేచి నిలబడింది. గడ్డి తట్టలో దాచిన దోసకాయొకటి పైకితీసి; కోసి సగం నాకందించింది. నేను మౌనంగా అందుకొని నములటం ప్రారంభించాను. తినాలని లేకున్నా ఆమె ఇచ్చింది గనుక తింటున్నాను. అదే ఆమె సమక్షంలో నేను ప్రదర్శించే బలహీనత!

నీడలు తూర్పువైపుకు పరిగెడుతున్నాయి. ఆకాశంలో ఒక మేఘశకలం అల్లల్లాడింది. గడ్డి పువ్వులు గాలికి తలలూపు తున్నాయి. తెల్లకొంగలు తమాషాలు చెప్పుకుంటూ జట్లుజట్లుగా ప్రయాణం చేస్తున్నాయి.

"ఇకెళదా మెత్తారండి..."

"పద" అన్నాను మెల్లగా ఆలోచనలనుంచి తేరుకొని. నెత్తిమీద గడ్డి తట్ట పెట్టుకుని నిమ్మదిగా నడచిపోతోంది లచ్చి. వెనుక నడుస్తూ ఆమె వైపు పరికించి చూచాను. లచ్చి నిజంగా లక్ష్మి. నెమలిలా వయ్యారంగా నడుస్తోంది. కొండమీదికి వేసిన రోడ్డులా సుడులు తిరిగి తగిన ఎత్తు పల్లాలతో ఆకర్షణీయంగా వుంది ఆమె శరీరం. సిగలో తురిమిన ముద్దబంతిపూలు చంద్రకాంత శిలల్లా మెరుస్తున్నాయి.

ఉన్నట్టుండి వెనుతిరిగి "అబ్బాయిగోరూ" అంది లచ్చి తన సహజ స్వరంతో—

ఏమిటని కండ్లతోనే ప్రశ్నించాను.

"మీరెన్ని కలాసులండి చదివింది."

"స్కూలుఫైనలు పరీక్షలు మొన్ననేగా రాశాను—"

"ఇస్కూలుఫైనలంటే ఎన్ని కలాసులండీ."

ఆమె అమాయక హృదయాన్ని చూస్తే ఒక విధమైన ఆప్యాయత, నవ్వు రెండూ కలిగాయి.

"ఎన్ని కలాసులండీ.." తిరిగి ప్రశ్నించింది లచ్చి.

"పదకొండు."

"అబ్బో! అయితే మనూరు చదువైపోయిందన్న మాట...!"

"పైనైతే— అన్నమాటే.."

"అయితే పేటకెళ్ళి పెద్దబళ్ళో జేరతారా?"

"చేరాలనే అనుకొంటున్నా."

"అంత చదివేం చేత్తారూ.... అని"

"ఇప్పట్లో చదవటాన్ని గురించే ఆలోచన. ఏమిచేసేదీ ఆపైన మాట."

ఆమె ఆపైన సంభాషణ పొడిగించలేదు. ఆమె హృదయంలో ఎలాంటి భావనలు మొలకెత్తుతున్నాయో చదివేందుకు ముఖం కన్పించటం లేదు. ఇంతలో వూరు దగ్గరపడటంతో నేను క్రమేణా వెనక్కు తగ్గాను. ఆమె వెనుతిరిగి చూడకుండా వెళ్ళిపోయింది.

* * *

నేను స్కూలుఫైనలు పాసయి వుయ్యూరులో పాలిటెక్నిక్‌లో చేరాను. ఆపైన మళ్ళా పదినెలల వరకు మాగ్రామం పోనేలేదు. ఒకటి రెండు పర్యాయాలు నాన్నగారే వచ్చి నన్ను చూచి వెళ్ళిపోయారు.

ఎండు టెండలు. భూదేవి వెయ్యి నాల్కలతో వర్షబిందువును చవి చూచేందుకు ఆరాటపడుతోంది. సాయంత్రం ఐదు గంటలయితేగాని సముద్రంమీది చల్లగాలి భూమిపైకి ప్రాకటం లేదు.

అప్పటికి మాగ్రామంచేరి పదిహేను రోజులౌతుంది. అందరితోనూ నోరువిప్పి అధికంగా మాట్లాడే అలవాటు నాకేనాడూ లేదుగనుక పుట్టిన గ్రామంలోనైనా కాలక్షేపానికి నాకు పుస్తకాలే శరణ్యమయ్యాయి. మధ్యాహ్నమప్పుడు కాసేపు చదువుకోవడం, కాసేపు పండుకొని నిద్రపోవడం, మరి కాసేపు తమ్ముళ్ళతోనూ, చెల్లాయిలతోనూ ఆడుకోవడం. ఆపైన ఐదు కావటంతోనే నూతి తోంచి బొక్కెనతో చన్నీళ్ళు తోడి పోసుకుని అలా కాలువ గట్టంట షికారుకు బయలుదేరడం నా నిత్య కృత్యాలయిపోయాయి.

అన్ని రోజులైనా లచ్చి కన్పించక పోవటం నాకు ఏమిటో వెలితిగా వుంది. ఆవిడను గురించి తెలుసుకోవాలని కుతూహలంగానూ వుంది. కాని అలాంటిదేదైనా తెలుసుకోవాలంటే ఆయాచితంగా జరగాలి సిందేగాని మరొకర్ని అడిగి తెలుసుకొనే ధైర్యం లేదు నాకు. ఈ విషయాల్లో నేను చాలా పిరికివాణ్ణనే చెప్పుకోవాలి. నేననలు స్వతహాగా వట్టి పిరికివాణ్ణని నా చుట్టూ చాలామంది చెప్పుకు నవ్వుకునే వాళ్ళు. కాని అదేమి చిత్రమో గాని వాళ్ళలా చెప్పుకున్నందుకు నాకెలాంటి సిగ్గుగాని, బాధగాని కలిగేవి కావు. పైపెచ్చు అది నాలోని ప్రత్యేకతగా భావించి మురిసిపొయ్యే వాడిని.

నా వయసువారూ, నాకన్నా పెద్దవారు కూడా చాలామంది అలగాజనం అమ్మాయిల వెంటపడి వేళాకోళా లాడుతూండేవారు. ఆ అమ్మాయిలు కూడా వాళ్ళను కవ్వించి, నవ్వించి, ఆడించి, అలరించి ఒక తట్టెడు గడ్డో, ఒక కుంచెడు గింజలయ్యే నాకెడు వరిపోనో సంపాదించి ఇంటిదారి పట్టేవారు. కాని ఒక్క లచ్చితో మినహాయించి నేనెవ్వరితోనూ మాట్లాడి ఎరుగను. ఆ మాట్లాడటం కూడా లచ్చి ప్రయత్నమేగాని నా ప్రమేయం వల్లకాదు.

ఏవేవో విషయాలు ఆలోచిస్తూ కాలవగట్టంట పడి మెల్లగా నడుస్తున్నాను. సంతకుపోయే ఎడ్ల మెడల్లో గంటలు గణగణ మ్రోగుతున్నాయి. దూరంగా ఆలమందలో ఆబోతుల రంకె అస్పష్టంగా విన్పిస్తోంది.

కాలవగట్టుదిగి పొలాల్లో కాలిబాటన నడక సాగించాను. వృక్షాలనీడలు వుండుండి రాక్షసుల్లా పెరిగిపోతున్నాయి. ఎక్కడినుంచో మందపవనం మొగలిపువ్వు సౌరభాన్ని మోసుకొస్తోంది. గొర్రెల మందంతా గుంపుగా ముందుకు పోతుంటే నడువలేని తన బిడ్డకోసం నిలబడిపోయింది తల్లిమేక. గొడ్లను ఇళ్ళకు మళ్ళించి దున్నపోతు మీద స్వారి చేస్తూ కూనిరాగాలు తీస్తున్నాడొక కుర్రాడు.

వెనుదిరిగి మెల్లగా అడుగు వేస్తున్నాను. నేరేడు చెట్టు కొమ్మమీద పిట్ట తియ్యగా పాడుకొంటోంది. "జండాపై కపిరాజు..." అన్న పద్యాన్ని సాగదీసి— సాగదీసి రాగాలాపన చేస్తున్నా డెవరో యువకుడు. గట్టిగా ఈలవేస్తూ రఘురామయ్య పక్కిలో అందుకొన్నాడు మరొకడు. చెట్ల గుబురుల్లో చేతి నవ్వడి చేస్తోంది గాలి.

"అబ్బాయిగోరూ— మీరా.!!"

ఉలిక్కిపడి తలెత్తి చూచాను. సన్నగా నవ్వుతోంది లచ్చి. మనిషి కాస్త ఆంకినట్లున్నా అవయవాల బిగుతు ఇనుమడించినట్లుంది. సిగలో మొగలి రేకులు తురిమింది. చీర బిగించికట్టి గోచిపెట్టింది. పైటకొంగు మెడచుట్టూ తిప్పి బొడ్డులో దోపుకుంది. నెత్తిమీద రెండు ఉస్తరి తట్టలు వాటిమీద పార వున్నాయి. చెమటకు తడిసిన కుంకుమ బొట్టు ఫాలభాగాన్ని ప్రజ్వరిల్ల జేస్తోంది.

ఆశ్చర్యంతోనూ ఆనందంతోనూ తదేకంగా చూస్తూండి పోయానేను.

"అదేంటండీ! అలా రెప్పేయకుండా చూత్తుండారూ...!"

సిగ్గుపడి తల ప్రక్కకు తిప్పాను. నా ఇర్మతి వంకా ఎగాదిగా చూస్తున్నాడు మరోవ్యక్తి. హృదయము జల్లుమంది. సిగ్గు మంచుముక్కలా శరీరాన్ని ముంచెత్తింది.

"మా మావేనండీ...." అంది లచ్చి.

"దండాలు బాబుగోరూ. తమరెవరా అని ఆశ్చర్యపోయి చూత్తుండా! తమరు దేముడయ్యగోరి అబ్బాయిగోరు కాదూ...!"

"బలేమావా! చూచింద్రా— మావూహా కెంత గురుతో!!"

"చాల్లేవే పిల్లా. ఈ గడ్డమీద పుట్టినోళ్ళనే గురుతట్ట లేనను కున్నావా..!"

"చాల్చాల్లే వూరుకో! అయిదేళ్ళగ్గురుతొచ్చావా నేను."

"ఓ యబ్బో! ఇంకా పోలేదన్న మాట కోపం. చూసుకోపిల్లా— చెబుతుండాను. ఈసారి విన్నాదిరి సణముంటే చచ్చినంతొట్టు.."

"అవునుమరి! పావాలనేగా సిపాయిల్లో చేరావు! ఇంకా ఒట్టెందు కేంటి, ఒట్టు..."

"ఈసారి నువ్వే చూత్తావుగా! మాటంటే మాటే. విన్నాదిరి సిపాయిల్లో చేరనుగందా చావను గూడా చావను..."

"సంపాయించావులే మా దొడ్డ తెలివి. చావు సెప్పొస్తుందను కున్నావేంటి! ఇలా ఎగరేసి అలా మింగేస్తుంది..."

"అయితే మాత్రమేం నువ్వుండావుగా! సావిత్రమ్మగోర్లాగా యముడెంట పడి నన్ను బతికించుకోలేవూ......!"

"ఆఁ! బతికించుకోనేం. లేకుంటే నన్నుబాదేంతా కెవరుంటారు మరి!"

"చూసుకోలచ్చా! నస్తే పీనంటిమీదింక వెయ్యెయ్యనంటే యెయ్యను......"

"చెయ్యెయ్యాలనే ఏముందిలే. కర్రేత్తైచాల దేంటి!"

"అమ్మతోడులచ్చా! నువ్వు నాదేవతవు.."

లచ్చికళ్లు ఆనందంగా మెరిశాయి. తృప్తితో తూలిపోతోంది. త్వరత్వరగా అడుగువేస్తోంది. భుజాన గడ్డపలుగు దానికి తగిలించిన తాటేటి కాయతో వెనుక నడిచాడుమావ. తూనీగల్లా గాల్లో తేలిపోతున్నారు వాళ్ళు.

నేను మెల్లగా తప్పటడుగులు వేస్తున్నాను. మావ దేవతనగానే లచ్చి కళ్ళలో ఎన్ని మెరుపులు మెరిశాయో! ఎంతటి అల్పసంతోషి లచ్చి!!

మామ లచ్చికి తగ్గవాడుగా కన్పించలేదు నాకు. లచ్చికి అతని వల్ల కష్టాలేగాని, సుఖం శూన్యం అని పించింది. నాకు. అతని మాటల్లో కల్మషత్వం ఉం దనలేము గాని, హృదయ దౌర్బల్యం మాత్రం ప్రస్ఫుటంగా కన్పిస్తోంది.

నిశి మెల్లగా అలము కొంటోంది. చంద్రుడు రోహిణి కోసం తపించి కృశించాడు. నక్షత్రాలు లచ్చి కళ్లల్లోని సోయగాన్ని ఎరువు తెచ్చుకొని మిల మిల్లాడు తున్నాయి. ఇంటికి చేరేసరికి చెల్లాయి అరుగుమీద గూట్లో దీపమెడుతోంది.

*　　　*　　　*

ఆరోజు వంతెనకు దిగువగా వున్న సర్విచెట్లలో కూర్చున్నాను. చేతులో నవలుందిగాని పేజీలు తిర గటంలేదు. ఏమిటేమిటో ఆలోచిస్తూ కూర్చు న్నాను.

ఎక్కడినుంచో అకస్మాత్తుగా ప్రత్యక్షమైంది లచ్చి. చేతిలో తాటాకు బుట్టతో చేసిన దోనె వుంది. నవ్వుతూ వచ్చి నాకెదురుగా కూర్చుంది లచ్చి.

"ఇరవై నాలుగ్గంటలూ ఏంటుండే ఆలో చించేది!" నవ్వి పూరుకున్నాన్నేను.

"పట్నంనుంచి నాకేం పట్కొచ్చారు....?"

"ఏంతెస్తే నీకిష్టమో నాకెలా తెలుస్తుంది మరి"

"పోనీ మీకు నచ్చిందే తేవచ్చుగా—"

"సరైతే ఈసారి తప్పకుండా తెస్తాగా—"

లచ్చి కిలకిలానవ్వింది. నేను సన్నగా శృతికలిపాను.

"పోనిలెండిగాని ముందీ ముంజెలు తినండబ్బా యిగోరూ—"

"నాకోసం తెచ్చావన్న మాట ...."

"మీకోసం కాక నాకోసం ఇక్కడికి తెచ్చుకుంటా ననుకున్నారేంది......"

"పోనీగానీ లచ్చి నేనంటే నీకెందుకింత ప్రేమ!"

"ప్రేమెందుండీ! ప్రేమ—! ఆ ప్రేమాగీమా నాకేవి తెల్దండీ! మిమ్మల్ని చూత్తె నాకెందుకోగానిండీ జాలేత్తాది. మీరీకాలపు అబ్బాయిలంద రంటోరు కాదండీ. అదుగో..... ఏందండీ....అలా సిగ్గడి పోతారు....!!"

లచ్చి ఒక్కొక్క ముంజీ బుంగలోంచి తీసి శుభ్రంగా పేడువలిచి నాకందిస్తోంది. నేనుమారు మ్లాటాడకుండా తింటూ కుర్చున్నాను. నన్ను చూస్తె లచ్చికి జాలేత్తోందట—!

"అబ్బాయిగోరూ మరిమాకు వప్పన్న మెప్పు డండీ....."

"నువ్వు చెప్పకుండా మావను తెచ్చుకోలా— అలాగే నేనుకూడా ఎవరికీ తెలియకుండా నీలాం టమ్మాయిని ఒకదాన్ని తెచ్చుకుంటా......."

"అయితే అబ్బాయిగోరూ— మీకూ్కడా మామావ నచ్చలేదన్నమాట.....?"

"నాకూ్కడా అంటే ఇంకెవరికి నచ్చలేదట?"

"ఎవరికేందండీ! ఒక్కరికన్నా అనండి సరి పోతాది.."

"నిజం"!

"ఏంటండలా ఆశ్చర్యపోతుండారు. ఈ వూర్లో ళ్ళందరికీ మామావను చూత్తే ఎందుకో అంత మంట—"

"కారణం—!"

లచ్చి

"మామావ నీతిలేనోడంట. తాగుబోతంట! పెళ్లాంమీద చేయిచేసుకుంటాడంట.!"

"అయితే లచ్చా మీమావు నిన్ను కొడతా డన్నమాట—!"

"ఏంటుండే! మీరుకూడా అలాగంటారు. అసలీ వూళ్లో పెళ్లాన్ని కొట్టని మొగాడెవడంట?"

నాకేమనాలో తెలియలేదు. అంతరాంతరాల్లో యోచించి చూస్తే లచ్చిమాటలో నిజంలేకపోలే దని పిస్తోంది. పల్లె జీవితంలో భార్యను హింసిం చటం భర్త మగతనానికి నిదర్శనంగా భావించిన రోజులు కూడా లేకపోలేదు.

"అబ్బాయిగోరూ....! మామతాగుతాడు. ఆమై కంలో నన్ను కొట్టటమూ నిజమే. ఈరెండూ వూరోళ్ళందరికీ తెలుసు. నాకూ తెలుసు. కాన బ్బాయిగోరు—నాకు తెలిసింది, వాళ్ళకు తెలియంది మరొకటుంది. అదే.....నేనంటే మామకున్నప్రేమ. తాగనప్పుడు మామ నన్ను మాలచ్చిమిలాచూసు కుంటాడు. గుండెల్లో దాచుకుంటాడు. ఒల్లు తెలియక నన్నుకొట్టినందుకు ఆతరువాత మామెంత కుమిలిపోతాడో నాకు తప్ప ఎవరికీ తెలుసుండీ!" లచ్చిచెప్పుకు పోతోంది. ఆమాటల్లో ఉద్వేగముంది. నిండుతనముంది. ఆమె చెప్పే ప్రతిమాటాహృదయ పూర్వకంగా చెబుతోంది.

"మామకూడా మనిషేగదుండీ! సిపాయిగా చేసాడుమామ. అప్పుడే అలవాటైంది తాగటం. తాగితేమాత్రం మనస్వాధీనంలో వుండడండి. తాగినోళ్ళంతా అంతే గదుండీ...."

"పోనీ త్రాగటం మాన్పించలేక పోయావా.." అన్నాను నేను.

"అదెలాగుండీ.... తాగటం మరిగాక మానటం మాటలా ! అలాచేసినోర్ని ఒక్కర్ని చూపండి. నా మామను తాగొద్దని ఎలా బలవంతపెట్టేదుండీ."

"......................."

"ఇంకపోతే నీతంట.. నీతి...ఏందుండీ నితంటే, రామ—రామ అంటూ ప్రొద్దున్నే కాలవలో మునుగు తారు చూడండి— రామచంద్రయ్యగారు......వారి గట్టునిండా గడ్డంచుకొని, వెంకట్రావుగారి చేలో వరికోసుకొచ్చి గొడ్ల కేసుకున్నారు. ఇదే నంటుండీ నీతంటే.....!! ఎంకట్రావుగోరు నోట్లోనాలుక లేని మారాజు గనక సరిపోయింది. అదే నాలాంటి మనిషయితేనా వీధి కీడ్చాల్సిన పని గాదూ...."

"అయితే లచ్చీ నువ్వంత గడుసుదానివన్నమాట"

"ఇందులో గడుసుతనమేముందండీ—! మీకు తెలియదబ్బాయిగోరు.... నోరుంటేనేగాని తల కాయదు. నానోటికి జడిసే కాకుంటే ఎందరు నావెంట పడక పోయేరు....."

"......................"

"పోయొత్తానబ్బాయిగోరూ....." అంటూ లచ్చి వెళ్ళిపోయింది. ఆమె వెళ్లే వైపే చూస్తూ కూర్చుండి పోయాను. కనుచీకటి పడుతోంది.పక్షులు కలకలారావాలతో గూళ్ళు జేరుకుంటున్నాయి. లేచి నిలబడ్డాను. అడుగులు పడుతున్నాయి. లచ్చిని గురిం చిన ఆలోచనలతో మెదడు వేడెక్కింది. మధ్య మధ్య మలయమారుతం అలలు అలలుగా శరీరానికి సోకి సేదదీరుస్తున్నది...

*　　　*　　　*

తిరిగి కాలేజీలు తెరవటంతో నేను వుయ్యూరు వెళ్ళిపోయి చదువులో పడ్డాను. రోజులు నిర్వి ఘ్నంగా దొర్లిపోతున్నాయి.. ఈమధ్య మాతాత గారికి సుస్తీగా ఉంటే చూచొచ్చేందుకు మా వూరుకూడా ఒకసారి వెళ్లొచ్చాను. కానినేనక్క డున్నది రెండురోజులేకావటాన ఆవ్యవధిలో లచ్చిని చూడలేకపోయాను. అయినా నేను హడావుడిగా వెళ్లటంతో లోగడ వాగ్దానం చేసిన ప్రకారం లచ్చికి రంగురంగుల గాజులు, రిబ్బన్లు లాంటి వేమీకొన లేదు. ఆవిడ కన్పించిందంటే ఆచిలిపి కళ్ళతో ఆ విషయం అడక్కపోదు. నామనసు చివుక్కుమనకా పోదు. అందుకే ఆరెండురోజులూ బయటకూ్కడా పోకుండా ఇంట్లోనే గడిపి తిరిగొచ్చేశాను. కానీ లచ్చిని చూడాలన్న వుత్కంఠ నాలోలేకపోలేదు.

ఆరోజుతో అర్ధసంవత్సరం పరీక్షలు అయి పోయినై. ఆఖరు పరీక్ష పూర్తి జేసుకుని గదికి వెళుతున్నాను. రేపు సాయంత్రం ప్రయాణమయ్యి బెజవాడ వెళ్ళి, అక్కడొక అరడజను సినిమాలన్నా చూచుకొని ఆపైన మావూరెళ్ళాలని యోచిస్తు న్నాను. బెజవాడలో మాకు బంధువులున్నారు.అల చేత రెండురోజులపాటు తిండికీ వసతికీ లోటుండదు, అసలు వాళ్ళు కన్పించి నప్పుడల్లా తరచు వచ్చి వెళ్లమని చెబుతారుగాని నేనేవెళ్ళను. లచ్చికి ఇవ్వాలనుకున్న బహుమతులు కూడా బెజవాడలోనే కొనేందుకు నిశ్చయించుకున్నాను.

నేనిలా ఆలోచిస్తూ పోతుంటే ప్రక్కన పోతున్న పెద్దమనిషి తట్టి పిలిచాడు. అయో మయంగా చూచాను ఆయన కండ్లలోకి.

"మిమ్మల్నెవరో ఆడకూతురు పిలుస్తున్నదండీ"- అన్నాడా పెద్దమనిషి. ఆశ్చర్యంతో వెనుతిరిగి చూశాను.

లచ్చి—!!!

నిజంగాలచ్చే! ఇక్కడికెందుకొచ్చినట్లో!!

అయినా ఎందుకైనా మంచిదని తేరిపార జూచాను.

అవును లచ్చే! నిజంగాలచ్చే! తనదగ్గరకు రమ్మ న్నట్లు చేయాడిస్తోంది.

మెల్లగా వెనుదిరిగి వెళ్లాను . అప్పుడే బస్సులోంచి దిగిన లచ్చి సన్నగా నవ్వుతోంది. ప్రక్కనే చిన్న ట్రంకుపెట్టె, దానిమీద గోనిసంచినిండా ఏవేవో సామానులూ వున్నాయి. నాగొంతు మూగపోయింది. మనస్సులో ఉత్సుకత, గొంతులో ఆశ్చర్యంగజి బిజి చేస్తున్నాయి.

"అబ్బాయిగోరూ—బాగున్నారా—"అంది సన్నగా నవ్వుతూ. నేను సమాధానంగా చిరునవ్వు నవ్వు కున్నాను. లచ్చి గోముగా చూచింది,

"అసలు సంగతేమిటి లచ్చీ?" అన్నాను ఎలాగో గొంతుపెగుల్చుకుని.

"సంగతులున్నాయి గానుండీ....మీగదెక్కడండీ"

"ఇంకాస్త ముందుకు పోతే ఆకన్పించే బాంకు ప్రక్కసందులో వుంది నాగది. ఇంతకీ ఏమిటసలు సంగతి!"

"అయితేపదండి. ముందుసామాన్లు మీగదిలో

కిడేసి అప్పైన మామగార్గగారికు పోదాం..."

ఇంక మాట్లాడకుండా ఒక కుర్రాణ్ణి పిలిచి సామాన్లు బస్సు ఎక్కించి మీదెట్టించాను. పెట్టె అచ్చి చేత్తో పట్టుకుంది.

ఇదీతో సామాన్లు పెట్టె అచ్చినేనూ మళ్ళా రోడ్డుకు వచ్చాం. అందరూ మావే చూస్తున్నట్లు భావించుకుని సిగ్గుతో కుంచించుకుపోయాను. వడిబజారులో ఒక ఆడదాని వెంట పోవటమంటే నాకేమిటో పెరుగ్గా మా భయంగానూ వుంది. అయినా తప్పదు.. అసలు విషయమేమిటో నాకింకా బోధపడలేదు.

"అబ్బాయిగారూ. మీకుతెలుసా?" అందిఅచ్చి.

నాకేమీ తెలియ నట్లు అయోమయంగా ఆమెకళ్ళలోకి చూశాను.

"మామామ సుబ్బరాజుగార్ని లేవదీసుకొచ్చే పాడేవూరు."

"ఆ! "అన్నాను ఆశ్చర్యపోయినట్లుగా.

"అవునండీ! నిజమే! అప్పుడే మూడునెల్లయి పోయింది. ఈ బాగోతం అంతకు ముందెన్నిరోజు లుగా జరుగుతోందో నాకేదే తెలుస్తుంది. అయినా మీరేదే చెప్పండబ్బాయిగారూ.......వాళ్ళిద్దరికీ మన స్సులు కలిస్తే నాకు చెప్పొచ్చుగా! దొంగల్లా పారి పోయి రావటం దేనికండీ!"

నావీపుమీద ఎవరో గట్టిగా చరిచినట్లయింది. అచ్చి కళ్ళలోకి సూటిగా చూడలేక ప్రక్కగా చూశాను. అచ్చి నిజాలవు మనిషే అన్నసందేహం కలిగింది. పల్లెటూరి పడుచులో ఇంతటి సంస్కార ముంటుందని నేను కలలోకూడా ఆశించ లేదు. మొదటినుంచీ అచ్చిలో ఏదోఆకర్షణ నన్ను ఆకట్టుకుంటోంది ఈ ఆకర్షణ స్వరూప మేమిటో స్వభావమేమిటో నాకు నిజంగా తెలియదు. ఆ అడవి పుష్పంలో ఇంతటి సౌరభ్యం వుందని తెలుసు కొన్న ఆ క్షణం నిజంగా నాజీవితంలో ఒకమధుర క్షణం. యుగయుగాల అనుభవం ఒక్కసారిగా రూపందాల్చి ప్రత్యక్షమైనట్లనిపించింది.

సుగర్ ఫ్యాక్టరీలో పనిచేసే నేను గింగురెత్తే టట్లు కూస్తోంది. ఏడు, మూడేసమయం. ఒకమహాప్రవాహంలా జనంగుంపుల్లో ముందుకు కదుల్తున్నాయి. రోడ్డు ప్రక్కగా మెల్లగా అడు గులు వేస్తున్నాను. ఒకలాగే మనస్సంతా దూసుకు పోతోంది.

"మామామ పంచదారమిల్లులో పనిచేస్తున్నా డుటండీ! మొన్నీమధ్యనెప్పుడో సుబ్బరాజు గారికి కనిపించాడంట. అందుకే పెట్టె బేడా సర్దుకొచ్చే సేనుండీ......" అంది అచ్చి.

"కాని అచ్చి...మీమామ నిన్ను చేరదీయక పోతేనో.....?"

"ఎందుకు చేరదియ్యడండీ! మామామెంత మంచోడో మీకింకా తెలియదండీ.."!

నేను తెల్లబోయాను. ఎంత ప్రయత్నించినా అచ్చిని నేను సరిగ్గా అర్థం చేసుకోలేకుండా వున్నాను. తనకు తెలియకుండా మరో స్త్రీతో లేచిపోయిన ఆమె భర్త తనను తప్పక ఆదరిస్తాడని ఆమె కెంత విశ్వాసం!

మెల్లగా అడుగులు పడుతున్నాయి. వంతెనదాటి నాలుగడుగులు వేశామో లేదో అచ్చి మొగుడు హడా వుడిగా వచ్చి ఆమెభుజాలు పట్టుకొని ఆనందంతో పూసేశాడు. నా అంచనా తప్పిపోవటంతో నేను మరోసారి గతుక్కుమన్నాను.

అది తెచ్చిపెట్టుకున్న సంతోషం కాదుకదా— అన్న అనుమానం కలిగి కొన్ని క్షణాలతన్ని పరి శీలనగా చూశాను. కాని అలాటి సందేహానికి ఎలాటి ఆధారమూ కన్పించలేదు నాకు. అంతటి అమాయ కుల్లో ,అలాంటి విచిత్ర ప్రవృత్తులెలా దాగి వున్నాయో నాకినాటికీ అర్థం కానేలేదు.

"ఏంబాబుగారూ — కులాసాగా వున్నారా?" అన్నాడు అచ్చి మొగుడు.

"ఆ .." అన్నాను ముక్తసరిగా.

"అమ్మాయిగారొస్తేగాని అబ్బాయిగారింకా కులాసాగా వుండరు. "అని కిలకిలా నవ్వింది అచ్చి. పూర్ణిమ జ్యోత్స్నలా స్వచ్ఛంగా వుంది ఆ నవ్వు.

"బాబుగారూ....మీక్కుడా అచ్చిలాంటిభార్య దొరకాలండీ. ఒకాల మీరు దేశాలట్టిపోయినా వెదికి పట్టుకోవద్దూ....!" పెద్దగా నవ్వాడు. అతని నవ్వు వియర్‌లో దూకుతున్న నీళ్ళమోతతో కలిసిపోయింది.

అతను యాకమూరులో వుంటున్నాట. సామాన్లకోసం రేపొస్తామని చెప్పివాళ్ళు వెళ్ళి పోయారు. నేను మెల్లగా వెనుదిరిగి నడవ సాగాను.

* * *

అన్నట్టుగానే ఆమర్నాడు వాళ్ళిద్దరూ వచ్చి సామాన్లు తీసుకుపోయారు. నేనుకూడా సెలవలు గనుక మావూరు ఆమరునాడే వెళ్ళిపోయాను. మళ్ళా రెండునెలల్గ్గాని నేను వుయ్యూరు తిరిగి రాలేదు. అచ్చివాళ్ల క్షేమసమాచారాలు తెలుసుకో వాలని వున్నా వీలుచిక్కలేదు. వాళ్ళిల్లు యేక మూరులో ఎక్కడో తెలియదు. అంచేత రోజుల లాగే దొర్లి పోతున్నాయి.

ఆరోజు ఆదివారం. మాస్నేహితుడు ఆంజ నేయులు యేకమూరులో ప్రత్యేకంగా ఒకపోర్షను అద్దెకు తీసుకుని వుంటున్నాడు. వాళ్ళమ్మమ్మ అతనితోనే వుంటూ వంటచేసి పెడుతోంది. ఇప్ప టికి రెండుమూడు వారాలుగా వాళ్ళింటికి పోవా లను కోవటం, ఆసమయానికి మళ్ళా ఏదో పని పెట్టుకుని మానివేయటం జరుగుతోంది.

ఆరోజు తప్పనిసరిగా బయలు దేరా: సాయంత్రం ఐదుగంటలవుతుంది. ఏమేమోఆలోచిస్తూ నడుస్తున్నాను. ఆంజనేయులు సమయా నికి ఏదో డిటెక్టివ్ నవల దీక్షగా చదువుతూ ఇంటిదగ్గరే వున్నాడు. వాళ్ళమ్మమ్మ నన్నుచూచి 'బాగున్నావా'? అని పలకరించింది. ఇద్దరూ ఆ రాత్రి భోజనం చేసి వెళ్ళమని బలవంతంచేశారు. సరే లెమ్మని వుండిపోయాను.

ఆంజనేయులూ నేనూ కూర్చుని 'కబుర్లు చెప్పుకుంటూ భోంచేస్తున్నాము. మామ్మగారు వడ్డిస్తున్నారు. ఇంతలో ఎవరో బయటునుంచి "అమ్మగారూ"— అనిపిలిచారు. ఆగొంతునాకుచిర పరిచితమైనది. అంటే మరెవరో కాదు అచ్చి గొంతై వుండాలి. మామ్మగారు లేచివెళ్ళారు.

అంతవరకూ జరుగుతున్న కబుర్లు ఆగిపో యాయి. నిశ్శబ్దం ఆవరించింది. నాలోచనలన్నీ అచ్చి మీదికి మళ్ళాయి. మెల్లగా ముద్దలు మింగుతున్నాను.

మామ్మగారు తిరిగొచ్చారు. అచ్చి వెళ్ళిపోయి నట్టుంది. నామనస్సు చివుక్కుమంది. విషయ మేమిటో తెలుసుకోవాలని ఎంత కుతూహలంగా వున్నా నోరుతెరచలేదు. అనిశ్శబ్దాన్ని భగ్నం చేస్తూ ఆంజనేయులే విషయమంతా కదిపాడు.

"ఇప్పుడొచ్చింది అచ్చికదూ?"

"అవున్రా— దాని చెల్లెలికి కడుపుకదూ! నొప్పు లొస్తున్నాయంట. పురుడుపొయ్యాలని నన్ను సలహా అడిగేందుకొచ్చింది."

"అచ్చెవరు!" అన్నాన్నేను ఏమీ ఎరగనట్టు.

"ఏదో పూరని నెప్పింది నాయనా వాళ్ళాయన కిక్కడ పంచదార మిల్లులో వుద్యోగమంట.అప్పు డప్పుడు నేను ఏమన్నా కోసుకొస్తే కాస్త ఆపనీ ఈపనీ చేసి పెడుతుంది. అవతల మిల్లు ప్రక్కన గుడి సెల్లో వుంటున్నారు వాళ్లు. మనిషి నిజంగా దేవతలాంటిదినాయనా.." అంది మామ్మగారు. నేను విషయాన్ని అంతటితో వదలదలచలేదు. అందుకే మరోక సందేహం వెలిబుచ్చాను.

"అయితే వాళ్ళచెల్లి ఇక్కడెందు కుండటమే?"

"దాని మొగుడు పనిపోయినాడట. అందుకని



లచ్చి

లచ్చిమొగుడే దాన్ని కూడా పెళ్ళి చేసుకున్నాట్ట. మనిషేమీ బాగుండదు. మెల్లకన్ను. పై పెచ్చు లచ్చంటే దానికి తగని అసూయ. మొగుడు మిల్లునుంచి రాగానే దానిమీద బొల్లెడు చాడీలు చెబుతుంది. వాడుకూడా పట్నప్పుడైతే లచ్చినేమీ అనడుగాని కాస్త తాగొస్తే మాత్రం చావబాత్తాడు. తగిలేదెక్కడో తప్పేదెక్కడో కూడా చూడడు. రెండుమూడుసార్లు ఆబాధ పడలేక మాయింటి క్కూడా పారిపోయొచ్చింది. కాని మళ్ళా ప్రొద్దున్నే లేచి వెళ్ళక మానదు. పైగా వాళ్ళమామ చాలా మంచోడని వాదిస్తుంటది. చెల్లెలిక్కూడా విస్వాతనమని జాలిపడుతుంది. నాకు మాత్రం లచ్చిని చూస్తే హృదయం కరిగిపోతుంది. అంతమంచి పిల్లలసలు ఈరోజుల్లో మచ్చు క్కూడా కన్పించరు బాబూ—!"

మామ్మగారి మాటలు వింటే నాహృదయం బరువయింది. వాడివల్ల లచ్చికి కష్టమేగాని సుఖముండదని నేనేనాడో అనుకున్నాను. అదే నిజమైంది.

కాని లచ్చిలో ఇంతటి వుత్కృష్ట వ్యక్తిత్వం వుందని మాత్రం నేను కనుక్కోలేదు.. ప్రతిసారి నాఆలోచనలు తల్రక్రిందులు కావటంతో అసలు జీవితాన్ని గురించి నాకేమీ తెలియదేమోనని పించింది.

అంతటి యమయాతన అనుభవిస్తూ కూడ ఆభర్తతో సంతోషంగా ఎలా కాపురం చెయ్య గల్గుతోందో నాకర్థం కావటం లేదు. తన భర్త తీసుకొచ్చిన పరాయి స్త్రీని తన స్వంత చెల్లెలుగా చూసుకొని అందులోనూ ఆమె అసూయకు ప్రతిఫలంగా ప్రేమనెలా పంచిపెడుతోందో నాకెంత ఆలోచించినా అర్థం కావటం లేదు.

లచ్చి ఒక తక్కువ కులంలో పుట్టిన సామాన్య వనితైనడుచంటే నమ్మేదెలాగు?

ఆంజనేయులు దగ్గర మామ్మదగ్గరా సెలవు తీసుకొని బసకు బయలు దేరాను. లచ్చిని గురించిన ఆలోచనలే మెదడులో సుళ్ళు తిరుగుతున్నాయి. లచ్చి నవ్వుతూ మెరుస్తున్న కళ్ళు నాకళ్ళలో మెదులుతున్నాయి. 'అబ్బాయిగోరూ'అన్న ఆమె పిలుపు నాహృదయాన్ని జోకొడుతుంది. ఆరాత్రి పుస్తకం విప్పితే లచ్చి ప్రత్యక్షమైంది.మూసేసి పడుకున్నాను.

* * *

ఆరునెలలు కాలగర్భంలో కలసి పోయాయి. ఎన్నో పరిణామాలు జరిగాయి. లచ్చిజీవితంలో కూడా ఒకగొప్పమార్పువచ్చింది. కాని ఆమార్పు ఆమె హృదయంలో మాత్రం రాలేదు.

అది నాజీవితంలో మరచి పోలేని ఒక మహత్తర సంఘటన. మానవత్వం మీద నాకు తరగని విశ్వాసాన్ని ప్రసాదించిందా సంఘటన. ఆనాడే కాదు. ఈనాటికీ ఆమహాశక్తికి నేను మనసులోనే జోహారు లర్పిస్తుంటాను.

ఉదయం ఏడున్నర, ఎనిమిది గంటలవుతుంది. మాకు పరీక్షలు కావటాన ప్రిపరేషన్ శలవలిచ్చారు. రాత్రి చాలాసేపుచదివాను. అందుచేత లేచేటప్పటికి చాలా ప్రొద్దెక్కింది. హడావుడిగా ముఖం కడుక్కొని రూముకు తాళమేసి హొటలుకు బయలు దేరాను.

ఎదురుగా నాలుగడుగుల్లో లచ్చి వస్తోంది. ఆగిపొయ్యాను. లచ్చి దగ్గరకొచ్చి నిలబడింది.

మనిషి మరి కాస్త చిక్కినట్లుంది. ఇదివరకటి చిలిపితనం పోయి ముఖంలో గాంభీర్యంకొట్టవచ్చినట్లు కన్పిస్తోంది. మాట్లాడకుండా నిలబడింది. లచ్చి.

"ఏమి లచ్చీ—!" అన్నాను.

"ఎళ్ళిపోతున్నామండీ......."

"ఎందాకట?"

"పుట్టినూరే పోతుండాం........"

"మీమామ ఫ్యాక్టరీలో పని మానేశాడా?"

నిముషం సేపు లచ్చి మాట్లాడలేదు. విషయం అర్థం కాక ఆమె ముఖంలోకి చూచాన్నేను.

"మామ వెళ్ళిపోయాడండీ"

"ఎక్కడికి"? నాగొంతులో ఆతురత ధ్వనించింది.

"అదే తెలియదండీ. నాలుగు నెల్లయింది."

మరోసారి భార్యనొదిలి వెళ్ళిపోయాడన్నమాట లచ్చి మగడు. మరైతే ఈరెండు నెలలూ ఆమె ఇక్కడేం చేస్తున్నట్లు?

లచ్చి వెనుతిరిగి నడవ సాగింది. నేనుకూడా అడుగువేస్తున్నాను. ఎవరినోటంటా మాట రావటం లేదు. ఆమగన్నికట్టుకొని లచ్చి జీవితంలో అనుభవించిందేమీటో నాకెంత యోచించినా అర్థం కావటం లేదు. అయినా అతగాడంటే లచ్చికి పంచప్రాణాలూను. ఏజీవన మాధుర్యం ఆమెనలా కట్టి పడేస్తోందో అర్థం కాదు.

ఇద్దరమూ నడుస్తూ సిమెంటురోడ్డు కొచ్చాం.

"అబ్బాయిగోరూ .... బస్సు టేశను వరకూ రారూ?" అందిలచ్చి. నేను మారుపలక్కుండా నడుస్తూనే వున్నాను. కిళ్ళీషాపులో రేడియో గురగుర లాడుతోంది. టాంగా సాయిబు ప్రక్కకు తప్పుకోమని అరుస్తున్నాడు. మవునంగానే బస్సు స్టాండు చేరుకున్నాను.

లచ్చి ఒకస్త్రీ ఒడిలోంచి పిల్లాణ్ణి తీసుకొని నాదగ్గరకొచ్చింది. ఆపాప ముఖంనిండా స్ఫోటకపు మచ్చలున్నాయి. ఎవరని కళ్ళతోనే ప్రశ్నించాను.

"మామామ ఎళ్ళిపోయాడబ్బాయిగోరూ...ఎందు కెళ్ళాడో తెలియదు. పనిమీద మరో వూరెళ్ళుంటాడనుకున్నాను మొదట. కాని రెండు నెల్లయినా తిరిగి రాలేదు."

క్షణకాలమాగింది లచ్చి. ఆమె అమాయకమైన చూపుల్లో విషాద ఛాయలు గోచరించాయి. నేను మారు పలుక లేదు. తిరిగి ఆమె చెప్పుకొచ్చింది.


"మొదట్లో వీడికి అమ్మవారు చూపింది. వారంరోజుల్లో కాస్త తగ్గుముఖం పట్టింది. కాని వాళ్ళమ్మకు.......అంటే మామతో ఈవూరొచ్చినామెకు మసూచికం ఎక్కువగా కన్పించింది. ఆగుడిసెలో నానా నరక బాధలు అనుభవించాం. అప్పుడే మామ ఎటో వెళ్ళి పోయాడు. నెలరోజుల పాటు చెల్లెమ్మ పడ్డ యాతన నేను చెప్పలేనబ్బాయిగోరూ! చివరికాదేముడు ప్రాణముంచి రెండు కళ్ళూ తీసుకు పోయాడు. ఇప్పుడునా రెండుకళ్ళూ వీళ్ళిద్దరే నబ్బాయిగోరూ. నాకు మాత్రం ఇంకెవరున్నారు.? మామ ఏనాటికైనా రాకపోతాడా అన్న ఆశమాత్రం మిగిలిందబ్బాయిగోరూ........"

నాగొంతు మూగ బోయింది. కళ్ళల్లో వూరుతున్న అశ్రువుల్ని రుమాలుతో అద్దుకున్నాను.

"ఏమోనబ్బాయిగోరూ...! ఓపికున్నంత మట్టుకు దేవుడిచ్చిన రెక్కల్ని ముక్కలు చేసుకొని అయినా వీళ్ళను బ్రతికిస్తాను. వీళ్ళని నాచేతుల్లో ఎలావదిలి పోయాడో అలాగే మామచేతుల్లో పెట్ట గలిగితే అంతేచాలు......"

నామనస్సు మొద్దుబారింది. లచ్చి నాకెప్పటికయినా అర్థమవుతుందా? ఆవ్యక్తిత్వాన్ని మరెక్కడయినా చూడగనలనా?

"మమ్మల్ని మరువకండబ్బాయిగోరూ"అంటోంది లచ్చి కదులుతున్న బస్సులోంచి. దుమ్ము రేపుకుంటూ పోతున్న బస్సువైపే చూస్తూ నిలుచుండిపోయాను.



వారఫలం

27-1-1967 శుక్రవారం మొదలు
2-2-1967 గురువారం వరకు.

మేషం : వృత్తి వ్యాపారాల్లో మీ కార్యక్రమాలు నిరాటంకంగా నెరవేరతాయి. నూతన వ్యాపారాలు లాభదాయకంగా ఉంటాయి. అకారణంగా కొంత మంది మిత్రులతో మాట పట్టింపులు రావచ్చును. ఆర్థిక వ్యవహారాల్లో మొగమాటాలకు లొంగి పోవడం తగదు. రాజకీయ వ్యవహారాల్లో ప్రతి పక్షాల సంచలనం పెరుగుతుంది.

స్త్రీలకు:— ఆరోగ్యం బాగానే ఉంటుంది. ఆడంబరంకోసం వ్యయం చేస్తారు.

వృషభం : కొన్ని వ్యవహారాల్లో మీ మంచి తనమే మీకు యిబ్బందిని కలిగిస్తుంది. భారీ యెత్తునచేసే వ్యాపారాలు ప్రోత్సాహకరంగా ఉంటాయి. అధికారులవలన జరగవలసిన వ్యవహారాలు కొంచెం శ్రమమీద నెరవేరతాయి. ఉద్యోగంలో గౌరవం బాగా ఉంటుంది. సజ్జన సాంగత్యము లభిస్తుంది.

స్త్రీలకు:— కుటుంబ వ్యవహారాలు సామాన్యంగా ఉంటాయి. ప్రయాణాలోచనలు చేస్తారు.

మిథునం : మీకు యిష్టం లేకపోయినా, కొంత మంది మిత్రుల వ్యవహారాల్లో జోక్యం చేసికోవలసి వస్తుంది. సాహసముతో కూడిన వ్యవహారాలు కొంతవరకు లాభిస్తాయి. ప్రయాణాలు ప్రోత్సాహకరంగా ఉంటాయి. వృత్తిలో అనుకూలమైన మార్పులు వస్తాయి. మిత్రులకు సహాయం చేస్తారు.

స్త్రీలకు:— ఆరోగ్యం యిదివరకటికంటే బాగా ఉంటుంది. సాహిత్య కళారంగాల్లో ఖ్యాతి లభిస్తుంది.

కర్కాటకం : ఆదాయం మాట యెలాగవున్నా, అన్ని వ్యవహారాల్లోను గౌరవ ప్రాబల్యాలు బాగా ఉంటాయి. రావలసిన డబ్బు సమయానికి అందుతుంది. వ్యాపార విస్తరణ ప్రయత్నాలు బాగా ఉంటాయి. రాజకీయ వ్యవహారాల్లో నూతనోద్యమాలు అనుకూలంగా ఉంటాయి. సంతోషకరమైన వార్తలను వింటారు.

స్త్రీలకు:— కుటుంబ కార్యక్రమాలు సంతృప్తికరంగా ఉంటాయి. పుణ్యకార్యాలు చేస్తారు.

సింహం : ఇదివరకు యేవో కారణాలవలన ఆగి పోయిన వ్యవహారాలను యిప్పుడు పూర్తి చేయగలరు. ఆర్థిక వ్యవహారాలు సంతృప్తికరంగా ఉంటాయి. ఉద్యోగంలో అధికారుల ఆదరాభిమానాలను పొందగలరు. సాంఘిక వ్యవహారాల్లో మీ ప్రాముఖ్యత పెరుగుతుంది. ప్రయాణాలు ఫలిస్తాయి.

స్త్రీలకు:— ఆరోగ్యం సామాన్యంగా ఉంటుంది. బంధువుల వ్యవహారాల్లో చికాకులు వస్తాయి.

కన్య : వారం ప్రారంభంలోనే వృత్తి వ్యాపారాల్లో చికాకులు యేర్పడి తరువాత సర్దుకొంటాయి. మీ తాలూకు వస్తువులుపోయే ప్రమాదంవుంది. వృత్తిలో కొంతమంది వ్యక్తులు మిమ్మల్ని నమ్మించి మోసం చేయడానికి ప్రయత్నిస్తారు. వ్యాపారంలో నూతనావకాశాలు లభించగలవు.

స్త్రీలకు:— కుటుంబ కార్యక్రమాలు కొంచెం శ్రమ మీద నెరవేరతాయి. వినోద కాలక్షేపాల్లో పాల్గొంటారు.

తుల : కొన్ని వ్యవహారాలు సులువుగా నెరవేరినా, మరి కొన్నింటితో శ్రమ పొందవలసివస్తుంది. రావలసిన డబ్బు సమయానికి అందకపోవడం వలన యిబ్బంది కలుగుతుంది. వ్యాపారంలో కొత్తవారి పోటీని యెదుర్కోవలసి వస్తుంది. ప్రయాణాలు శ్రమ మీద ఫలిస్తాయి. సాటివారిలో గౌరవం బాగా ఉంటుంది.

స్త్రీలకు:— ఆరోగ్యం బాగా ఉంటుంది. శుభ కార్యాల విషయంలో అనుకూలత లభిస్తుంది.

వృశ్చికం : వృత్తి వ్యాపారాల్లో మీ ఆలోచనలకు తగిన అవకాశాలు లభించడం వలన ఆదాయము బాగా ఉంటుంది. సాహసముతో కూడిన వ్యవహారాలు కూడా లాభించగలవు. ఉద్యోగంలో అధికారుల ఆదరాభిమానాలను పొందగలరు. వారాంతంలో చికాకులు యేర్పడతాయి. అధిక వ్యయం జరుగుతుంది.

స్త్రీలకు:— కుటుంబ వ్యవహారాల్లో కార్యభారం పెరుగుతుంది. దైవకార్యాలు నెరవేరతాయి.

ధనస్సు : ఇదివరకు మీకు ఆందోళన కలిగించిన వ్యవహారాల్లో అనుకూలమైన మార్పులు వస్తాయి. సమయానికి యేదో ఒకవిధంగా డబ్బు చేతికి వస్తుంది. నూతన వ్యాపారాలు కొంచెం శ్రమ మీద ఫలిస్తాయి. ఉద్యోగంలో గౌరవం బాగా ఉంటుంది. సాహిత్య కళారంగాల్లో ఖ్యాతి లభిస్తుంది.

స్త్రీలకు:— ఆరోగ్యం సామాన్యంగా ఉంటుంది. సంతానానికి సౌఖ్య సంతోషాలు లభిస్తాయి.

మకరం : లాభం రావలసిన వ్యవహారాల్లోనే నష్టం వచ్చే పరిస్థితి యేర్పడుతుంది. ముఖ్యమైన వ్యవహారాల్లో భాగస్వాముల నిర్ణయానికి వదలివేయడం మంచిది. ప్రయాణాల్లో శ్రమ అధికంగా ఉంటుంది. ఉద్యోగంలో కార్యభారం పెరుగుతుంది. వారం మధ్యలో అనుకూలత లభించ గలదు.

స్త్రీలకు:— కుటుంబ వ్యవహారాల్లో అధిక వ్యయం జరుగుతుంది. బంధు మిత్రులను కలుసు కొంటారు.

కుంభం : ఏ వ్యవహారంలోను ఆరంభంలో కనిపించిన అనుకూలత ఆఖరువరకు నిలవదు. సమయానికి యేదో ఒకవిధంగా డబ్బు చేతికివస్తుంది. సాహసముతోకూడిన వ్యవహారాల్లో జోక్యం చేసికోవడం తగదు. వృత్తిలో ముఖ్యమైన వ్యక్తులను కలుసుకొంటారు. సాటివారితో మాట పట్టింపులు తగవు.

స్త్రీలకు:— ఆరోగ్యం బాగా ఉండక పోవచ్చును. వినోద కాలక్షేపాల్లో పాల్గొంటారు.

మీనం : కొంతమంది వ్యక్తులు మిమ్మల్ని నమ్మించి మోసం చేయడానికి ప్రయత్నిస్తారు. రావలసిన డబ్బుమీద ఆధారపడి యితరులకు వాగ్దానాలు చేయడం తగదు. ఉద్యోగంలో కార్యభారం పెరుగుతుంది. నూతన వ్యాపారాలు శ్రమ మీద ఫలించగలవు. సాహిత్య కళారంగాల్లో మీ కృషి రాణించగలదు.

స్త్రీలకు:— కుటుంబ కార్యక్రమాలు సామాన్యంగా ఉంటాయి. విలాస వస్తువులుకొంటారు.

—మహేష్

సుప్రభాతం

(సీరియల్)

రంగనాథ్

జరిగిన కథ

సత్యమూర్తి, ప్రకాశం చిన్ననాటి స్నేహితులు. చాలాకాలానికి అనుకోకుండా కలిశారు. సత్యమూర్తి ప్రకాశం షుగర్ ఫ్యాక్టరీలో అకౌంటెంటుగా చేరాడు. ఆ చుట్టుప్రక్కల ప్రకాశానికి ఎక్కువ పరపతి వున్నట్లు గ్రహించాడు సత్యమూర్తి. ప్రకాశం, దామోదరానికి సంబంధించిన జాడ తెలియని ఒక అమ్మాయికోసం వెదుకుతున్నాడు. ఆమెను వశపరచుకుంటే కావలసినంత ఆస్తి దక్కుతుంది. ఆ అమ్మాయి భానుమతి. దామోదరం భానుమతిని వంచించుకోడానికి ప్రయత్నిస్తున్నాడు.

13

సత్యమూర్తి తనగురించి తను తీవ్రంగా ఆలోచించుకొని, కొన్ని విషయాల్ని తెల్సుకున్నాడు. ఉమ తన మనసు వెల్లడి చేసినప్పుడు తానొక ఆదర్శ వంతమైన ప్రవర్తన గల పురుషుడిలా మాట్లాడాడు. కాని నిజంగా తను అంత పవిత్రమైన వ్యక్తి అని నమ్మకం లేదు. ఎందుకంటె మనసులో ఎలాంటి దుష్టభావాలూ లేనప్పుడే మనిషి పవిత్రుడవుతాడు కాని అనేకసార్లు అకస్మాత్తుగా తనమనస్సులో దుష్టభావాలు ఉదయించక పోలేదు. వాటికి కారణం బహుశా సంస్కారం కావచ్చు. మన చుట్టూవున్నది చెడు సంస్కారం అయినప్పుడు దాని ప్రభావం మన మీద ఎప్పుడో ఒకప్పుడు కన్పించి తీరుతుంది. అసలు ప్రకాశం అనాయాసంగా అందరికీ అన్యాయ మార్గంలో డబ్బు గణించడంతోపాటు, ఎప్పుడూ స్త్రీలతో అక్రమ సంబంధాలు నెరపుకోవడం మీద ధ్యాస. వాళ్ళు, వాళ్ల సంభాషణలనీ ఎంత తప్పించుకుందామన్నా వీలవ్వ తూండదు. అందువల్ల వాళ్ళ భావాలు తనలో ప్రవేశించి, ఎప్పుడో ఒక్కొక్క సారి ఒక అందమైన స్త్రీని చూసినప్పుడు మన స్సులో ఒక రకమైన వికారం కలుగు తూంటుంది. తనకు తెలియకుండానే తానొక విధమైన ఉద్రేకానికి కొన్ని క్షణాలలోనైనా మళ్లీ అతికష్టంమీద మనో నిగ్రహం పొందుతూంటాడు.

మనసు పవిత్రవంతం కావాలని అతడు కొన్ని వేదాంత గ్రంథాలతో బాటు రామకృష్ణ పరమ హంస, వివేకానందస్వామి బోధనలను చదువసాగాడు. గాంధిగారి జీవితం కూడా పఠించాడు. అవి చదువుతున్నంత సేపూ బాగానే వుంటుంది. కాని చదవడం పూర్తి కాగానే మళ్లీ యథాప్రకార స్థితికి వస్తుంది. దీనికి కారణ మేమిటా? అని అనేకసార్లు ఆలోచించాడు. మనసును జయించ డం అంతసులభంకాదు. కాని జీవితంలోఒక ఉత్కృష్ట మైన ఆదర్శం లక్ష్యంగా పెట్టుకుని దాన్ని సాధించ డానికి తనలోని సర్వశక్తులూ కేంద్రీకరింపజేసి నప్పుడు ఒక వ్యక్తి తన మనస్సును జయించ గలడు. అదే మహాపురుషుల జీవితంలో కనిపిస్తుంది. సామా న్యమానవుల జీవితంలో అది వ్యర్థమౌతుంది. అందువల్ల ప్రవాహంలో కొట్టుకు పోయినట్లు సామాజిక ఆలోచనల ప్రవాహాలకు లోనై పోతాడు సామాన్యుడు. జీవితానికి గొప్ప ఆశయమనేదొక్కటి వుండడం చాలా అవసరమని గ్రహించాడు సత్య మూర్తి. తను ఏ ఆశయాన్ని లక్ష్యంగా పెట్టుకో గలడు? మంచిగా బ్రతకాలి అనేది ఒక ప్రధాన వుద్దేశం. కాని ఆఉద్దేశంతో కొన్ని ఫలితాల్ని సాధిం చినప్పుడే అది ఒక ఆశయంగా రూపొందుతుంది.

ఆగ్రామ వాతావరణమంతా ఎంత కలుషితమై పోయిందో ఆలోచిస్తూంటే సత్యమూర్తికి కోపము విచారము ఒక్కసారి కలిగేవి. ధర్మం మీదా, న్యాయం మీదా మనుష్యులకు నమ్మకం పోయింది. ఆగ్రామంలో ధనవంతుడైన ప్రతివాడి చరిత్రచూస్తే వాడితో ఎంత మోసమూ, దగావెయ్యగల శక్తి వుంటే అంత ధనాన్ని సంపాదించగల్గాడని తెలుస్తుంది. మొట్ట మొదట, అమ్మే సరుకులలో కల్తీ చెయ్యడం తోనూ, సరుకుల్ని బ్లాకు మార్కెటు చెయ్యడంతోనే వ్యాపారం ప్రారంభమౌ తోంది. ఏపని జరగాలన్నా అధికారులకు లంచం ఇవ్వందే జరగదని అందరకూ తెలుసు. ధరలు పెరిగి పోతూండి జీవన విధానంతో ఖర్చులెక్కు వవడం వల్ల రాబడి చాలక ఉద్యోగస్థులు లంచాలు పుచ్చుకుంటున్నారు. అధికారులకు లంచాలిచ్చి, ప్రభుత్వానికి పన్నులు కట్టుగలిగి వ్యాపారంచెయ్య వలసి రావడం వల్ల వ్యాపారస్తుడు వస్తువులధర లను పెంచుతున్నాడు. ఇదంతా ఒక విషవలయం.

ఇటువంటి పరిస్థితులలో బాగుపడాలంటే కుతంత్రం తప్ప వేరే మార్గం లేదని పిస్తుంది. అందుకే ప్రకాశం ఆమార్గంలో చాలా సులభంగా పైకి వచ్చాడు. దామోదరం లాటి వ్యక్తులు పరి స్థితుల అవసరాన్ని బట్టి తమ విధానాల్ని సుల భంగా రూపొందించి ఎన్ని వక్రమార్గాలు వీలైతే అన్నిటి నవలంబించి విజయాన్ని సాధిస్తూం టారు. మంచితనం వాళ్లముందు ఓడిపోతుంది. మంచివాళ్ళు ఇటువంటి వారి ప్రయోజనాలకు బలై పోతూంటారు.

ఒక మూల ప్రత్యక్షానుభవం అవినీతికి ప్రోత్సా హమిస్తూంటే, వేరొక వంక తనలోని మంచితనం ధర్మాన్ని సూచిస్తూంటే, ఎలా ప్రవర్తించాలో కూడా తెలియక సంధిగ్ధావస్థతో పడుతూండేవాడు సత్యమూర్తి. అది అతనిలో అశాంతిని రేకెత్తిం చేది. మనశ్శాంతి కోసం సత్పురుషుల సాంగత్యం కావాలనుకునే వాడు. అతనికి కన్పించిన మంచివ్యక్తి అనంతరావుగారు మాత్రమే. ఆయన మనసు స్వచ్ఛ మైనది.

ఆఫీసుపనికూడా కలిసి రావడం వల్ల విశాఖపట్ట ణం బయల్దేరాడు సత్యమూర్తి. ఆఫీసులో కొంచెం పని వుండడంవల్ల మధ్యాహ్నం ఆఫీసుకు వెళ్లాడు. ఆరోజు ప్రకాశం గాని దామోదరంగాని వూళ్లో లేరు. వాళ్ళు లేకపోతే ఆఫీసులో పనికన్నా బాతా ఖానీయే ఎక్కువగా జరుగుతూంటుంది. అందు లోనూ ఆరోజు దామోదరం కొడుకు గోపాలన్ ఆఫీసులో కుర్చీమీద, కాళ్ళు బల్లమీదపెట్టి పైప్పుకాలుస్తూ హాయిగా విశ్రాంతి తీసుకుంటూ వెనక్కి చేరబడి, అర్ధనిమీలిత నేత్రాలతో ఎటో చూస్తూంటే మరోనలుగ్గురు అతనిచుట్టూచేరి, రాత్రిక్లబ్బులో జరిగిన పేకాట గురించి వర్ణించి చెప్తున్నారు.

సత్యమూర్తి తనపని చూసుకుని వెంటనే తిరిగి వచ్చేస్తూంటే గోపాలన్ సత్యమూర్తిని పిలిచాడు.

"మూర్తీ! ఎక్కడికి ప్రయాణం."

"విశాఖపట్నం వెళ్తున్నా"

"నాకోచిన్న పని చేసి పెడ్తావా?"

"ఏమిటది?"

"ఒక అడ్రసు ఇస్తాను. ఆ అడ్రసుకువెళ్ళి, వాళ్లెవరో, ఏంచేస్తున్నారో వివరాలన్నీ కావాలి, వాళ్ళతోటి మాట్లాడిరా."

"ఎందుకొచ్చావంటే. ఏం చెప్పను?"

"ఏదో చెప్పు. అన్నట్టు వాళ్ళకొక అమ్మాయుం టుంది. వీలైతే ఆ అమ్మాయి ఫోటో పట్టుకురా."

"అమ్మాయిది నడివయస్సా, పాకేవయస్సా?"

"కాలేజీలో గంతులేసే వయస్సులే. మీ అమ్మా యికి మంచిమొగుణ్ణి తీసుకొస్తానని చెప్పు"

"నువ్వేనా, ఆ మంచిమొగుడు?"

"కావచ్చు. కాకపోవచ్చు. నువ్వుమట్టుకు తప్ప కుండా వెళ్ళిరా." అని అడ్రసురాసిన చీటీఇచ్చాడు పక్కనవాళ్లంతా నవ్వుతూంటే. సత్యమూర్తి అది జేబులో పెట్టుకుని బయల్దేరాడు. గోపాలన్‌తో వాదించి లాభం లేదు. వాడు డోసుమీద వున్నాడని అనుమానం వేసింది. ఆఫీసులో వాణ్ణి ఎవరూ ఏమీ అనరు. వాడిష్టం వచ్చినప్పుడు ఆఫీసుకు వస్తాడు.

"గురూ, అయితే పెళ్లిచేసుకుంటావా?" అని ఒక స్నేహితుడడిగాడు తక్కిన వాళ్లంతా నవ్వు తూంటే." "అవునురా బ్రదర్" అన్నాడు సత్య మూర్తి బయటకు వచ్చేసాడు.

గోపాలన్ వాడి స్నేహితులూ నిరంతరం సుఖా న్వేషణలో గడుపుతూంటారు కాలం. వూళ్లో ఒక క్లబ్బుంది. అందులో ఇరవై నాలుగు గంటలూ పేకాట నడుస్తూనే వుంటుంది. అది గోపాలన్ అధ్వర్యం క్రిందనే నడుస్తోంది. త్రాగుడులో వాడు తండ్రిని మించిన కొడుకు. షుగర్ ఫాక్ట రీలో వాడికొక చిన్న ఆఫీసరు ఉద్యోగం వుంది. అది కేవలం నామ మాత్రమే. అతడు పనిచెయ్య డని అందరికీ తెలిసిన విషయమే. జీతాల రోజున మాత్రం వచ్చి జీతం పట్టికెళ్తూంటాడు. ప్రకా శానికి అవసరం వచ్చినపుడు గోపాలన్ ముఠా అంతా ప్రకాశం ఏం చెప్తే అదిచేస్తారు. తన కొడుకు భవిష్యత్తు గురించి దామోదరానికి బెంగగానే వుంది. అందువల్ల వాడినొక యింటివాడిని చేస్తే కొంత బాధ్యత నెత్తిమీదపడి కొంత జాగ్రత్తగా వుంటాడని ఆలోచించాడు. గోపాలన్ పెళ్లికిమాత్రం ససేమిరా ఒప్పుకోవటంలేదు. అందువల్ల భానుమతిని గోపాలన్‌కి వివాహం చెయ్యాలని సంకల్పించిన దగ్గ ర్నుండి, విశాఖపట్నం వెళ్ళి భానుమతిని చూడమని కొడుకును ప్రోత్సహిస్తున్నాడు. కాని అందులోని అంతరార్థం తెలియని గోపాలన్ శ్రద్ధ

చేస్తూ, సత్యమూర్తికి ఆ ఎడ్రసు ఇచ్చి వాళ్లను కలుసుకొని రమ్మన్నాడు. అంతటితో ఆ వ్యవహారం ముగుస్తుందనే వుద్దేశంతో.

విశాఖపట్టణం వచ్చి త్వరత్వరగా తన పనులు ముగించుకుని, సాయంకాలం ఆరు గంటలకల్లా అనంతరావుగారి యింటికి చేరుకున్నాడు సత్యమూర్తి. అతనాయింట్లో ప్రవేశించగానే హాలులో అనంతరావుగారూ, మరి యిద్దరు స్త్రీలూ కన్పించారు. అందులో ఒకతె ఉమ, మరొకామె భానుమతి. సత్యమూర్తి అంతవరకూ భానుమతి నెరుగడు. అతనిని చూడగానే అనంతరావుగారు ఆనందంతో, "రావోయ్! ఈ మధ్య నువ్వు రావటం లేదు." అన్నారు.

"పనుల వత్తిడివల్ల రాలేకపోయాను. కాని నాకెప్పుడూ ఇక్కడికి రావాలనే వుంటుంది." అన్నాడు సత్యమూర్తి అనంతరావుగారి ప్రక్కన కుర్చీలో కూర్చుంటూ.

ఉమ, "ఆవూరు వదిలిపెట్టి మళ్ళీ ఈవూరు వచ్చెయ్యకూడదూ. అక్కడ మీకేం తోస్తోంది?" అంది.

"బావుంది. నీలా నాకు పనిపాటూ లేదనుకుంటున్నావా తోచకపోవడానికి. అసలు తీరికే వుండటం లేదు."

"నీకు భానుమతి ఇంతకుముందు తెలియదనుకుంటాను." అని అనంతరావుగారు భానుమతివైపు చూపించారు. సత్యమూర్తి ఆమె వైపు చూడగానే ఆమె అతనికి నమస్కరించింది. సత్యమూర్తి ప్రతి నమస్కారం చేశాడు. ఇద్దరి కళ్ళూ కలియడంలోనే, ఇద్దరికీ ఏదో ఒక అనిర్వచనీయమైన ఆనందం కలిగింది. సత్యమూర్తి, ఆమె అందానికే కాక ఆమె ముఖంలోని నిర్మలత్వానికి ముగ్ధుడయ్యాడు. భానుమతి తానెరిగిన పురుషులందరికన్నా విభిన్న తత్వం కలిగిన వ్యక్తి యని అతనిని చూడగానే అనుకుంది. ఉమ అతని గురించి అప్పుడప్పుడు చెప్పిన మాటలు ఆమె మనసులో మెదిలాయి. అతనెవరో తనకు తెలియకుండానే అతనంటే కొంత మంచి అభిప్రాయం వుంది కాబట్టి, అతనిని చూడడం ఆమె కానందప్రదమైంది.

"మీరు చాలా అదృష్టవంతులు." అన్నాడు సత్యమూర్తి.

"ఎందువలన?" అంది భానుమతి.

"మా మాష్టారి అభిమానం సంపాదించారు. ఆయనకు ఎంతో నచ్చిన వ్యక్తులైతేనేగాని ఆయనకు సన్నిహితులు కాలేరు." అని సత్యమూర్తి అంటే భానుమతి చిరునవ్వుతో "అవును" అంది.

"మీలాంటి సత్స్వభావం గల యువతీయువకులంతా నా స్నేహితులుగా వున్నప్పుడే నాకు ఎంతో ఆనందకరంగా వుంటుంది. నేటికాలపు యువతీ యువకులలో ఎంతో ఉత్సాహం, ఆవేశం తొణికిసలాడుతూ వుంటాయి. కాని నూటికి తొంభై మందిలో అవి ప్రయోజన శూన్యాలైన విషయాలపై కేంద్రీకరింపబడుతుంటాయి. కాని కొద్దిమందిలో మాత్రం అవి ఒక సన్మార్గంలో ప్రవహించి కొన్ని మంచి పనులు సాధిస్తాయి. అటువంటి వారిని చూసినప్పుడల్లా నాకు చాలా ఆనందం కలుగుతుంది." అన్నారు అనంతరావుగారు.


"ఈమె మీ శిష్యురాలా?" అనడిగాడు సత్యమూర్తి.

"అంతభాగ్యం నాకు కాలేజీలో కలుగలేదు. నేను 'ఆర్ట్స్' విద్యార్థిని. కాని ఇప్పుడిప్పుడు 'సైన్సు' అంటే చాలా ఆసక్తి ఏర్పడుతోంది నాలో." అంది భానుమతి.

సత్యమూర్తి చిరునవ్వు నవ్వాడు. కొద్ది సెకనులు అంతా మౌనంగా వూరుకున్నారు. తరువాత, ఉమ, "మీ రామవరం గురించి కొన్ని విశేషాలు తెలుసుకోవాలని వుంది." అంది.

కలుసుకోవడం ప్రారంభించాడు. ఇందులోని అంతరార్థం మాకు బోధపడటంలేదు." అన్నారు అనంతరావుగారు. భానుమతి సత్యమూర్తివైపు చూసింది.

"భానుమతియందా!" అని ఆశ్చర్యం ప్రకటించాడు సత్యమూర్తి. అతనుకూడా కొద్ది క్షణాలు భానుమతి వైపు చూశాడు. ఆమె కళ్లలోని సౌందర్యం అతని హృదయం కదిల్చింది. 'ఎంత అందంగా వున్నాయి, ఆ కళ్ళు!' అనుకున్నాడు. వెంటనే దామోదరం గురించి గుర్తుకువచ్చింది. "అయితే జాగ్రత్తగా వుండాలిసిందే." అన్నాడు.



"అకస్మాత్తుగా రామవరం 'మ్యాప్' లోకి వచ్చిందేమిటి?"

"అబ్బే. మీకు దామోదరంగారు బాగా తెలుసుననుకుంటాను. ఆయనతో మాకీ మధ్య పరిచయం ఏర్పడింది." అంది ఉమ.

"బాగానే వుంది. అతని పరిచయం మంచిదే కాని ఎలా ఏర్పడింది? అతను మీవద్దకు వచ్చాడా? ఎక్కడైనా కలిసాడా?"

"మాదగ్గరకే వచ్చాడు." అంది ఉమ.

"దామోదరానికి అకస్మాత్తుగా భానుమతియందు ఆసక్తి కలిగింది. వచ్చి ఆమెను తరుచూ

"ఎందుకు?" అంది భానుమతి.

"తనకు ఒకపనివల్ల ఎంతో ప్రయోజనం వుంటేనేకాని అతనాపనిని తలపెట్టడు. అతని ప్రయోజనం సాధారణంగా ఇతరుల కపకారంగా పరిణమిస్తుంది."

"ఆయనకూ మా నాన్నగారికీ పరిచయంవుందిట. అందువలన నన్ను కలుసుకుంటున్నారు." అంది భానుమతి.

"అయితే ఫరవాలేదు. దామోదరం ఒకప్పుడు స్నేహితులకోసం ప్రాణమైనా ఇచ్చేవాడని విన్నాను." అన్నాడు సత్యమూర్తి, కొద్దిగా బరువు తగ్గిన మనసుతో.

సుప్రభాతం

అనంతరావుగారు, ప్రకాశం, దామోదరం ప్రభావానికి బాగా లొంగిపోయాడని విన్నాను. వీళ్ల గురించి అనేక రకాలుగా చెప్తూంటారు జనం. ప్రకాశం గురించి మంచిగానే వింటూంటాను గాని, దామోదరం ప్రమాదకరమైన వ్యక్తి అని అందరూ అంటారు." అన్నారు.

"అందులో అసత్యమేమీ లేదు. ప్రకాశం స్వతహాగా మంచివాడే. కొన్ని పరిస్థితులలో దామోదరం ప్రభావానికి లోనయ్యాడు. దానివలన ప్రకాశం బాహాటంగా అభివృద్ధిలోనికి వచ్చినమాట వాస్తవమే. కాని నాకుమట్టుకు వాళ్లపనులు నచ్చవు" అన్నాడు సత్యమూర్తి.

"ఏంపనులు?" అని అడిగింది ఉమ.

"ఏమీలేదు పర్మిట్లమీద డబ్బు సంపాదించడం, సరుకులను బ్లాకు మార్కెట్టులో అమ్మడం, చుట్టుపట్ల గ్రామాలతో రాజకీయాలను రెచ్చగొట్టి తమ అమాయాయులకు పదవులు లభింపజేసుకోవడం, ఒకటేమిటి ఎన్ని వక్రమార్గాలలో డబ్బూ, పలుకుబడీ, అధికారం సంపాదించాలో అన్ని వక్రమార్గాలనూ అనుసరిస్తారు. ఇహ వాళ్లకు నియమాలనేవి లేవు. త్రాగుడూ, వ్యభిచారం చాలా సామాన్య విషయాలు. పెద్ద హోదాలోవున్న అధికారులూ, ఎంతోమంది నాయకులూ, వీటిద్వారానే వీరికి పరిచయస్థు లయ్యారు. వారి ద్వారా ఎన్నో తమ ప్రయోజనాల్ని సాధించుకుంటూంటారు."

"అయితే ఇవన్నీ చూస్తూన్న ప్రజలు, వీటిని సహిస్తూంటారా?" అంది భానుమతి కొంచెం ఆవేశంతో.

"అమాయకులైన ప్రజ లేంచేస్తారు? ప్రకాశం డబ్బుగలవాడూ, పలుకుబడి గలవాడూ. ఆ వూరిలో అతన్నెదిరించి ఎవ్వరూ సరిగా బ్రతకలేదు. అందువలన, మనసులో అతను చేస్తూన్న పనులను అసహ్యించుకుంటూనే, పైకిమాత్రం, ప్రకాశం అంటే ఎంతో వినయవిధేయతలతో మెసులుతూ వుంటారు."

అనంతరావుగారు, "అవును ప్రతి వ్యక్తికి కొన్ని స్వప్రయోజనాలు వుంటూ వుంటాయి. అందువలన అధికారంలో వున్నవారితో విరోధం తెచ్చుకోవడం అంత మంచిదికాదు. అందులో పల్లెటూళ్లలో మరీ జాగ్రత్తగా వుండాలి." అన్నారు.

"పల్లెటూళ్లలో నిష్కల్మషత్వం, అమాయకత్వం వుంటాయనుకున్నాను కాని ఇలాటి వాతావరణం ఉంటుందనుకోలేదు." అంది భానుమతి ఆలోచిస్తూ.

"పల్లెటూరి ప్రజలు అమాయకులే, కాని వాళ్ళూ క్రమంగా మేలుకుంటున్నారు. తాము శ్రమపడి ఆర్జిస్తున్న దానికన్నా, ఈ రాజకీయనాయకులు సునాయాసంగా ఎక్కువ ఆర్జిస్తున్నారని గ్రహిస్తున్నారు. నీతి నిజాయితీలకు విలువపోతోందనీ, అధికారంలోవున్న వాడబద్ధమాడినా నిలుస్తుందనీ తెలుసుకుంటున్నారు. క్రమంగా వాళ్ళకే మంచితనం మీద నమ్మకంపోతోంది." అన్నాడు సత్యమూర్తి.

"ప్రజలంతా ఒక్కుమ్మడిగా ఈ దుర్మార్గాలను ఎదురించే రోజురాదంటారా?" అంది భానుమతి.

"ప్రజలలో ఐకమత్యం ఏకీభావం లేనప్పుడు అది ఎలా సాధ్యమవుతుంది?" అని ఉమ తన అభిప్రాయం తెలిపింది.

"అంతేకాకుండా కొన్నివందల ఏండ్లుగా మన దేశంలో మంచితనం, చేతగానితనంగా పరిణమించింది. త్యాగం, ఒక బలహీనత అయిపోయింది. స్వార్థం అంటే ఇతరులను దగా చేసి సంపాదించుకొన్నదే నన్న అర్థంతో రూపొందింది. జీవితంలో విలువలన్నీ తారుమారయ్యాయి. గాంధీగారి అహింసా విధానం సమగ్రస్వరూపాన్ని అర్థం చేసుకోవడానికి ఏ ఒక్కరూ ప్రయత్నించలేదు. మనిషి నైతికంగా పతనం కాకుండా డబ్బు సంపాదించలేడనే దురభిప్రాయం పాతుకుపోయింది. పైగా డబ్బును సరిగా వినియోగించడం చాలామందికి చాతకావటంలేదు. ఒకరైతు ఈ ఏడాది పంట బాగా పండి, మరో రెండువేలు చేతికి వచ్చాయంటే ఆ డబ్బుతో బంగారము కొనడమో, లేక సాంసారిక ఖర్చులు చెయ్యడమో చేస్తాడు గాని, ఆ డబ్బునే పొలంమీద వినియోగించి దాని అభివృద్ధికి తోడ్పడాలని చూడడు. శ్రమతోనూ కృషితోనూ ఫలితాల్ని సాధించటానికి ఇష్టపడరు. అదేకారణంగా తమ కళ్లఎదుట ఇతరులు అవినీతి కార్యాలు చేస్తూంటే వాటిని ఖండించడానికి పూనుకోరు. ఎందువల్లనంటే దాని నెలా ఖండించాలో, మరొక మంచి మార్గమేదో వారికే తెలియదు. ఉద్యోగస్తులకు లంచం ఇవ్వందే పనులు జరుగవని అంటారు. కాని 'ఈ అధిక ధరలలో లంచం పుచ్చుకోనిదే నేనెలా బ్రతకడం?' అని ప్రశ్నిస్తే— అవును పాపం! అనెయ్యడంకన్నా వేరే ఆలోచించడం ఇంకా ప్రజలకు తెలియదు. అందుకే దుర్మార్గాల నెదుర్కోవడాని కింకా తగిన శక్తి వారిలో రాలేదు." అన్నారు అనంతరావుగారు.

"ప్రజలలో కొందరు అమాయకులు వున్నారంటే ఒప్పుకుంటాను. వాళ్లకీ పరిస్థితిని ఎలా ఎదుర్కోవాలో తెలియదంటే కూడా ఒప్పుకుంటాను. కాని అందరూ అటువంటివారే అంటే ఒప్పుకోను. ఈ పరిస్థితిని ఎలా ఎదుర్కోవాలో తెలిసిన వారున్నారు. కాని వారు కావాలనే వూరుకుంటున్నారని నా అనుమానం." అంది భానుమతి.

"నిజాన్ని చెప్పేవు. నీవన్నది ఎవరూ కాదనలేరు." అన్నారు వెంటనే అనంతరావుగారు. ఉమా, సత్యమూర్తీ, "అవును" అన్నారు.

"అంటే కొందరు తటస్థంగా వుండడంవలనే, తెలిసికూడా తెలిసిన విషయాలు పైకి చెప్పక పోవడంవలన పరిస్థితులు ఇలా దిగజారిపోయాయని నా అభిప్రాయం." అంది భానుమతి ఆవేశంతో.

"వారికా విషయాలు తెలియవచ్చును గాని, పైకి చెప్పగల ధైర్యం వుండొద్దా?" అన్నాడు సత్యమూర్తి, ఆలోచిస్తూ.

అనంతరావుగారు భానుమతిని చిరునవ్వుతో పరిశీలిస్తున్నారు. ఆమెవి సరియైన ఆలోచనలు. ఒక్కొక్కప్పుడు ఆమె వేసే ప్రశ్నలకు సమాధానం చెప్పడం కష్టం. ఆమెలా ఆలోచించగలవాళ్లు ప్రజానికానికి నాయకత్వం వహించగలరు. సత్యమూర్తి అన్న మాటలకు ఆయనకు అతనిపై జాలి కలిగింది. అతను తన మన స్థితినే ఆ మాటలలో వ్యక్తం చేస్తున్నాడు. సత్యమూర్తి చాలా వివేకవంతుడు. కాని అతనిలో కొంత పిరికితనం వున్న మాట వాస్తవమే.

అతనన్న మాటలు మరొకరెవరైనా అనివుంటే భానుమతి చాలా పౌరుషంగా మాట్లాడి వుండేది. కాని సత్యమూర్తిని చూసిన దగ్గర్నుండీ ఆమెలో ఏదో ఒక ఆకర్షణ కలిగింది అతనంటే. అందువలన అతనన్నమాటల గురించి కొద్ది నిముషాలు ఆలోచించింది.

"అంత తెలివైన వాళ్లకు తాము నమ్మిన దానిని పైకి చెప్పడానికిగల ధైర్యం వుండదంటారా?" అని అడిగింది.

"అన్ని గుణాలూ ఒక్కచోటే వుండవు." అన్నాడు సత్యమూర్తి గంభీరంగా. అతనన్న మాటలలో చాలా అర్థాలు స్ఫురించాయి. క్రియకూ, మాటలు చెప్పడానికీ ఎంతో తేడావుంది అన్న అర్థం వుంది. అంతేకాక అతనన్న విధానంలో, 'దీనిని గురించి వాదించి లాభంలేదు' అన్న అర్థం స్ఫురించింది.

అందరూ కొద్ది నిముషాలు మౌనంగా ఆలోచించారు. ఎవరికీ అంతకన్నా ఏం మాట్లాడాలో తోచలేదు. భానుమతికి హఠాత్తుగా ఒక విషయం స్ఫురించింది. తను ఇంతవరకూ కబుర్లు చెప్పడమే కాని ఒక్క విషయంలోనైనా క్రియను సాధించిందా? కాలేజీలో అమ్మాయిల్ని ఏడ్పించే ప్రబుద్ధులు కొందరున్నారు. కనీసం తను వారి ఆటలనైనా అరికట్టగలిగిందా? వాళ్ల దృష్టిలో తను ఒక్కర్తీ పడకుండా తప్పించుకుంది. అంతేకాని వాళ్ళు తక్కిన అమ్మాయిల్ని ఏడిపిస్తూంటే ఏమి చెయ్యగలిగింది? ఏమీ చెయ్యలేదు. అటువంటిడబ్బూ, పలుకుబడీ, అధికారం కలిగిన ప్రకాశంలాంటి వ్యక్తుల నెదురించడం సామాన్యమా! "మీరు చెప్పింది నిజం." అంది భానుమతి.

ఉమకు ఆశ్చర్యం కలిగించిన విషయ మేమిటంటే భానుమతి ఆలా తను ఎదుటివారితో ఏనాడూ ఏకీభవించనిది, ఇవాళ అతి సులభంగా సత్యమూర్తి మాటల్ని ఒప్పుకోవడానికి ఎలా సిద్ధమైందా? అని. ఆటే మరొకరితోనైతే గంటలకొద్దీ వాదించి, వాదనలో వాళ్లను చిత్తుచేసేదాకా వదిలేదికాదు. సత్యమూర్తిలోని ఆకర్షణ ఏదో భానుమతిపై పనిచేసి వుంటుందా? అనుకొంది.

తను చెప్పినదానితో సంతృప్తిచెందకపోయినా, ఏవో మరికొన్ని విషయాల్ని ఆలోచించి, ఆ మాట భానుమతి అందని సత్యమూర్తి గ్రహించాడు. అతనిని ఆమె ఆలోచనలు బాగా ఆకర్షించాయి. సాధారణంగా ఆ యీడు అమ్మాయిలలో అంత విశాలమైన భావాలుంటాయని అతనెప్పుడూ వూహించలేదు. భానుమతి ఒక విశిష్టమైన స్త్రీ అనుకున్నాడు.

అప్పటికే కాలాతీతమవడంవలన, ఇంటికి వెళ్తానని భానుమతి లేచింది. సత్యమూర్తి తనుకూడా


ఇంట్లో ఉతికినది
సర్ఫ్‌తో
ఉతికినది
Surf
AMAZING BLUE POWDER
FOR THE WHITEST WASH!

ఆంధ్రసచిత్రవారపత్రిక

నవలల పోటీ!

మొదటి బహుమతి రు.3,500

రెండవ బహుమతి రు.1,500

మూడవ బహుమతి రు.1,000

ఆంధ్రసచిత్ర వారపత్రిక పాఠకులకి మరింత మంచి సీరియల్ నవలలని అందచెయ్యాలనే ఉద్దేశంతో పై పోటీని నిర్వహిస్తున్నాము. రచయిత(త్రు)లందరూ ఎప్పటివలె మాతో సహకరించి పై పోటీ జయప్రదం చెయ్యగలరని ఆశిస్తున్నాము.

ముగింపు తేదీ: 31-1-1967

రచయితల కోరికపై గడువుతేదీ పొడిగిస్తున్నాము

నిబంధనలు

1. పోటీకి స్వంతరచనలే పంపాలి. పంపే రచనలు తమ స్వంతమయినవేననీ, అనువాదాలుకాని, అనుసరణలుకాని కాదని రచయిత(త్రు)లు వ్రాతప్రతితో బాటు హామీ పత్రాలు పంపాలి.

2. రచనలు కాగితానికి ఒకవైపునే, సిరాతో రాసిఉండాలి. 100అరఠావు (ఎక్స్రర్సయిజు పుస్తకం పేజికి రెండురెట్లు) పేజీలు లోపు,300 అరఠావు పేజీలు మించి ఉండరాదు.

3. నవలలు తెలుగువారి జీవితానికి సంబంధించి ఉండాలి.

4. వ్రాతప్రతులు 31—1—1967 లోపల మా కార్యాలయం చేరాలి.

5. వ్రాతప్రతులు, 'సంపాదకుడు ఆంధ్రసచిత్ర వారపత్రిక, తంబుచెట్టివీధి, మద్రాసు—1' కి పంపాలి.

6. కవరుమీద, వ్రాతప్రతిమీద 'నవలల పోటీ— 1966' అని స్పష్టంగా రాయాలి.

7. పోటీలో నెగ్గని నవలలు ఆంధ్రసచిత్ర వారపత్రికలో ప్రచురించే హక్కు మాకు ఉంది.

8. పోటీలో నెగ్గని, ప్రచురణకి స్వీకరింపబడని నవల వ్రాతప్రతులని వీలయినంత త్వరలో, సురక్షితంగా రచయిత(త్రు)లకి తిప్పివంపే ప్రయత్నాలు చేస్తాము కాని ఈ విషయంలో ఎటువంటి బాధ్యతని వహించలేము, హామీ ఇవ్వలేము. వ్రాతప్రతులతోబాటు తగుమాత్రం తపాలాబిళ్లలు అతికించిన, స్వంత చిరునామా కల కవర్లు జతపరచటం అనవసరం.

9. పోటీలో తుదినిర్ణయం సంపాదకునిదే. ఈవిషయములో ఎటువంటి ఉత్తరప్రత్యుత్తరాలూ జరుపబడవు.

10. ఆంధ్రసచిత్ర వారపత్రికలో ప్రచురణ పూర్తిఅయిన తర్వాత పుస్తకరూపంలో నవలని వెలువరించగోరేవారు పుస్తకంలో ప్రముఖంగా 'ఆంధ్రసచిత్ర వారపత్రికనుంచి పునర్ముద్రితం' అని పేర్కొనాలి.

సుప్రభాతం

వెళ్తానని లేచాడు. అనంతరావు గారతనిని మరదాకా ఉంటాడో, వెళ్ళిపోతాడోనని అడిగ అతడు, మర్నాడు ప్రొద్దున్నే వెళ్ళిపోతానన్నా భానుమతిని కొంతదూరంవరకూ దిగబెట్ట ఆయన కోరారతనిని.

ఒక పావుగంటసేపూ ఇద్దరూ కలిసి నడుస్తు ఇద్దరి మధ్యా ఎక్కువ సంభాషణ నడవలేదు. (యిల్లెక్కడో ఆమె నడిగాడు. లలితానగరంవర ఆమెను దిగబెట్టాక, ఆమె, అతను మరి రానక లేదనీ, తను ఒక్కర్తెనూ వెళ్లిపోగలనని చెప్పి ఇద్దరూ విడిపోయారు.

మర్నాడు ప్రొద్దున్న తన ఆఫీసుపని చూసు రామవరం వెళ్ళిపోదా మనుకున్నాడు. కాని గోపా ఇచ్చిన అడ్రసు సంగతి గుర్తుకువచ్చి అసలు వా ఎవరో తెలుసుకుందామని కుతూహలంతో బ ల్దేరాడు సత్యమూర్తి. ఇతరుల విషయంలో జో కలుగ జేసుకోవడం మంచిది కాదనే వుద్దేశం వాడైనా, గోపాలన్‌కు పిల్లనిచ్చే నిర్భాగ్యులెవర వారి స్థితిగతులేమిటా? అనుకుంటూ వెళ్లా

అడ్రసు ప్రకారం తొందరగానే ఇల్లు కనుక న్నాడు. ఆయనపేరు చెప్తేచాలు ఆ ప్రాంతం సులభంగా ఇల్లు తెలుసుకోవచ్చు. స్వామిగారియి అందరికీ తెలుసు. పూరిపాకే అయినా అందుల ప్రశాంతత ఏ రాజభవనంలోనూ వుండదని చూ గానే గ్రహించాడు సత్యమూర్తి. ఆ యింటిలో పరిశుభ్రతా చుట్టూవున్న పూలతోటలోని అంద నిర్మలంగా ప్రవహించే ఏ పవిత్ర నదినో జ్ఞప్తి తెచ్చాయి.

"కూర్మనాథస్వామి గారున్నారా?" అని గుమ్మ దగ్గర నుల్చునే అడిగాడు సత్యమూర్తి. ఆయ వచ్చారు.

"నేనే కూర్మనాథస్వామిని. రండి లోపలికి. అని తీసుకువెళ్లి ఒక కుర్చీమీద కూర్చోపెట్టా డాయన సత్యమూర్తిని ఎదురుగా కన్పిస్తున్న పూజాగృహం, అందులోని దేవుళ్ల విగ్రహాల్ని చూస్తుంటే మనసులో ఏదో ప్రశాంతత నను వించాడు ఒకసారి పాకనంతా పరకాయించిచూశాడు

"నాపేరు సత్యమూర్తి. నా మిత్రుడు గోపాలన్ మీకు తెలుసనుకుంటాను. రామవరం." అని ఆయు వైపు చూశాడు.


"రామవరం తెలుసుగాని గోపాలన్ గారెవరో నాక తెలియదు. వారికి నాతో ఏదైనా పనుందా?'

సత్యమూర్తి తెల్లబోయాడు. గోపాలన్ గురించి పిల్లకు తెలియదన్నమాట. బహుశా దామోదరం తెలుసేమో. "పోనీ మీకు దామోదరం తెలుసను కుంటాను." అన్నాడు.

"తెలియదు." అన్నారాయన.

ఈసారి మరీ ఆశ్చర్యం వేసింది సత్యమూర్తికి. ఇక ఏం మాట్లాడాలో తోచలేదు అతనికి. వెంటనే సెలవు తీసుకుంటే మంచిదనుకున్నాడు. కాని అదే సమయంలో "నాన్నగారూ." అంటూ లోప ల్నుంచి భానుమతి వచ్చింది.

(సశేషం)



రెయిన్ కోటు

నోరి సుబ్రహ్మణ్యశాస్త్రి

ఆగకుండా కుండపోత పోసినట్లు జోరున వర్షం పడుతోంది. ఈ సంవత్సరం వర్షాలు తక్కువగా ఉన్నయ్యనుకుంటున్న వాళ్ళు ఈ వానను చూసి ఇది వరకు కురవని దానికి బదులుగా ఇప్పుడు తీరుస్తున్నదా అనుకుంటారు.

సరిగ్గా నిన్న సాయంత్రం అయిదు గంటలకు మొదలు పెట్టిందేమో, ఇవాళ మధ్యాహ్నానికి కూడా తగ్గలేదు. జనమంతా ఈ వానవల్ల తమ పనులు పాడైపోయాయని విసుక్కుంటున్నారు. అయినా అటువంటివి ఎవరు పట్టించుకుంటారు. ఎందరు ఎన్నివిధాల విసుక్కుంటున్నా దానికి కాకాపట్టిన వాళ్ళూ లేకపోలేదు. దానిని కోరుకుంటున్న వాళ్ళూ ఉన్నారు. విద్యార్థుల కెంతో సంబరంగా ఉంది. ఉపాధ్యాయులకు కూడా సంబరమేకాని, ఆ హెడ్ మాస్టరు స్కూలుకు వెళ్ళిన తర్వాత కాని శలవు ప్రకటించడు. అయినా తప్పకుండా శలవు వస్తుంది కదా అని వాళ్ళకు ఒక తృప్తి.

వర్షం వస్తే సంతోషించే వాళ్ళలో ఇంకో తెగ కూడా ఉన్నారు. ఆ కోవకు చెందినవాడే రావు.

అయితే ఈ వాన మొదలు పెట్టింది ఆదివారం కావడంతోటే అతడు నిస్పృహ చెందాడు. అది రేపటి వరకు ఉంటుందో ఉండదో అని అతని సందేహం. ఈ విషయమే అతడు భార్యతో ముచ్చటిస్తున్నాడు.

"ఏమే ఈ వర్షం రేపటి వరకు ఉంటుం టవా?"

"అబ్బ! ఇంత చిరాకు కల్గిస్తుంటే, ఇది రేపటి వరకు కూడా ఉండాలంటారా" అన్నది అతని భార్య చిరాకుగా.

"అదేమిటే అలా అం రావు. చిన్నప్పుడు చదువు కోలా, 'వానాలు కురియాలి వానదేవుడా, వరిచేలు పండాలి వానదేవుడా' అని."

"సరి. అంతవరకు చదివితే నాకీ ఉద్యోగం దేనికి?"

చదువు సంగతి వచ్చినప్పుడల్లా ఇలా అనడం ఆమెకు పరిపాటి అయిపోయింది. రావు కూడా విన టానికి అలవాటు పడ్డాడు.

"ఇప్పుడు ఆ విషయం దేనికీ.ఇంతకూ ఈవాన.."

"మీరు టీచరైనా బాగుండేది. వర్షం బాగా వస్తే స్కూలు ఉండదు అనుకునేందుకు. వర్షం వస్తే ఆఫీసుకు శలవు ఇవ్వరుగా. వెళ్ళకపోతే శలవు పెట్టాలి. అందులోనూ 'ఎమర్జెన్సీ' రోజులాయె అది మంజూరు కావాలి. అప్పుడుకాని, అయ్యగారు.."

"మొదలు పెట్టావూ."

"మరి మీరు మొదలు పెట్టింది ఆపాలంటే నేను కూడా మొదలు పెట్టాలి."

"ఇంతకూ నేను అనేది.." అంటూ రావు మాటలు నాన్చాడు.

అతని భార్యకు అర్థమయింది. ఒక్కసారి, ఫక్కున నవ్వింది. రావుకు కోపం వచ్చింది.

అసలింతకూ జరిగింది ఇది. రావు ఒక రెయిన్ కోటు ముచ్చటపడి కొన్నాడు. అది ఎంత మహాత్యం కలదో కాని ఇప్పటివరకూ దాన్ని పూజ చేస్తున్నాడు. పాపం ఏ ముహూర్తాన కొన్నాడో కాని దాని అవసరం ఇప్పటివరకూ కలగలా. దానిని వేసుకు వెళ్ళాలని అతనికి సరదా. అతడు కొన్నప్పటి నుంచి ఇప్పటి వరకూ వర్షం పడలా. అప్పటికే ఒకరోజు మబ్బుగా ఉంటే దానిని బయటకు తీశాడు. అదేం ఖర్మమో కాని ఇంటినుంచి ఆఫీసుకు వెళ్ళే లోపలే ఫెళ్ళుమని ఎండ వచ్చేసింది. రావు ప్రాణం పాపం ఉసూరు మంది. ఆ వేళ ఆఫీసులో కొందరు మిత్రులు పరా మర్శించారు కూడా. "ఏమిటోయ్, రావూ ఈరోజు అదోలా ఉన్నా"వని. దగ్గరి మిత్రులు కొందరు ఎగతాళి కూడా పట్టించారు. "ఇంత ఎండ కాసి ఉక్క పోస్తుంటే అది చాలక అన్నట్లు అంత లావు 'రెయిన్ కోటు' కూడా తీసుకువచ్చావు" అని.

రావు వాళ్ళకు ఏమని సమాధానం చెప్పగలడు. అది కాదయ్యా, ప్రొద్దున మబ్బుగా ఉంటే వర్షం వస్తుందేమోనని తెచ్చానని చెబుదా మనుకున్నాడు. అది ఇప్పటి పరిస్థితిచూస్తే అంత సబబుగా తోచలా. వర్షం వస్తే తెలిసేది, వీళ్ళకు, హుఁ—అని అను కున్నాడు.

ఆ రెయిన్‌కోటును వాడాలని అతడు ఎంతో ఉబలాట పడుతున్నాడు. అందుకే భార్యతో అలా అన్నాడు.

"మరీ పసిపిల్లల్లాగా అవేం కోరికలండీ" అని నవ్వేసింది అతని భార్య.

రావు కూడా నవ్వేశాడు. రేపటిని గురించి ఆలో చిస్తూ రావు ఆరోజును మరిచాడు.

*　　　*　　　*

రావు కోరుకున్నట్లుగానే తెల్లవారింది. వాన తోటే ప్రారంభమయింది ఆరోజు. రావుకు బ్రహ్మా నందమయింది. అతడు ఎంతో ఉత్సాహంగా పనులన్నీ ముగించుకొని భోజనం వడ్డించమని భార్యను తొందర పెట్టడం మొదలు పెట్టాడు

"అబ్బ, అంత తొందర పెడితే ఎలాగండీ"

"అవతల టైమవుతుంది ఆఫీసుకు."

"ఈ వెధవ వర్షం వలన ఇంకా కాలేదివాళ్ళ

[illegible] ఇంకా [illegible] కాలేదు కదా. రోజూ నేను తప్పించి వదిలిపెట్టి పడితే కానీ వచ్చేవారు కాదు."

"త్వరగా కానీ."

"భయపడకండి. ఈ వర్షం ఇప్పుడిప్పుడే వెలిసేటు లేదండి. ప్రొద్దున్నే వచ్చిన వానా, ప్రొద్దుగూకి తెచ్చిన చుట్టం పోరట. ఆ రోజంతా ఉంటారట."

"ఈ కబుర్లకేంగాని, ఇంతకీ ఇవాళ నన్ను ఆఫీసుకు పంపించదలుచుకున్నావా లేదా?"

"అయిపోయింది ఇదిగో ఒక్క నిముషం."

భోజనం పూర్తిచేశాడు రావు. దుస్తులు వేసుకున్నాడు. పెట్టెతీసి అందులో ఉన్న రెయిన్‌కోటు తీసి మడతలను ఎంతో పదిలంగా విప్పాడు. జాగ్రత్తగా తొడుక్కున్నాడు. టోపీకూడా పెట్టుకున్నాడు. నిలువుటద్దం ముందు నిలుచుని తన ప్రతిబింబాన్ని తనివితీరా చూసుకున్నాడు. "ఎలా ఉందే" అని భార్యను అడిగాడు.

ఆమె ఒకసారి ఆపాదమస్తకమూ పరీక్షించి చూసింది. "ఆ కోటు క్రింద పాంటు కనబడుతోంది. అది తడిసిపోతుంది. పైకి మడుచుకోండి" అన్నది.

"ఛీ, ఛీ అలాచేస్తే అసహ్యంగా ఉంటుందే."

"తడిసిపోతుందని చెపుతుంటే అసహ్యం అనుకుంటే ఎలాగండీ. మరి అటువంటప్పుడు ఇంత లావు పాటు కోటు దేనికి."

రావుకు భార్యమాట కాదంటం ఇష్టం లేదు. పాంటును మడువక తప్పలేదు. అసలే పాపం పొట్టిగాటి మనిషేమో కోటుక్రింద కాళ్ళు కనబడుతున్నవి. "సరేవస్తా" నని భార్యకుచెప్పి బయటకు

రెయిన్ కోటు

వచ్చాడు రావు. ఆఫీసుకు బయలుదేరాడు. వర్షం పడుతూనే ఉంది. రోడ్లమీద గుంటలన్నీ నీళ్లతో నిండిపోయి ఉన్నవి. చాలా రద్దీగా కూడా ఉన్నవి. ఏదో ఆనందంలో నడుస్తున్నరావు తన పక్కనుంచే పోయిన కారును గమనించలేదు. అది గమనించే లోపల ఆ కారు తన శక్తికొద్దీ మట్టినీళ్ళను ఇతని కోటుమీద కొట్టి వెళ్ళడం కూడా అయింది. ఆ కారువాడిని నానాతిట్లు తిట్టుకున్నాడు. గబగబా బస్సు స్టాండుకు చేరుకున్నాడు.

ఇంతలో బస్సు వచ్చింది. బస్సు ఎక్కి కలయజూశాడు రావు. బస్సు అయితే ఖాళీగానేవుంది. కాని వర్షం పడుతున్నప్పుడు కండక్టరు కిటికీ తలుపులు వేయలేదల్లే ఉంది. అన్ని సీట్లూ సగం తడిసి ఉన్నాయి. రావు కోటు విప్పకుండానే అలాగే ఒక తడిసిన సీటుపై కూర్చున్నాడు. అలా కూర్చుంటున్నప్పుడు అతని కోటునుంచి జారిన నీళ్ళ పొడిగా ఉన్న ప్రక్కసీటును కూడ తడిపాయి. ఆ సీటులోనే కూర్చోబోతున్న వ్యక్తికి కోపం వచ్చింది.

"బాబూ, కాస్త ఆ గంతను తీసికూర్చోగూడదూ" అన్నాడు.

"ఏమిట"న్నట్లుగా చూశాడు రావు.

"చూడండి కోటు నుంచి కారిన నీళ్ళతో ఈ సీటు తడిసిపోయింది. కోటు తీసి కూర్చుంటే ఏంపోయేది అని అన్నాను. అసలే ఉన్న సీట్లన్నీ సగం తడిసిపోయాయి. దానికితోడు కొద్దిగా మట్టి అయినా ఈ రెయిన్ కోటువాలాలకు ఉన్న జబ్బే ఇది." అంటూ ఆ వ్యక్తి ఏదేదో అనడం మొదలు పెట్టాడు. దానికితోడు ప్రక్కన ఉన్నవాళ్ళకూడా అతనికే మద్దతు ఇవ్వడం మొదలు పెట్టారు. పరిస్థితి గమనించిన రావు కిక్కురుమనలేదు.

'సారీ' చెప్పి కూర్చున్నాడు. కోటు గుండీలు విప్పాడు. అతనికి ఆ వ్యక్తిమీద కోపం వచ్చింది. తనకోటు పాడైందని అసలే తనకు ఇదిగా వుంటే పైగా ఇదొకటి. వాళ్ళకు లేకపోయేప్పటికి ఓర్వలేరు. స్థానబలిమి లేనిచోట మాట్లాడకుండా ఉండడమే మంచిది.

ఇంతలో అతడు దిగవలసిన 'స్టాపు' వచ్చింది. ఏవో ఆలోచనలలో ఉన్న రావు అది గమనించలేదు. బస్సు మళ్లీ కదలబోయేసరికి చూశాడు వెంటనే ఆదరాబాదరాగా లేచాడు. కోటు గుండీలు కూడా పెట్టుకోలేదు. ఆ తొందరలో అతని కోటు ఇటూ అటూ వూగుతున్నది. అలా అయితే బాగానేవుండేది. ఆ కోటు పోయి ప్రక్కనున్న వాళ్లను పరామర్శించుతోంది. వాళ్ళంతా ఒకటే గోల.

"ఏమయ్యోయ్. కాస్త ఆ కోటును పట్టుకొని పోరాదూ, అందరకూ అలా తగిలించకపోతే." అని ఒకరన్నారు.

"పాపం కొట్టు మయిపోయిందిగా. నిద్రపోయి నట్టున్నాడు ఇప్పటివరకూ దిగకుండా. ఎవరినన్నా సెక్రటరీని పెట్టుకో నిద్రలేపేందుకూ, కోటు పట్టుకునేందుకూ." అన్నారు ఇంకొకరు.

"అవతారం మాత్రం అలాగే వుంది" అన్నారు వేరొకరు, తన మడిచిన పాంటును ఎగతాళి చేస్తున్నట్లుగా.

రావుకు బాగా కోపం వచ్చింది. విసురుగా ఒక్క తోపు తోసి బస్సుదిగాడు. నెమ్మదిగా నడుచుకుంటూ ఆఫీసు చేరుకున్నాడు. అతనిని చూసిన మిత్రులు సంతోషించారు. అందరూ వానతో విసుగెత్తి ఉన్నారు.


"సాయంకాలంలోగా వాన వెలిసిపోవడం ఖాయం" తీర్మానించారు ఒకరు.

"అదేమిటీ రెండు రోజులవరకూ ఇలాగే ఉంటుందని ప్రొద్దున్నేగా రేడియోలో చెప్పారు." అన్నారు ఇంకొకరు.

"మన రావు రెయిన్‌కోటు తీసుకు వచ్చినప్పుడు ఎప్పుడయినా వర్షం వచ్చిందీ. ఇవాళ అంతే. ఇంతకన్నా కరెక్టయిన వెదర్ రిపోర్టు ఇంకేమి కావాలోయ్." అని వేరొకరన్నారు.

అన్నీ వింటున్న రావుకు మతిపోయినంత పని అయింది. అసలు దారిలోనే రెయిన్ కోటంటే అతనికి సరదా సగంపోయింది. ఈ మాటలతో ఆ మిగిలిన సగంకూడా పోయింది.

సాయంకాలానికి వర్షం తగ్గిపోతే బావుండు ననుకున్నాడు. అతని కోర్కె ప్రకారమో లేక అతని మిత్రులన్నట్లు అతని రెయిన్‌కోటు ప్రభావమో మధ్యాహ్నం నుంచే వర్షం తగ్గుముఖం పట్టి సాయంకాలానికి తగ్గిపోయింది. రావు రెయిన్‌కోటు కూడా సిగ్గుతో ముడుచుకుపోయింది. ●



కమ్యూనిస్టు దేశాలలో కాంగ్రెస్ అధ్యక్షుడు కామరాజ్

(గత సంచిక తరువాయి)

ఆర్. వెంకట్రామన్

బల్గేరియాలో

ఆగస్టు 7వ తేదీ ఆదివారం మధ్యాహ్నం 2—0 గంటలకు మేము బల్గేరియా దేశ రాజధాని అయిన సోఫియా నగరం విమానాశ్రయంలో దిగాము. సంప్రదాయం ప్రకారం బల్గేరియా నాయకులు అందరూ విమానాశ్రయానికి వచ్చి కామరాజ్ కు ఘనస్వాగత మిచ్చారు. ముఖ్యంగా ఆ దేశాన్ని పాలించే పక్షమైన "ఫాదర్‌ల్యాండ్ ఫ్రంట్" నాయకులు కామరాజ్ కు చాల ఉత్సాహోదరాలతో స్వాగతమిచ్చారు. విశేషాతిథులకుగాను ప్రత్యేకించిన "బ్యాలతా ఓడా" భవనంలో విడిది ఏర్పాటు చేశారు.

బల్గేరియా బాల్కన్ దేశాల మధ్య వున్నట్టి దేశం. దీని విస్తీర్ణం సుమారు 40,000 చదరపు మైళ్ళు. జనాభా 80 లక్షలు. వీరిలో 85 శాతం ఆర్థడాక్స్ ఈస్టర్న్ చర్చి క్రైస్తవులు. 13 శాతం ముస్లిములు. కొండలు, అడవులు విశేషంగా వుండే దేశమిది. దేశంలో 45 శాతం వ్యవసాయార్హమైన భూమి. 33 శాతం అటవీ ప్రాంతం.

15 వ శతాబ్దం మొదలు దాదాపు 19 వ శతాబ్దం వరకు బల్గేరియా టర్కీ సామ్రాజ్యంలో వుంది. తర్వాత జార్ సామ్రాజ్యంలో చేరింది. ప్రథమ ప్రపంచ సంగ్రామం తర్వాత, బల్గేరియా, అప్పటి పద్ధతి ప్రకారం నాజీ సైనిక పరిపాలన క్రిందికి వచ్చింది. అందువల్ల ఆదేశంలో ఫాసిజాన్ని ఎదిరించడానికి తీవ్రమైన విమోచనోద్యమం ప్రారంభ మయింది. ఆ ఉద్యమం నడిపించిన నాయకుడు జార్జి డిమిట్రోవ్. ఈయనను ఆ దేశవాసులు జాతి పితగా ఆరాధిస్తున్నారు. లెనిన్ భౌతిక దేహాన్ని రసాయన ద్రవ్యాలతో రక్షించినట్లు డిమిట్రోవ్ భౌతిక దేహాన్ని బల్గేరియా ప్రజలు భద్రపరిచారు.

సోఫియా నగరాన్ని ఒక నందనోద్యానంలో మరుగైన నగరమని అనవచ్చు. ఎక్కడ చూచినా ఆకాశమంటే చెట్లు, పరిమళాన్ని విరజిమ్మే పూవులు.

మేము బస చేసిన మేడకు, నగరానికి మధ్య దూరం నాలుగు మైళ్ళు. ఆ నాలుగు మైళ్ల మేర దానికి ఇరువైపుల గులాబి తోటలు, పుష్పశయ్యలాగ పూచి వుంటాయి. సోఫియా నగరంలో కామరాజ్ నిర్వహించిన మొదటి కర్తవ్యం డిమిట్రోవ్ సమాధికి వెళ్లి పుష్పాంజలి సమర్పించడం. తర్వాత నగరం చూడడానికి బయలుదేరాము.

మేము మొట్టమొదట చూచిన ప్రాంతం సోఫియా పౌరులు నివసించే ప్రాంతం. ప్రజల కోసం ప్రభుత్వం ప్రీఫ్యాబ్రికేటెడ్ నివాసాలను కడుతూనే వుంది. మేము తటాలున ఒక ఇంట్లో దూరాము. ఆ యింట్లో వున్న మహిళామణి మాకు స్వాగతమిచ్చింది. ఆమెను చూడగానే కామరాజ్ "మీరు మీ భర్తతో పాటు ఇక్కడ నివసిస్తున్నారా?" అని ప్రశ్నించారు. ఆ ప్రశ్నకు మరుక్షణమే ఆమె ముఖం సిగ్గుతో ఎర్రబారింది. తలవంచుకుని ఆమె "నాకింకా వివాహమే కాలేదు" అని సమాధాన మిచ్చింది.

ఆమె అక్కడి ఒక టయర్ ఫ్యాక్టరీలో సూపర్ వైజరుగా పని చేస్తున్నది. సుమారు 600 రూపాయలు జీతం. ఆమె తల్లి 500 రూపాయల పెన్షన్ పుచ్చుకుంటూంది. ఆమె తల్లిదండ్రులు ఆమెతోనే వుంటున్నారు. ఆ ఒంటి గది యింటికి అద్దె 15 రూపాయలు.

నేను ఆ ప్రాంతాన్ని ఫోటో తీశాను. మన వూరిలో లాగే అక్కడి పిల్లలు నన్ను ముట్టివేసి, "మమ్మల్ను గూడ ఫోటో తీయండి" అని అడిగారు. ప్రపంచంలో పిల్లలంతా ఒకే విధంగా ప్రవర్తిస్తారు అని భావించి, ఆ పిల్లల ప్రేమ కోసం వారిని ఫోటో తీశాను.

ఇళ్లు చూచిన తర్వాత పక్కన వున్న ఒక గుట్ట శిఖరం మీదికి వెళ్లాము. దారిలో 12 వ శతాబ్దిలో నిర్మించిన ఒక మేరీ కన్య మందిరాన్ని చూచాము. దానిలో ఆ కాలపు వర్ణచిత్రాలను చాలా భద్రంగా కాపాడుతున్నారు. అక్కడే పూర్వపు బల్గేరియా రాజులు పట్టాభిషిక్తులయ్యేవారని చెప్పారు.

ఈ గుట్ట శిఖరానికి 'విటోసా' అని పేరు. ఈ శిఖరం దారి సహజంగా వుండేట్లు ఏర్పాటు చేశారు. ఈ కొండ మీది ఒక అద్భుతమేమిటంటే, నల్లరాళ్ల నది పారుతున్నట్లు వున్న ఒక దృశ్యం. ఒకానొకప్పుడు, ఏరు ఈ నల్లరాళ్ళను తోసుకుంటూ ప్రవహించి వుంటుందని మమ్మల్ను అక్కడికి పిలుచుకునిపోయిన వాటు అన్నారు. నేడు నల్లరాళ్ల కింద ఏరు ప్రవహిస్తున్నది. శిఖరం పైకి ఎక్కి చూస్తే, ఏరు పారడం కనిపిస్తుంది. పైకి రాతి ఏరు లాగను, కింద నీరు పారడము ఆశ్చర్యపడదగిన దృశ్యమే కదా!

గుట్ట శిఖరంపై ఒక ఆధునిక పద్ధతుల హోటల్ వుంది. విలాసయాత్రికులు ఈ హోటల్‌లో ఒక్క రోజన్నా బసచేసి, ఒక పూటయినా భోజనం చేసి, తిరిగి వెళ్లడం అలవాటట. మేము కూడా రాత్రి భోజనానికి 'కపిటో' అని వ్యవహరించబడే ఆ హోటల్‌కు వెళ్లాము. మేము హోటల్‌కు వెళ్లినప్పుడు టెలివిజన్‌లో మేము విమానంలో దిగడం, స్వాగతం మొదలయినవి చూపుతున్నారు.

భోజనానంతరమూ కొండ శిఖరం నుంచి సోఫియా నగరాన్ని చాలసేపు చూచి ఆనందించాము.

మరునాటి రోజు ఉదయం "ఫాదర్‌ల్యాండ్ ఫ్రంట్" అధ్యక్షుడు ట్రైకోవ్‌ను, పార్లమెంటు సభాపతిని కలుసుకొని సంభాషించాము. 'ఫాదర్ ల్యాండ్ ఫ్రంట్' అనేది నాజీజాన్ని ఎదిరించడానికి గెరిల్లా ఉద్యమంగా ఆరంభమయింది. దేశం విముక్త అయిన తర్వాత నేడు కూడా ఆ సంస్థే దేశ పరిపాలించే పక్షంగా రూపొందింది.

ఈ ఫ్రంట్‌లో బల్గేరియా కమ్యూనిస్టు పార్టీ, వ్యవసాయపార్టీ వున్నాయి. ఈ ఫ్రంట్ పరిపాలన విషయంలోనేకాక, సాంఘికంగాను ప్రజలకు చాల సేవ చేస్తున్నది.

ఒకప్పుడు ఎంతో వెనుకబడిన బల్గేరియా, నేడు విద్యా పరిశ్రమ రంగాలలో అత్యంత పురోగతి సాధించింది. విప్లవానికి ముందు బల్గేరియాలో 75 శాతం జనం వ్యవసాయదారులు. నేడు 75 శాతం పరిశ్రమ రంగంలో పని చేస్తున్నారు. పెక్కు పరిశ్రమలకు, ముఖ్యంగా ఉక్కు యంత్రాగారాలకు సోవియట్ రష్యా సహాయం పొందుతున్నారు. విద్య, వైద్య సహాయం ప్రజలందరికీ ఉచితం.

బల్గేరియా నాయకులు తమదేశ విదేశాంగ విధానం గురించి వివరించేటప్పుడు, తమకు శాంతి యుత సహజీవనంలో సంపూర్ణ విశ్వాసం వుందని, దానికి తార్కాణంగా, పొరుగున వున్న టర్కీలో కాపిటలిస్టు ప్రభుత్వం వున్నప్పటికీ, దానితో స్నేహ పూర్వకంగా ప్రవర్తించడానికి శ్రద్ధ తీసుకుంటున్నట్టు తెలిపారు. వివిధ రాజ్యాలలో అరబ్—రిపబ్లిక్, ఆస్ట్రియా, భారత్ వంటి దేశాలతో తమ సంబంధాలు చాల సామరస్య పూర్వకంగా వున్నాయని అన్నారు.

భారతదేశంలో పెక్కు సమష్టి పరిశ్రమలు ప్రారంభించవచ్చునని, దాని కోసం తమ ప్రభుత్వం విదేశ వాణిజ్యమంత్రి భారతదేశానికి వస్తారని ఆయన అన్నారు. త్వరలోనే తమ 'ఫాదర్‌ల్యాండ్ ఫ్రంట్' ఆరవ వార్షిక మహాసభ జరుగుతుందని, దానికి ఇండియన్ నేషనల్ కాంగ్రెస్ ప్రతినిధులను పంపవలసిందని వారు కామరాజ్‌ను కోరారు.

ఆ రోజు మధ్యాహ్నం విదేశ వాణిజ్యమంత్రిని కలుసుకొన్నాము. బల్గేరియా దేశం మొత్తం వ్యాపారంలో 80 శాతం సోషలిస్టు దేశాలతో జరుగుతున్నట్టు ఆయన తెలియజేశారు. తర్వాత భారత దేశంతోనే హెచ్చు వ్యాపారమని ఆయన అన్నారు.

తమది సోషలిస్టు దేశమయినప్పటికీ, భారతదేశంలోని పెట్టుబడిదారులతో సమష్టి పరిశ్రమలు ప్రారంభించడానికి తమ సిద్ధంగా వున్నామని కూడా ఆయన అన్నారు.

తర్వాత మేము సోఫియా పట్టణానికి శివారులో వున్న ఒక పెద్ద ఉక్కు కర్మాగారానికి వెళ్లాము. ఇది ఏటా 15 లక్షల టన్నుల ఉక్కు తయారుచేస్తుంది. 1970 కి ఏటా 30 లక్షల టన్నులు ఉక్కు తయారు చేయడానికి ఉద్దేశించబడిందని మంత్రి తెలిపారు.

కాలిన బొగ్గు వుత్పత్తి చేయడానికి తమదేశంలో రెండు ఫ్యాక్టరీలున్నాయని, వాటినుంచి తయారయ్యే అక్కిన అగ్నదాహ వస్తువులతో 20 కర్మాగారాలు రకరకాల వస్తువులు తయారు చేస్తున్నాయని తెలిసింది. ఈ కర్మాగారాలలో 15 వేల మంది కార్మికులు, 12,00 మంది ఇంజనీర్లు పని చేస్తున్నారట.

ఉక్కు కర్మాగారం చూచిన మీదట సమష్టి వ్యవసాయక్షేత్రాన్ని చూచాము. దీనికి 'క్రిమినా' సమష్టి వ్యవసాయక్షేత్రమని పేరు. దీనిని 1948లో ఆరంభించారు. దీనిలో 1000 పశువులు, పందులు, 20 ట్రాక్టర్లు, దాదాపు 30 లారీలు, మరికొన్ని యంత్రాలు వున్నవి.

పనినుంచి తిరిగి వస్తున్న కొందరు మహిళలతో కామరాజ్ సంభాషించారు.

సమష్టి వ్యవసాయ క్షేత్రంలో ఒక పాత పెంకుటిల్లు కనిపించింది. అది తాము విప్లవానికి ముందు నివసించిన ఇల్లని, తాము ఉపయోగించిన

వస్తువులు అక్కడ వుంచామనీ, విప్లవానంతరం తాము ఎంతటి అభ్యుదయం సాధించిందీ, యువకులకు తెలియడానికే అలా ప్రదర్శించామని, క్షేత్రం నిర్వాహకులు తెలిపారు.

ఆ రాత్రి అతిథి గృహంలో కామరాజ్‌కు అధికార పూర్వకమైన విందు జరిగింది. కామరాజ్ ఆవిందులో బల్గేరియా సాధించిన పురోగతిని ప్రశంసిస్తూ ప్రసంగించారు.

ఆరాత్రి కామరాజ్ నాతో మాట్లాడుతున్నప్పుడు "చిన్నదేశమైన బల్గేరియా ఇంతగా అభివృద్ధి చెందడానికి అవకాశం వున్నప్పుడు, మనం ఎందుకు అభ్యుదయం చెందలేము?" అని ప్రశ్నించారు. పరిశ్రమలలో అభ్యుదయం మూలంగానే అభివృద్ధి సంపాదించగలదనడానికి బల్గేరియా ఉదాహరణమనీ ఆయన అన్నారు.

మరునటిరోజు వుదయం యుగోస్లావియా రాజధాని అయిన బెల్‌గ్రేడ్ నగరానికి బయలుదేరారు కామరాజ్.

యుగోస్లావియాలో

బల్గేరియా రాజధాని అయిన సోఫియా విమానాశ్రయంలో కామరాజ్‌కు వీడ్కోలిచ్చిన నాయకులు పెక్కు పూలచెండ్లు బహూకరించారు. కామరాజ్ విమానం ఎక్కిన తర్వాత ఆ పూలచెండ్లను మహిళలకు బహూకరించారు. వాటిని భద్రంగా కాపాడి మళ్లీ తిరిగి ఇవ్వవలసిన వస్తువులనుకొని, వాటిని భద్రంగా తమ వద్ద వుంచుకున్నారు. అది గ్రహించి అవి మీకే బహూకరించాను" అన్నారు కామరాజ్. ఆ మాట విని ఆ మహిళలు మహానందం పొందారు.

పూవులకు బల్గేరియా దేశ మహిళలు ఇచ్చే గౌరవాన్ని మనదేశ మహిళలు ఇవ్వడం లేదని ధైర్యంతో గట్టిగా చెప్పగలను. పూవులు వారికి అపూర్వ వస్తువులు కావడమే దీనికి కారణమేమో!

సోఫియా విమానాశ్రయం నుంచి యుగోస్లావియా దేశం రాజధాని అయిన బెల్‌గ్రేడ్‌కు ఒక గంటలో చేరవచ్చు. అందువల్ల ఈ ప్రయాణం ఏదో విమానంలో ఎక్కి దిగినట్లు అనిపిస్తుందేకాని, ఒక దేశంనుంచి మరొక దేశానికి వెళ్లినట్లు వుండదు.

బెల్‌గ్రేడ్ విమానాశ్రయంలో కామరాజ్‌కు శుభస్వాగత మిచ్చారు. ఆదేశపు "సోషలిస్టు అలయన్స్" అధ్యక్షుడు, మాసిడోనియా రిపబ్లిక్ అధ్యక్షుడు అయిన కోలియా సెబిస్కి తన మిత్రులతోపాటు విమానాశ్రయానికి వచ్చారు. మేము విడిది చేసిన ప్రభుత్వ అతిథి భవనం అతిరమ్యమైన పరిసరాలలో వుంది.

ఆ రోజు వుదయం యుగోస్లావియా కేంద్ర సంఘ ప్రధాన కార్యాలయంలో కోలియా సెబిస్కిని, ప్రణాళికాసంఘ సభ్యులను కలుసుకొని సంభాషించారు కామరాజ్.

యుగోస్లావియా మద్రాసు రాష్ట్రం కన్నా రెండింతలు విస్తీర్ణమైనది. జనసంఖ్య రెండు కోట్లకు తక్కువే. అధికసంఖ్యాకుల భాష సెర్బ్రోకొటిన్. మాసిడోనియన్, స్లోవేనియన్ మొదలయిన భాషలు కొన్ని రాష్ట్రాలలో అల్పసంఖ్యాకులు మాట్లాడుతారు. ఈ దేశంలో 49 శాతం ఆర్థడాక్స్ క్రిస్టియన్ సంప్రదాయులు. 36 శాతం కాథలిక్కులు. 12, 13 శాతం ముస్లిములు.

కామరాజ్

1941 వ సంవత్సరం నాజీ సేనలు యుగోస్లావియాను ఆక్రమించుకున్నాయి. అప్పుడు రాజుగా వున్న పీటర్ ఇంగ్లాండుకు పారిపోయారు. మార్షల్ టిటో నాయకత్వంలో నాజీ ప్రతిఘటన ఏర్పడింది. దానికి సోవియట్ దేశాల నుంచి, పశ్చిమదేశాల నుంచి రహస్యంగా సహాయం అందింది. నాజీజం పరాజయం పొందిన తర్వాత యుగోస్లావియా ఒక రిపబ్లిక్‌గా ఏర్పడి మార్షల్ టిటో నాయకత్వంలో వృద్ధి పొందసాగింది.

ప్రారంభంలో యుగోస్లావియా సోవియట్ యూనియన్ లాగే కమ్యూనిస్టు సిద్ధాంతం ప్రాతిపదికగా ఏర్పడింది. కాని, స్టాలిన్‌కు, టిటోకు ఏర్పడిన ఘర్షణ మూలంగా, యుగోస్లావియా విడిగా వుండడం ఆరంభించింది. స్టాలిన్ మరణానంతరం రష్యాతో మరల సామరస్య పూర్వకమైన సంబంధాలు ఏర్పడ్డాయి. మాకు స్వాగతమిచ్చిన కోలియా సెబిస్కి నాజీ ప్రతిఘటనలో తీవ్రంగా పాల్గొన్నవారు. నాజీ సైన్యాలు తమ దేశాన్ని ఆక్రమించుకొన్నప్పుడు, తాను జైలులో పడిన బాధలు, కాళ్లకు ఇనుప కడియాల బేడీలు వేయడం మొదలయినవి తెలిపారు. ఆ బేడీల మూలంగా తమ కాళ్ల మీద ఏర్పడిన గుర్తులు చూపారు.

యుగోస్లావియాలో ప్రధానమైన రాజకీయ పక్షం సోషలిస్టు అల్లయన్స్ ఫ్రంట్. యుగోస్లావియా పార్లమెంటులో ఐదు సంఘాలున్నాయి— ఆర్థికసంఘం, ఆరోగ్యసంఘం, రాజకీయ సమస్యా నిర్వాహక సంఘం, దేశీయ సంఘం, విద్యాసంస్కృతి సంఘం. ఈ సంఘాలకు విడిగా అధికారాలు లేవు. అయితే, ఆయా సంఘాలకు సంబంధించిన విషయాలను ఆ సంఘాలు మొదట పూర్తిగా చర్చించి తమ నిర్ణయాలను పార్లమెంటుకు తెలియజేస్తాయి.

విప్లవానంతరం యుగోస్లావియా పరిశ్రమ రంగంలో చాల అభ్యుదయం సాధించింది. ముఖ్యంగా నౌకానిర్మాణం, రసాయన పరిశ్రమ, విద్యుదుత్పత్తి, మొదలయిన రంగాలలో గణనీయమైన పురోభివృద్ధి సాధించబడింది. వ్యవసాయరంగంలో మంచి అభ్యుదయం సాధించింది.

రాజ్యాంగ విషయాలు వివరించేటప్పుడు, కోలియా సెబిస్కి ఒక ఆశ్చర్యకరమైన విషయమొకటి, తెలియజేశారు. 1967 ఎన్నికల పద్ధతిలో పెక్కు మార్పులు ఉంటాయని, పార్లమెంటు సభ్యులు ఒక దఫాకు మించి సభ్యులుగా వుండడానికి అవకాశం లేదని, మంత్రులకు కూడా ఈ పద్ధతే వుండగలదని ఆయన అన్నారు. అయితే అనివార్యంగా వుండవలసిన పెద్దనాయకుల విషయంలో ఈ సూత్రం సడలించబడుతుందని తెలిపారు.

యుగోస్లావియా ప్రణాళికలను గురించి కామరాజ్ ఆయనతో చాలసేపు వాదవివాదాలు జరిపారు. తర్వాత కామరాజ్‌కు అధికారపూర్వకమైన విందు జరుపబడింది.

ఆ రోజు మధ్యాహ్నం బెల్‌గ్రేడ్‌కు సమీపంలోని ఒక వ్యవసాయక్షేత్రం చూచాము. ఈ క్షేత్రం ఒకప్పుడు రెండు నదుల మధ్యన వున్న బురదనేల. అందువల్ల వ్యవసాయానికి అర్హంగా వుండలేదు. యుద్ధానికి ముందు దీనిని వ్యవసాయయోగ్యం చేయడానికి చేసిన ప్రయత్నాలు ఫలించలేదు. విప్లవానంతరం ఈ బురద భూమిలో నీరు ప్రవేశించకుండా అడ్డుకట్టి, దానిలోని నీటిని ఇంజనుల ద్వారా బయటికి తోడివేసి, పెద్ద వ్యవసాయక్షేత్రంగా మార్చివేశారు. దీని విస్తీర్ణం 90 వేల యకరాలు. దీనిలో కొంతభాగంలో కూరగాయలు పండించి, కొన్ని పాశ్చాత్య దేశాలకు ఎగుమతి చేస్తున్నారు. పాడి కేంద్రం కూడా ఇక్కడ వుంది. యూరప్‌లోనే ఇది పెద్ద పాడికేంద్రమట. ఇంత పాలు అమ్మడమెల్లాగనేదే పెద్ద సమస్య అయిందని, అయితే "నేడు పాలు వద్దు, రేపు ఇవ్వు" అని పశువులకు చెప్పడం ఎలాగని ఆయన అని సెబిస్కి అన్నారు.

ఆరాత్రి భారత రాయబారి శ్రీ అటల్ కామరాజ్‌కు విందుచేశారు. దానికి సెబిస్కి, మంత్రులు, ప్రముఖులు వచ్చారు. మార్షల్ టిటో ఆ విందులో పాల్గొనలేదు.

మార్షల్ టిటో మామూలుగా బెల్‌గ్రేడ్‌లో వుండడంలేదు. బిరియోని అనే విడి ద్వీపంలో వుంటారు. ఆగస్టు 10 వ తేదీన మేము ప్రత్యేక విమానంలో బిరియోనికి బయలుదేరాము. విమానం పులా అనే సముద్రతీర నగరం చేరిన వెంటనే ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన పడవ మాకోసం అక్కడ కాచుకొని వుంది. నెప్పటి ఎండలో మా బిరియోని ప్రయాణం ఎంతో హాయిగా వుండినది.

బిరియోని చాల సుందరమైన ద్వీపం. ఉత్తమమైన ఆరోగ్యకేంద్రం. మార్షల్ టిటో నివాసం అక్కడే. ప్రముఖ రాజకీయ నాయకులను అక్కడే కలుసుకుంటారు, ఆయన.

బిరియోనిలో సముద్రతీరంలో వున్న "నెప్ట్యున్" అనే అందమైన హోటల్‌లో కొంతసేపు విశ్రాంతి తీసుకున్న తర్వాత, మార్షల్ టిటోను కలుసుకోవడానికి బయలుదేరారు కామరాజ్.

కామరాజ్—టిటో సంభాషణ సమయంలో హాజరు కావడానికి పత్రికా ప్రతినిధులకు, ఫోటోగ్రాఫర్లకు అనుమతి ఇవ్వబడలేదు. మా వైపు కామరాజు, నేను, భారత రాయబారి అటల్, టిటో తరపున టిటో సెబిస్కి, విదేశాంగ సహాయమంత్రి ఈ సమావేశంలో పాల్గొన్నాము.

కామరాజును చూడగానే టిటో చాల వుత్సాహంతో కరస్పర్శ చేసి, స్వాగతమిచ్చారు. తాను అవడి కాంగ్రెసుకు వచ్చినన్నాళ్లు, అక్కడ ప్రజల కోలాహలంగా, మహాసభ ముగిసిన తర్వాత జనం వెళ్లిపోయే సంరంభం మొదలయిన విషయాలను టిటో జ్ఞాపకం చేశారు.

ఇద్దరూ ఉభయదేశాల రాజకీయ పరిస్థితిని గురించి సంభాషించారు. భారత పాకిస్తాన్ సంబంధాలు బలపడాలని టిటో అన్నారు. గంటసేపు సంభాషణలు ఈ విధంగా జరిగిన తర్వాత, టిటో "మీరు అతిథులు. మీ భోజనానికి నేను ఆలస్యం చేయగూడదు—" అంటూ, నిబంధ రాజ్యాల మహాసభలో పాల్గొనడానికి నేను భారతదేశానికి రానున్నానని, మళ్లీ కలుసుకుందామని చెప్పి సెలవు తీసుకున్నాడు.

భోజనానంతరం మేము బిరియోని ద్వీపం తిరిగి వచ్చాము. సుమారు 15 వందల సంవత్సరాలకు ముందు బిరియోని రోమన్ సామ్రాజ్యంలో భాగం. పాత రోమన్ వాస్తుశిల్ప చిహ్నాలు అక్కడ కనిపిం

తాయి. అప్పటి పెద్దపెద్ద స్నానాగారాలు మొదల యిన వాటి శిధిలాలు ఇంకా వున్నాయి. వీటి పక్కనే నవీన స్నానఘట్టాలు నిర్మించబడ్డాయి. ఇవి ఎంతో ఆకర్షణీయంగా వున్నాయి.

ఆరాత్రే నేనూ కామరాజ్ ఋలా నగరం చేరాము. ఋలా నగరం క్రీస్తుశకం 1వ శతాబ్దంలోనే, రోమన్ సామ్రాజ్యంలో వున్నది. అందువల్ల అగస్టిన్ చక్రవర్తి నిర్మించిన ఆరుబయట రంగస్థలాలు కట్టడాలు మొదలయిన వాటిని నేటికీ భద్రంగా కాపాడు తున్నారు. ఇది రోమన్ సామ్రాజ్యంలో వున్నప్పుడు ఇక్కడ పెక్కు యుద్ధాలు జరిగాయి. మహావీరులు సింహంతో పోట్లాడడం జరిగేది.

ఋలానగరంలో ఒక పెద్ద నౌకానిర్మాణ కేంద్రం వుంది. అక్కడ 25 వేల టన్నుల బరువు గల ఓడలు నిర్మించబడుతున్నాయి. ఈ కేంద్రాన్ని కార్మికులే నిర్వహిస్తారు. రాబడిలో $17\frac{1}{2}$ శాతం ప్రభుత్వానికి అందజేయబడుతుంది. ఇవన్నీ విన్న కామరాజ్ "భారతదేశం నుంచి ఒక ఆర్థిక నిపుణుడు యుగోస్లావియాకు వచ్చి, దీని ఆర్థిక అభివృద్ధిని రెండు నెలలు పరిశీలించి ఒక నివేదిక భారతదేశానికి సమర్పిస్తే, భారత ప్రభుత్వానికి సహాయకారిగా వుండ గలదు'' అన్నారు.

యుగోస్లావియా నాయకులు మాకు ఏడ్రియాటిక్ సముద్రతీరంలోని సుప్రసిద్ధ ఆరోగ్య కేంద్రమయిన డుబ్రోవ్నిక్ నగరంలో వసతి ఏర్పాటు చేశారు. మేము ప్రత్యేక విమానంలో డుబ్రోవ్ని విమానాశ్రయంలో దిగాము. అక్కడి నుంచి, కొండ దారిని నగరంలో ప్రవేశించాము. చీకటి పడింది. కొండ మీది నుంచి, కొండ కింది డుబ్రోవ్నిక్ నగరం అందం చెప్పతరంకాదు. ఎర్తులాకారంగా వున్న సముద్రతీరంలో కట్టిన పాత కోటలు, దాని చుట్టూ పాతనగరం, దాని తర్వాత నూతన నగరం— ఇవన్నీ సినిమా దృశ్యాల లాగ అద్భుతంగా కనిపించాయి.

మేము, మా విడిది చేరగానే డుబ్రోవ్నిక్ నగరం మేయర్ మాకు స్వాగతం చెప్పారు. తర్వాత కామరాజు మినహాగా మేము ఆరుబయలు రంగస్థలంలో జరిగిన "ఒథెల్లో'' నాటకం చూచాము. మనదేశంలోనూ పాత కోటల ముందున్న మైదానాలలో ఇలాటి ఆరు బయలు నాటకాలు ఆడవచ్చునని నాకు తోచింది.

మరునటిరోజు అగస్టు 11 వ తేదీ పడవలో డుబ్రోవ్నిక్ నగరంలో పర్యటించాము. ఆ సాయంకాలం అక్కడికి ఆరుమైళ్ల దూరంలో వున్న చాప్టా అనే పట్టణం చేరాము. అక్కడ కోలియా సెబ్స్కి, ఆయన కుటుంబం నెలరోజులు సెలవు మీద విశ్రాంతి తీసుకోడానికి ఒక భవనం ఏర్పాటు చేసు కున్నారు. అది రాజ్య పరిత్యాగం చేసిన ఇంగ్లాండు రాజు విండ్సర్ ప్రభువు సతీసమేతంగా "హనీమూన్'' గడపిన భవనం. నేను ప్రపంచంలో చూచిన అత్యంత సుందర భవనాలలో ఆ భవన మొక్కటి. ఆ భవనం చుట్టూ పూవుల తోటలు, ఎదుట అందమైన కొండ, ఎక్కడ చూచినా విశ్రాంతి కోసం, సముద్రంలో స్నానం చేయడానికి వచ్చిన యువతీ యువకులు, పడవలు నడిపేవారు, ..ఎక్కడ చూచినా, ప్రశాంతి......

మరునటిరోజు ఉదయం మా సోషలిస్టు దేశాల పర్యటన సమాప్తమైంది. విమానాశ్రయం విశ్రాంతి కోసం, వినోదం కోసం వచ్చిన యాత్రికులతో కిటకిట లాడింది. వారికి విమానాశ్రయంలోనే త్వరలో క్షణాలలోనే అనుమతి పత్రయలు ఇచ్చి వేస్తున్నారు. విదేశీయాత్రికులు విశేషంగా రావాలనే వుద్దేశంతో యుగోస్లావియా సుంకపు నిర్బంధాలను చాల వరకు తగ్గించింది. ఈ సంవత్సరం వీసా లేకనే రావచ్చునని కూడా వుత్తరువు చేసింది.

మా విమానం రావడానికి కొంచెం ఆలస్యమైంది. అయినా, మాకు వీడ్కోలు ఇవ్వడానికి వచ్చిన వారంతా వేచి వున్నారు. చాలసేపు కాచుకుని వుండి, అతికష్టం మీద, మనస్సు లేక మాకు వీడ్కోలిచ్చారు.

మా విమానం ఆకాశంలో వున్నప్పుడు స్వంత దేశం నుంచి వెళ్లిపోతున్నామనే భావమే కామరాజుకు, నాకు కలిగింది.

కామరాజు ఒక్కమాటలో, ... తగిన ప్రత్యేకమైన ఒకే ఒక మాటలో, తమ సోషలిస్టు దేశాల పర్యటనను గురించి అన్నారు:

"ఈ పర్యటన చాల ఫలదాయకమైనది. పెక్కు విషయాలను తెలుసుకొనడానికి నాకు అవకాశాలు కలిగించింది.''

—అనువాదం: తి. రా.


(ఆనందవికటన్ సౌజన్యంతో)

(అయిపోయింది)●

మెదడుకి మేత




డాక్టర్ మహీధర నళినీమోహన్



యుద్ధతంత్రం

(ఝ) సవరలకు, నాగులకు జరిగిన ఒకా నొక యుద్ధంలో ఇరుసైన్యాలూ చతురస్రాకారంలో నిల్చి ఢీకొన్నాయి. (చతురస్ర వ్యూహం అంటే ఏమిటో ఇక్కడ బొమ్మలో చూపబడింది ఉదాహరణకి) సవరల పక్షాన 512 మంది సైనికులు అధికంగా ఉన్నారు. అయినాసరే నాగులు ప్రాణాలకు తెగించి పోరాడి, సూర్యాస్తమానం అయేసరికి ఎదిరి పక్షంలో సగభాగాన్ని చంపివేయగలిగేరు. నాగులలో 200 లోపుగా మాత్రమే చనిపోయారు. అక్కడితో ఇరుపక్షాలబలాలు సరిసమానమయాయి.



అసలు రెండుసైన్యాలా ఎందరెందరు సైనికులు యుద్ధంలో పాల్గొన్నారో చెప్పగలరా? (ఒక్కమనవి : సవరలకు, నాగులకు ఇటువంటి యుద్ధం ఎన్నడూ జరగలేదని చరిత్ర బాగా తెలిసిన పెద్దలు విమర్శిస్తారేమో. నాకు చరిత్ర అంత బాగారాదు. కనుక క్షంతవ్యుణ్ణి.)



కవాతు

(ఞ) కవాతు

యుద్ధం ముగిసింది. తావగా మిగిలిన సైనికులను యుద్ధరంగంనుంచి వెనుకకు తీసుకుపోవడానికి అంతా సిద్ధమైంది.

“ముగ్గురు, ముగ్గురు చొప్పున వరుసలు ఏర్పడండి!” అని ఆజ్ఞాపించాడు సేనాని. చకచకా ముగ్గురేసి చొప్పున వరుసలు ఏర్పడి పోయాయి. చివర ఒక్కడుమాత్రం మిగిలిపోయాడు. ఆ ఒక్కడినీ వేరుగా నడిపించడం ఇష్టంలేక సేనాని మరో విధంగా ఆజ్ఞాపించాడు.

“వరుసకు ఐదుగురు చొప్పున నిలువబడండి!”

ఈసారి ఇద్దరు మిగిలిపోయారు.

సేనానికి ఈ పద్ధతి నచ్చలేదు.

“వరుసకి ఏడుగురు చొప్పున నిలబడండి!” అని మళ్ళీ ఆజ్ఞాపించాడు.


ఈసారి ముగ్గురు మిగిలిపోయారు.

సేనాని బుర్రగోక్కున్నాడు. వరుసకి ఎందరు నిలుచుంటే సరిగ్గా సరిపోతారో అతడికి అర్థం కాలేదు.

“వరుసకి పదకొండుగురు చొప్పున నిలబడండి!” అన్నాడు. ఈసారి నలుగురు మిగిలిపోయారు. ఈ మార్పులతో సేనానీ, సైనికులూ కూడా విసుగెత్తిపోయారు. ఇంక చేసేదిలేక, మిగిలిపోయిన ఈ నలుగురినీ అందరికన్న ముందు నిలువబెట్టి, ఎదరకు సాగిపోయాడు సేనాని.

ఇంతకీ ఆ సైనికులు ఎంతమందో మీకేమైనా తెలిసిందా ?

(ట) కాగితపు పడవ



కాగితప్పు పడవ

బొబ్బర్లంకనుంచి గన్నవరానికి గోదావరిగట్టునే పక్కని కాలువ ఒకటి వుంది. లాంచీలో గన్నవరంలో బయలుదేరితే 6 గంటలలో బొబ్బర్లంక చేరుకోవచ్చు. అదే బొబ్బర్లంకనుంచి గన్నవరం రావాలంటే 4 గంటలలో ప్రయాణం పూర్తి అయిపోతుంది. కాగితపు పడవ ఒకటి తయారుచేసి బొబ్బర్లంక దగ్గర కాలువలో వదిలిపెడితే అది గన్నవరం ఎప్పటికి చేరుకుంటుంది? (కాగితం నానిపోకుండానూ, మధ్యలో ఎక్కడా ఆగిపోకుండానూ ఉంటేనే సుమా!)

(ఠ) గొర్రెదాట్లు

గొర్రెదాట్లు



ఒకదాని వెనుక ఒకటిగా వరుసగా గొర్రెలమంద వస్తోంది. వాటిదారికి అడ్డంగా చిన్నగొయ్యి ఒకటి ఉంది. ఆ గోతిని గొర్రెలు దాటడం మొదలుపెట్టాయి. పది నిమిషాలలో పది గొర్రెలు దాటితే, ఒకగంటలో ఎన్ని గొర్రెలు దాటుతాయి? జవాబు 60 మాత్రంకాదు. ఆలోచించండి!

(డ) పాతకోటు



పాతకోటు

రెడీమేడ్ బట్టలషాపులో ఒక కోటు ఉంది. దాని అసలు ఖరీదు 30 రూపాయలు. కాని, అది పాత ఫేషనులో ఉండి, ఎవ్వరూ కొనకపోవడంచేత దాని ధర 24 రూపాయలకు తగ్గించాడు ఆకొట్టు యజమాని. అప్పటికీ ఎవ్వరూ కొనలేదు. 15 రోజులుచూచి, మళ్ళీ 19 రూ. 20 పైసలకి తగ్గించాడు. అప్పటికీ ఎవ్వరూ కొనలేదు. పై ధర తగ్గింపు పద్ధతినే అనుసరించి మరోసారి ధర తగ్గించి, అమ్మివేయగలిగేడు. అతడు అమ్మినది ఏ ధరకి?

(జవాబులు 56 వ పేజీలో)



నటి రాజసులోచనకు బ్యూటీ ట్రీట్ మెంట్ యిస్తున్న శ్రీమతి విద్యా

పరిశుభ్రత

ముఖం కడుక్కునేందుకు 'మెడికేటేడ్‌సోప్' ను ఉపయోగించడం మేలు. చన్నీళ్ళు జల్లుకుంటూ వ్రేళ్లతో మర్దనా చేస్తూ ముఖం కడుక్కోవాలి. మీరు నల్లగా వున్నట్టయితే 'బ్లీచింగ్ క్రీమ్' ఉపయోగించండి. మొటిమలకుకూడా నేరుగా ఒక 'క్రీమ్' వుంది. అలానే మచ్చలకూ, ముడతలకూను వేర్వేరుగా 'క్రీము' లున్నాయి. ఒకఅయిదు నిమిషాలదాకా చర్మానికి ముడతలున్న భాగానికి క్రీమ్‌ను అప్లయిచేసి మర్దనా చేయాలి. కళ్ల దగ్గర, పెదవులు, మొదలైన మృదువైన చర్మం దగ్గర దట్టంగా పట్టించి 'మాస్క్' వేయాలి. పది నిమిషాలు అలావుంచిన తర్వాత వేడిగావున్న తువాలుతో తుడిచివేయాలి. తర్వాత మీ వర్చస్సుకు తగిన క్రీమును రాసి పౌడరు అద్దుకోండి. ఇలా సుమారు మూడునెలలుచేస్తే మంచి ఫలితం కని పిస్తుంది. మొదటినెలలోనే మెరుగుదల కనిపి స్తుందికాని వెంటనే విరమించుకోగూడదు. అందంగా అలంకరించుకోడానికే ఎక్కువ కాలాన్ని వృధా చేయకుండా రోజూ ఒక పదిహేను నిమిషాల పాటు ఇలాంటి 'పునాది' వేసుకుంటే తర్వాత్త ర్వాతి సుగుణం మీకే కనిపిస్తుంది.

పడుకోబోయేముందు కూడా రోజూ 'క్రీమ్' రాసుకుని అయిదు నిమిషాలతర్వాత పొడితువాలుతో తుడిచేస్తే మంచిది. మళ్లీ ముడతలు కన్పించవు.

మీ శరీరం రంగు తెలుపుతూ, మీ అడ్రసు రాసి, పదిహేను పైసల తపాలాబిళ్ల పంపి నేరుగా మాతో సంప్రదించినా, మీకు అవసరమైన

శ్రీమతి విద్యా కనకతంగం

ఎప్పుడూ అందంగా కనిపించాలి!

సన్నగా వున్నవాళ్లు అందంగా ఆకర్షణీయం గాను వుంటారు గనక, అందు గురించి మనం ఎటు వంటి జాగ్రత్తల్ని తీసుకోవాలి అనే విషయాన్ని క్రిందటివారం చర్చించుకున్నాం. వేరు వేరు అవయ వాల్ని ఎలా పొందికగా వుంచుకోవాలో తర్వాత తెలియ పరుస్తాను.

ఈ వారం చర్మాన్ని శోభాయమానంగా చేసుకోవ డానికి కొన్ని మార్గాలు సూచిస్తాను. ముఖవర్చస్సు కళకళలాడుతూవుండాలని అందరూ కోరుకుంటారు కదా, అందుకని రోజూ పదిహేను నిమిషాలన్నా శ్రమపడాలి. అలంకరించుకోవడంలో మనం గంటలు గంటలు గడిపేస్తామనుకోండి, అది వేరు. చర్మం సొగసుగాలేదంటే అందుకు కారణాలు: సరిగ్గా శుభ్రం చేసుకోకపోవడం, ఎక్కువ తీపి సరకులు తినడం, తినే పదార్థాల్లో నూనె విపరీతంగా వాడడం, మంచి సౌందర్య సాధనాల్ని ఉపయోగించకపోవడం, ఇటువంటి అలవాట్లవల్ల మొటిమలు, తామర, తెలుపు లేక నలుపు మచ్చలు, చర్మంమీద ముడ తలు, కళ్లచుట్టూ నల్లని చారలు, ఇవన్నీ ఏర్ప డుతూవుంటాయి. అశ్రద్ధవల్ల, తెలియనితనంవల్ల ఏర్పడిన ఇటువంటివన్నీ, క్రీములు, లోషన్లు ఉపయో గించినప్పుడు కనిపించకుండాపోడానికి అవకాశంవుంది. బ్యూటీ క్లినిక్స్‌లో శాస్త్రయుక్తమైన చికిత్స కూడా చేస్తారు. ఆహార నియమాలు పాటించనిదే మాత్రం ఏదీ ఫలించదు.

ఆహార నియమాలు

తాజాపళ్లు ఎక్కువగా తినడం, కొన్ని కూర గాయలు (పచ్చివయినాసరే) తినడంవల్ల ఆరోగ్యం చక్కగావుంటుంది. టమేటాలు, కేరట్, బొప్పాయి, గుమ్మడి, ఉల్లి, కాబేజి, మరికొన్ని ఆకుకూరలు లాంటివి ఉడికించిగాని, కూరచేసుకునిగాని తినొచ్చు. వేపుకుంటేగాని మీకు రుచించకపోతే చాలతక్కువ పాళ్లలో నూనె ఉపయోగించవచ్చు. పచ్చని ఆకు కూరలు చాల మంచివి. ఆరోగ్యానికి కావలసిన విటమిన్లన్నీ ఇందులో వుంటాయి. చేపలు, కోడి గుడ్లు, మాంసం కూడా మంచిది. శాకాహారులయి నప్పుడు పాలు ఎక్కువగా తాగాలి. ఉప్పు, పంచ దార, కలపని నిమ్మరసం లేదా నారింజరసం మంచి పని చేస్తుంది. తీపివస్తువులు, చాక్‌లెట్లు విడచి పెట్టడం మంచిది. వరి అన్నం, బ్రెడ్, చపాతీలు లాంటివి ఎక్కువ వేడిగా తీసుకున్నా చర్మానికి నష్టం కలగజేస్తాయి.

క్రీములు, లోషన్లు వ్రాసిపంపుతాం. అప్పుడే మీకు ఎలాంటి రంగు 'ఫవుండేషన్ క్రీమ్'కావాలో, ఏ పౌడరువాడాలో తెలుస్తుంది. మొహమాట పడకుండా పూర్తి వివరాలతో మీ సమస్యల్ని తెలియ పరిస్తే మీ పేరు ఎలానూ పూర్తిగా ప్రచురించం గనక, నలుగురికీ అందుబాట్లో వుండేట్లు సమా ధానం రాయడం కుదురుతుంది.

మీ సమస్యలకు సమాధానాలు

శ్రీమతి టి. టి., నెల్లూరు, శ్రీమతి యల్. టి. యస్, కోయంబత్తూరు, శ్రీమతి యస్. ఆర్. ఆర్, మైసూరు.

నాకు మొహంనిండా మొటిమలున్నాయి. వీపుమీద కూడా లేస్తున్నాయి. ఏం చేయమంటారు?

* పైన రాసిన వ్యాసమంతా ఇలాంటివాటి గురించే. జాగ్రత్తగా అర్థం చేసుకుని, అలాచేసి చూడండి. 'మెడికేటెడ్ సోప్', 'విటమిన్ పింపుల్ క్రీమ్' వాడిచూడండి. రాత్రి పడుకోబోయే ముందు 'విటమిన్ పింపుల్ లోషన్'తో దూదిని తడిపి అద్దండి. ఆహార నియమాలు పాటించండి.

(56 వ పేజీ చూడండి)

రాల్లో అసభ్యకరమయిన సినిమా పోస్టర్లు తీసేస్తున్నారుట. ఎందుకండీ?

ఎ. రమేష్, కరీంనగర్



మనం సభ్యులం కనుక

నాకు మంత్రి కావాలనివుంది. ఇంతకి ముందు మన మంత్రులు వాడని కొత్త పద్ధతు లేవయినావుంటే కాస్త చెప్తారా?

ఇ. సురేంద్రరాజు, కల్యాణదుర్గ్.

ఆపాత పద్ధతుల లిస్టొకసారి యిస్తారా?



నేటి చలన చిత్రాలవల్ల సమాజం బొత్తిగా పాడయిపోతోందన్న అరుపులకి బాధ్యులెవరు?

ఎ. స్వయంప్రభ, చరుకుపల్లి.

సమాజాన్ని పాడు చేయడమే ముఖ్యోద్దేశంగా గల చిత్ర విచిత్రాల మనుషులు.

మీరు పాత్రల్లో నటించరు జీవిస్తా రంటూ ఒక పత్రిక రాసింది. కాని మీరు ఇంట్లో...?

పాలర్లపూడి సత్యనారాయణ, రాజమండ్రి.

బహుమతిపొందిన ప్రశ్న

మీరు నటులు కాకుండా ఉంటే ఇప్పటికి మీ జీవితం ఎలా ఉండేది?

దావ ధనలక్ష్మి, తెనాలి.



కరణంగా వుండి కాగితాల కటలు మోస్తూ కచేరి చుట్టూ తిరుగుతుండే వాణ్ణి!

జీవించకుండా నటించడం ఎంత కష్టమో–

నటించకుండా జీవించడం అంత కష్టం—

ఇంగ్లీషు చిత్రాల్లో కార్లు, రథాలు, బళ్లు ఎంత వేగంగా పోతున్నట్టు చూపించినా సహజంగా ఉంటుంది కాని మన చిత్రాల్లో అవి ముందుకి పోతూవుంటే చక్రాలు వెనక్కి తిరుగు తున్నట్లు కనిపిస్తాయి ఎందుకండీ?

టి. సత్యనారాయణమూర్తి, విశాఖపట్నం.

చక్రం ఎటుతిరిగితే ఏం? కనీసం చక్రాలైనా ముందుకెళ్తున్నట్లు కనిపిస్తున్నాయి. అందుకు మీరు సంతోషించాలి.

గురూ! తమరు చిత్రసీమలోకి ఎందుకు ప్రవేశించారండీ?


మల్లవరపు కృష్ణ, అదిలాబాదు.

మిమ్మల్ని నవ్వించడానికి.

ప్రధాని శ్రీమతి ఇందిరాగాంధి బాలతార బేబీ పద్మినిని ఎందుకు ముద్దుపెట్టుకున్నారు?

కె. సురేంద్ర, బాపట్ల.

పిల్లలు పాపలు చల్లనివారే కల్లకపటు మెరుగని కరుణా



'ఆంధ్ర సచిత్ర వారపత్రిక'లో ప్రచురణకు ఇండియన్ ఇంక్ తో వేసిన కార్టూనులు మాత్రమే పంపాలి. సాధారణంగా 4"×2", 4"×4" చిత్రాలు పత్రికలో పడుతూ ఉంటాయి. సం॥

ఎందుకు?

మయు లే.

సెన్సారు ఎందుకు?

డి. శ్యాంబాబు, గుంటూరు.

ఉద్ధరించడానికి.

తారలకి మేకప్ ఎందుకండీ?

నామా వెంకటేశ్వరులు, ఒంగోలు.

పాత్రలకు కళ్ళొాయి ఎందుకండీ?


మగువలమీద పురుషులకి మక్కువ ఎందుకు?

జి. వరలక్ష్మి, గుంటూరు.

పూలమీద తుమ్మెదలకు ఆశ ఎందుకు? అయినా పురుషుల మీద మగువలకు మక్కువ తక్కువా?

అందాని వోరచూపుకే ఈ జగాన వోడి పోని ధీరుడెవడు?

ఇ. టి. రామారావు, కావలి.



పసిపిల్ల వాడు. పస లేనివాడు.


సార్! మీ హాస్యం బరువెంత? మీ నటన ఎత్తు ఎంత? మీ హృదయం లోతెంత?

గొరపాటి స్వరాజ్యలక్ష్మి, ముదినేపల్లి.

మీ సంస్కార మంత? మీ సంతోష మంత! మీ హృదయంలో నాకున్న చోటంత.

సినిమాతార కార్యదర్శి, కారు డ్రయివరు వీరిద్దరిలో ఎవరి కెక్కువ పలుకుబడి?


ఎన్. సి. బాబు, హైదరాబాదు.



ఎంత చెట్టు కంత గాలి.

నన్ను మీతో చేర్చుకుంటారా?

ఎస్. వి. ఆర్. కె. సత్యనారాయణమూర్తి, ఏలూరు.



"ఆశ్రమం పెట్టిన తరువాత తప్పకుండా!

పద్మనాభం



''గోపాలుడు - భూపాలుడు''లో రాజశ్రీ, యన్. టి. రామారావు.

చిత్రసమీక్ష :

గోపాలుడు - భూపాలుడు

మన జానపద కథలు వీర రసాత్మకాలు, సాహసోపేతాలూను. ఈ రకం శౌర్యస్పంతా శృంగారంతో ముంచెత్తిన చిత్రం 'గోపాలుడు భూపాలుడు.'

జానపద చిత్రాల్లో కథ అడక్కూడదు. 'సువ్వా సినిమాచూశ్లేదా? ఇది చూశ్లేదూ?' అనే తిరుగు ప్రశ్నలు వస్తుంటాయి. అంచేత చూసి ఆనందించడమే ప్రధాన లక్ష్యం.

అనగాఅనగా ఒక రాజుగారు. ఆయనకు లేకలేక కవల పిల్లలు కలిగారు. స్వంత తమ్ముడు ఆయన ప్రాణాలు తీస్తాడు. వంశ పారంపర్యంగా జరుగుతున్నదే ఇది! దాంతో కీర్తిశేషుని భార్యకు జ్ఞానోదయమవుతుంది. ఫలితంగా కవలపిల్లల్ని వేరు చేస్తుంది. కోటలో పెరిగిన వాడు భూపాలుడు, కోనతో పెరిగిన వాడు గోపాలుడు. గోపాలుడు రాకుమారిని ప్రేమిస్తే భూపాలుడు పల్లెపిల్లను ప్రేమిస్తాడు. ఇక్కడ, గుణమే ప్రధానం అన్న సత్యం వెల్లడవుతుంది! బోల్డన్ని కత్తియుద్ధాలు, శృంగారాలు, చిద్విలాసాలు అయిన తరువాత రాజమాత సంకల్పాన్ని విఫలం చేస్తూ అన్నదమ్ములిద్దరూ హాయిగా వుంటారు. కథ కంచికి, మన మింటికి వెళ్తాం. ఎక్కడో చదివినట్టూ చూసినట్టూ అనిపిస్తూ వుంది కదూ?

యన్. టి. రామారావు గోపాలుడు, భూపాలుడుగా ద్విపాత్రాభినయం చేశారు. రెండు పాత్రల్లోను మెచ్చుకోదగిన నటననే కనబరిచారు. ఇక్కడ కెమెరా పనర్కును కూడా అభినందించాల్సి వుంటుంది. తెర నిండా రామారావే కన్పిస్తారు గనక చిత్రం చూసిం తర్వాత జ్ఞాపకం వుంచుకోవలసిన వాళ్ళు ఇక ఆట్టే వుండరు. ఉంటే ఆకర్షణీయమైన దుస్తుల్ని సమకూర్చిన నిర్మాతలూ సెన్సార్‌బోర్డూను. గొల్ల గోపన్న సాహసకృత్యాలు, భూపాలుని శృంగార వినోదాలు ఒక ప్రత్యేక ఆకర్షణ. పల్లెపిల్లగా జయలలిత, పద్మావతిగా రాజశ్రీ అందంగా నటించారు. గొల్ల మంగమ్మగా హేమలత నటన సహజంగా వుంది. తక్కిన తారాగణం: రాజనాల, పద్మనాభం, అల్లు రామలింగయ్య, మిక్కిలినేని, యస్. వరలక్ష్మి, వాణిశ్రీ మున్నగువారు.

సెట్టింగులూ చిత్రీకరణ బాగున్నాయి. అందరికీ నచ్చకపోయినా కొందరికి కన్నుల పండుగ్గానే వుంటుంది. సంగీతంలో ప్రత్యేకత వుంది.

ఈ చిత్రానికి కథ, సినిమా అనుకరణ: యస్. భావనారాయణ, మాటలు: పాలగుమ్మి పద్మరాజు, పాటలు: సి. నారాయణరెడ్డి, కొసరాజు, సంగీతం: కోదండపాణి, కెమెరా: హెచ్. యస్. వేణు, కూర్పు: కె. యస్. ఆర్. దాస్, దర్శకుడు: జి. విశ్వనాథం, నిర్మాత: వై. వి. రావ్.

—సి. కనకాంబరరాజు ●

చిత్రలహరి

జనవరి 12వ తేదీన ప్రజలను, ముఖ్యంగా చలనచిత్ర పరిశ్రమను కల్లోలపరిచే విపరీత సంఘటన ఒకటి జరిగిపోయింది. ప్రసిద్ధ తమిళ సినిమానటుడు శ్రీ ఎం. జి. రామచంద్రన్‌ను—విలన్ నటుడు ఎం. ఆర్. రాధా పన్నెండో తేదీ సాయంకాలం ఒక చిత్రం విషయంలో ఏర్పడిన వివాదం మూలంగా రివాల్వర్‌తో కాల్చి, ఆ తర్వాత తనని తనే కాల్చుకున్నాడనేది యీ సంఘటన! ఎం. జి. ఆర్‌కు చెవి దగ్గర గాయమయింది. ఎం. ఆర్. రాధ తనను తానే కాల్చుకోవడంతో మెడ మీద, కణత దగ్గర గాయాలు తగిలినట్లు చెప్పబడుతున్నది. మొదట వీరిరువురినీ రాయపేట ఆస్పత్రిలో చేర్చారు. వారి పరిస్థితి ప్రమాదకరంగా పరిణమించినందున జనరల్ హాస్పిటల్‌కు మార్చారు. వెంటనే వారికి శస్త్రచికిత్స చేసి తుపాకీ గుళ్లను యివతలికి తీశారనీ, ప్రమాదస్థితి నుంచి బయటపడ్డారనీ తెలుస్తున్నది. హత్యా



ఎమ్. జీ. రామచంద్రన్, ఎమ్. ఆర్. రాధా.

ప్రయత్నానికీ, ఆత్మహత్యా ప్రయత్నానికీ ఎం. ఆర్. రాధాను అరెస్టు చేయటం జరిగిందని ఐ. జీ. శ్రీ ఎఫ్. వి. అరుల్ పేర్కొన్నారు.

ఈ నటులిద్దరికీ రాజకీయరంగంతో సంబంధం ఉంది. ఎం. జి. ఆర్. ద్రావిడ మున్నేట్ర కజగానికీ, ఎం. ఆర్. రాధా ద్రావిడ కజగానికీ చెందిన వ్యక్తులు. ఎం. జి. ఆర్. ద్రా. ము. క. తరఫున 'సెయింట్ తామస్ మవుంట్, నియోజకవర్గం నుంచి రాష్ట్ర అసెంబ్లీకి వచ్చేఎన్నికలలో పోటీ చేసేందుకు పార్టీ స్థానం యిచ్చింది. పై సంఘటనకు రాజకీయాల ప్రమేయం కూడ వుంది అని కొందరంటున్నారు కాని, డిప్యూటీ కమీషనర్ ఆఫ్ పోలీస్ శ్రీ కె. పరమేశ్వరమీనన్ 'ఈ సంఘటన వెనుక రాజకీయ ప్రయోజనం ఉన్నట్లు తమకు వార్త ఏదీ అందలేదని' చెప్పినట్లు తెలుస్తున్నది. ఏమయినా యీ విష



"కాంభోజరాజుకథ"లో ఎల్. విజయలక్ష్మి, శోభన్‌బాబు.

చిత్రలహరి

యం పరిశ్రమలోను, ప్రజల్లోను పెద్ద అలజడినే సృష్టించింది.

* * *

నవజ్యోతి ఫిలిమ్స్‌వారి ద్వితీయచిత్రం షూటింగ్ ఈ 10 నుంచి వీనస్ స్టూడియోలో ప్రారంభించారు. ఈ చిత్రానికి "ఇదా ప్రపంచం" అని నామకరణం చేశారు. గుమ్మడి, చలం, భారతి, గీతాంజలి, సత్యన్నారాయణ, నాగయ్య, అల్లురామలింగయ్య, చదలవాడ, డా. శివరామకృష్ణయ్య, బేబీ ఇందిర, బేబీ మల్లిక, సూర్యకళ, రాజరత్నం నటిస్తున్న యీ చిత్రానికి భమిడిపాటి రాధాకృష్ణ సంభాషణలు రాశారు. సంగీతం: టి.చలపతిరావు, కెమెరా: లక్ష్మణ్ గోరే, దర్శకుడు: ఎం. మల్లికార్జునరావు, నిర్మాతలు: ఎం. సాంబశివరావు, జి. వందనం. ఉగాది కానుకగా యీ చిత్రం ఈస్టిండియా ఫిలిం కంపెనీవారి ద్వారా విడుదల అవుతుంది.

* * *

అంతా కొత్తవారితో ఒక చిత్రం తయారవుతున్నది. సాంకేతిక నిపుణులు కూడ కొత్తవారే! అది నవయుగ చిత్రంవారి సాంఘికం. ఈ చిత్రానికి సంబంధించిన రెండు పాటలను యిటీవల అరుణాచలం స్టూడియోలో రికార్డ్ చేశారు. ఒకటి: 'లేదు, లేదు నాసఖీ,' మరొకటి: 'కన్నులు కన్నులు కలిశాయి' అనేవి. మొదటి పాటను ఆర్. కామేశ్వరరావు, రెండవ దానిని కామేశ్వరరావు, సరోజ కలిసి పాడారు. సంగీత దర్శకుడు: లక్ష్మీనారాయణ, దర్శకుడు: ఏ. మధుసూదనరావు. ఈ యువకుడు చిరకాలంగా దర్శకుడు శ్రీ తిలక్ వద్ద సహాయకుడుగా పని చేస్తున్నవాడు. గట్టివాడు.

* * *



"భక్త ప్రహ్లాద"లో డా. శివరామకృష్ణయ్య, కనకం.

"మా కొత్త డాల్మేషియన్‌ని చూశారా?", అంటూ అడిగింది శ్రీమతి జమున—యీ 12వ తేదీ సాయంకాలం ఆమెను కలుసుకున్నపుడు "పూల రంగడు" చిత్రం షూటింగులో పాల్గొనేందుకు 3వ హైదరాబాద్ వెళ్లి ఆ రోజున తిరిగిరావడం జరిగింది. "లేదు, డాల్మేషియనా?" అడిగాను. "మాకొత్త కుక్క పేరు అది. హైదరాబాద్ నుంచి తెచ్చాను. చిరుతపులి మచ్చలతో, చక్కగా యింత ఎత్తున వుంది. ఈ గోడ మీంచి దూకేసిందండీ!" అన్నదామె ఆశ్చర్యంగా ఎదురుగా వున్న గోడను చూపిస్తూ. ఆ డాల్మేషియన్ సమయానికి అక్కడ



"విరోధి"లో సావిత్రి.


లేకపోవడం వల్ల ఆరోజున నేను చూడటం పడలేదు'

*   *   *

మాధ్య ప్రసాద్ ప్రొడక్షన్స్ వారి హిందీ చిత్రం "మిలన్" (మూగమనసులు) ప్రసక్తి వచ్చింది. ఆచిత్రం గురించి శ్రీమతి జమున మాట్లాడుతూ "మిలన్ నేను చూశాను. దర్శకుడుగా ఆదుర్తి సుబ్బారావుగారి అద్భుతమైన పనితనం అడుగడుగునా ద్యోతకం అవుతుంది. ఈ చిత్రం విడుదలానంతరం సుబ్బారావుగారు అఖిలభారత ప్రముఖ దర్శకులలో ఒకరుగా పరిగణించబడుతారనేది ఖాయం." అన్నది.

*   *   *

నిజమే! ఆమె చెప్పిన దాన్లో ఎంతో సత్యం ఉంది. ఆదుర్తి సుబ్బారావుగారిలో అంతటి మేధాసంపద, ప్రతిభ ఉన్నవి. గతనెల 28న అన్నపూర్ణా పిక్చర్స్



''పిన్ని''లో కంతారావు, దేవిక.

చిత్రలహరి

అధినేత శ్రీ దుక్కిపాటి మధుసూదనరావుగారు కూడ యీ చిత్రం గురించి నాతో చెప్పారు. సుబ్బారావుగారు ఎంతో చక్కగా తీయడమేగాక, మన జమున కూడ చాలా అద్భుతంగా చేసిందనీ అన్నారు. ముఖ్యంగా రంగుల్లో జమున మరింత అందంగా కనిపించిందని రష్షెస్ చూసిన కొందరు అంటున్నారు.

*   *   *

జనవరి 4వ తేదీన శ్రీమతి సావిత్రి, 7వ తేదీన బి. సరోజాదేవి—తమ పుట్టినరోజు పండుగలను తమ తమ స్వగృహాలలో ఘనంగా జరుపుకున్నారు.


*   *   *

జనవరి మొదటి తేదీన హైదరాబాద్ రవీంద్ర భారతిలో శతచిత్ర సుందరుడు శ్రీ కాంతారావుకు, పంచశీల సాంస్కృతిక సంఘంవారు సన్మానం జరిపి "నటప్రపూర్ణ" బిరుదు ప్రదానం చేశారు. ప్రసిద్ధ నటుడు శ్రీ అక్కినేని నాగేశ్వరరావు యీ సభా ప్రారంభకులు. ఆయన తన ప్రసంగంలో శ్రీ కాంతారావు చక్కని నటుడేగాక, స్వభావంలో కూడ చక్కని వారనీ, వారు తమ నివాసాన్ని హైదరాబాద్‌కు మార్చవలసిందిగా సూచించారనీ తెలుస్తున్నది.

*   *   *

యస్. వి. రంగారావు, గుమ్మడి, జమున, హరనాథ్, అంజలీదేవి, రామకృష్ణ, రమణారెడ్డి, రమాప్రభ, సూర్యకాంతం ముఖ్యభూమికలు పోషిస్తున్న యస్. వి. ఆర్. ఫిలిమ్స్ వారి సాంఘికానికి "చదరంగం" అని పేరు పెట్టారు. మొదటి రెండు షెడ్యూల్సులోను యీచిత్రం అయిదురీళ్లు తయారయిందని దర్శకుడు శ్రీ యస్. వి. రంగారావు నాతో చెప్పారు. మూడవ షూటింగ్ షెడ్యూలు యీ 20 నుంచి ఆరంభం కానున్నది.

—మోహన్‌కుమార్



''అడవియోధుడు' లో ఒక దృశ్యం.







పాల్ టేలర్ బృందంలో జనెట్ ఆరన్.

పాల్ టేలర్ నృత్య బృందం

పాల్ టేలర్ బృందంలో కెరొలైన్ యాడమ్స్.

ఆధునిక అమెరికన్ నృత్యకళలో మంచిపేరు తెచ్చుకొన్న పాల్ టేలర్ నృత్యబృందంవారు జనవరి 28, 29 తేదీలలో మద్రాసు మ్యూజిక్ అకాడమీ హాలులో నృత్య ప్రదర్శన లిస్తారు.

ఈ బృందంలో ఆరుగురు నాట్యకత్తెలు, ముగ్గురు నర్తకులున్నారు. పాల్ టేలర్ ఈ బృందం నాయకుడు.

1964 లో పారిస్‌లో జరిగిన అంతర్జాతీయ నృత్యోత్సవాలలో అమెరికా తరఫున పాల్గొనే అవకాశం ఈ బృందంవారికి లభించింది. ఆ తరువాత ఈ బృందం లండన్‌లో డేమ్ మార్గట్ ఫోంటేన్ రాయల్ గాలామాటినీలో నృత్య ప్రదర్శన లిచ్చింది. ఈ అవకాశం లభించిన తొలి ఆధునిక అమెరికన్ నృత్యబృందం ఇదే.

"పాల్ టేలర్ బృందంవారి నృత్య ప్రదర్శనలను ఒకసారిచూస్తే మరి మరచిపోరు. రెండవసారి చూచినవారు అభిమానులై పోతారు. మూడోసారిచూస్తే ఈ బృంద నృత్యానికి దాసులై పోవలసిందే"నని లండన్ టైమ్స్ పత్రిక ప్రశంసించింది.

ఆంధ్రసచిత్రవారపత్రిక
పాఠకులకు మనవి

రూపాయి విలువతగ్గింపు ఫలితంగా విదేశాలనుండి దిగుమతియగు న్యూస్‌ప్రింటుతోపాటు ఇతర యంత్రసామగ్రిల వెలలు కూడ విపరీతముగా పెరిగాయి. ఈ కారణంగా భారత దేశంలోని వార్తాపత్రికలన్నీ అనేక సమస్యల నెదుర్కొంటూ పత్రికా ప్రచురణ సాగించవలసి వస్తుందనే విషయం మా పాఠకు లందరకు తెలిసినదే.

"ఇండియన్ అండ్ ఈస్టరన్ న్యూస్‌పేపర్ సొసైటీ" వారి సలహా ననుసరించి ఆంధ్రసచిత్రవార పత్రిక వెలను 10—2—67తేదీ నుండి 35 పైసల నుండి 40 పైసలకు పెంచడమైనది.

పత్రికా సంస్థల యొక్క పరిస్థితులను మాపాఠకులు, న్యూస్‌ఏజంట్లు గుర్తించి ఎప్పటివలె మాతో సహకరించవలసిందిగా కోరుచున్నాము.

గమనిక:— ప్రస్తుత చందా మొత్తములు కొత్తరేట్ల కనుగుణంగా సవరించబడుతాయి.

చందా వివరాలు

	పోస్టుద్వారా	ఏజంటుద్వారా
	రూ. పై.	రూ. పై.
సంవత్సర చందా	22—40	20—80
అర్ధ సంవత్సరం ,,	11—20	10—40
మూడు మాసములు	5—60	5—20

మేనేజరు
ఆంధ్రపత్రిక

ఉత్తరాలు

(4 వ పేజీ తరువాయి)

శర్మగారు. అంటే, కుందేలు నుంచి గుర్రం రూపొందింది, లేక పరిణామం చెందిందని అనువాదకుల అభిప్రాయమా? శర్మగారు అలాగే భావిస్తున్నారా? మాతృకలో అలాగేవుందా? కుందేలు ఒక 'లాగోమార్ఫ్'. దీనినుండి గుర్రాలు పెరిస్సొడాక్టయిల్స్ పరిణామం చెందాయా?

(3). అకశేరుకములు, సకశేరుకములు గురించి వివరించారు. నేను రాసింది దానిగురించికాదు. మరొకసారి గమనించ కోరుతాను. "పక్షులు సకశేరుకములు ఉష్ణరక్తము కల్గినవి" అని అన్నారు. వెన్నెముకకల ప్రాణులన్నీ ఉష్ణరక్తమును కల్గినవా?

(4). "పక్షులు, పాములు సకశేరుకములు" అని రాసి, "వాటి శరీరంనిండా ఏకజీవకణ శరీరులైన, ఆదిమజీవులు పాములు ఉంటాయి"అన్నారు. పైన పాములు అన్నారు, కిందా పాములు అన్నారు. పాము శరీరములనిండా పాములు అన్నారు.

(5). "ఎంటరాన్ అంటే ప్రేగుకాక మరేమిటి?" అన్నారు. ఎంటరాన్ అంటే ప్రేగు కాదు. Enteron అంటే intestine కాదు. కాని వారు అలా జంతుశాస్త్రంలో నేర్చుకొన్నాం అన్నారు. 'ఎంటరాన్' అంటే 'ఎలిమెంటరీకనాల్'. Mouth మొదలు Anus వరకు ఏలిమెంటరీకనాల్ లేక జీర్ణనాళము. ప్రేగులు అంటే intestine మాత్రం. ఇంటస్టిన్‌లు ఎలిమెంటరీకెనాల్‌లో ఒకభాగంమాత్రం.

(6). బార్నకల్ ఒక క్రస్టేషియను. శంకరనారాయణ డిక్షనరీలో ఇచ్చినంతమాత్రాన అది పత్తజాతికాదు. జంతు శాస్త్రంలో పరిచయం ఉన్నవారి కెవరికైనా ఇది అసందర్భం అని తెలుస్తుంది. అనువాదకులు జాగ్రత్తవహించిఉండాల్సింది.

(7). పక్షులమలము (గ్వానో) గురించిరాస్తాను. పుస్తకంలో ఇలావుంది. "ఆ దీవుల చుట్టూ ఉండే జలములలో ఒక జాతి రొయ్యలు విరివిగా ఉంటవి. ఆ రొయ్యలకోసమే పై జాతి పక్షులు ఆ దీవులలో నివాసం ఏర్పరుచుకొన్నవి. సముద్ర పక్షుల మలమును గ్వానో (Gwano) అంటారు. అక్కలాడి పిల్ల పక్షులకు ఆహారం సమకూర్చవలసిన తల్లి పక్షులు, ఆ ద్వీపజలములలో విరివిగా లభించే ఈ దివ్యప్రసాదమును గుమికూడి తెగతింటవి." (49). ఇలా రాసినప్పుడు ఆ మలమునే పక్షులు తింటాయని అర్థం వస్తుందికదా! అక్కడ గ్వానో గురించి రాయడంవల్ల పాఠకులకు తికమక వస్తుందని నాభావం.

8 వ భాగంలో ఉదాహరణలు ఇవ్వడంలో పూర్తిగా వాక్యం అంతా ఇచ్చినా, సబ్జక్టు తెలియని వారికి ఎలాగా అర్థంకావు. "కొన్నిపదాలు వూడతీసి" రాసినా, సబ్జక్టు బాగా తెలిసినవారికి అర్థం అవుతుంది. ఆ భావంతోనే నేను అలారాసాను. అసలు ఉదాహరణలు ఇచ్చేటప్పుడు చాలమంది అవసరమైనపదాలనే ఇస్తారుకాని పూర్తివాక్యాలు ఇవ్వరు.

శర్మగారు చూపించిన 7, నేను మొదట విమర్శలో వివరించిన ఎనిమిది వారు అర్థం చేసు

కొన్నారని నేను భావిస్తాను.

పుస్తకంలోని తప్పులు డా. రావుగారు సరి దిద్దిస్తే ఇది ఉత్తమ పుస్తకం అవుతుందని నేనూ, శర్మగారిలాగే భావిస్తున్నాను. డా. రావుగారు ఎన్నో ఉత్తమమైన వ్యాసాలు రాసారు. సామాన్య పాఠకుల యొక్క అభిమానాన్నే కాక, పెద్ద పెద్ద వైద్యుల మన్నలను పొందారు. వారి ఈ పుస్తకం కూడా అందరూ చదవదగినదని, జ్ఞానం పొందగల పుస్తకమని నేను మొదట సమీక్షలో చెప్పిన మాటలనే పునశ్చరణ చేస్తున్నాను.

జమ్మి కోనేటిరావు, లెక్చరరు, గవర్నమెంటు ఆర్ట్సు కాలేజి, కడప.

గోల్డ్ ఫింగర్

'శ్రీ ఐయాన్ ఫ్లెమింగ్' రచించిన 'గోల్డ్ ఫింగర్' అనే డిటెక్టివ్ సాహిత్యాన్ని మీరుబొమ్మలతో సహా ప్రచురించగా చూసి చాలా సంతోషించాను. ఆంగ్లం రాని అనేక ఆంధ్రయువతీ యువకులకు ఆభాషలో పేరు ప్రఖ్యాతులు కీర్తితో బాటు ధనం గణించి పెడుతున్న ఒకానొకమంచి అపరాధ పరిశోధక నవలని తెలుగులో అందించుతున్న మీకృషికి నేను చాలా సంతోషిస్తున్నాను. ఈవిధంగా ఆంధ్రపాఠక లోకం యొక్క అభిరుచుల పరిధిని వైశాల్యం చేసి ప్రపంచసాహిత్యాన్ని ఇలా అందిస్తున్న మీకు నామనఃపూర్వక అభినందనాలు.

రుద్రావరుల విశ్వేశ్వరరావు (పాండిచేరి)

వ్యా సా లు

23—12—66 సంచికలో శ్రీమతి పి. సుశీల గారిని పరిచయం చేశారు. ఇందుకు మిమ్మల్ని అభినందిస్తూ, నాచిరకాలవాంఛితంబైన అవకాశం ఈ నాటికి కలిగించినందుకు నాహృదయాభివందనలు అందజేసు కొంటున్నాను. ముఖ్యంగా నాది మరొక కోరిక! మీ "వనితాలోకం" పేజీలు వ్యక్తిగత పరస్పర సంవాదసమ్మిశ్రిత సంగర సంగమం కాకూడదని! "వనితాలోకం" వనితాభ్యుదయము నిత్య జీవితావసరములు ప్రధానాంశములుగా గల వస్తువులపై వ్యాసములు వెలువరింప ప్రార్థన. చూడండి—సృజనాత్మకమైన వస్తువుపై వెలువడేవ్యాసాలు సుఖమయంగా ఉంటాయి పలువురికి ! కాని—కాంతాద్వయకలహ కాండ దండగ తప్పిస్తే ఏమంటుంది ?

ఒక పాఠకురాలిగా నా కోరిక మన్నిస్తారని భావిస్తున్నాను.

లేఖా రచనాను భవం ఏమాత్రమూ లేని ఈ నా లేఖలో దోషములున్న మన్నించ వేడుక !

విజయేశ్వరి (రూర్కేలా)

సీరియల్

"ప్రథమంగా మీ పత్రికలో ధారావాహికంగా ప్రచురింప బడిన శ్రీ పిలకా గణపతి శాస్త్రిగారిచే రచింప బడిన 'విశాల నేత్రాలు' నవలకు సాహిత్య అకాడమీ వారి బహుమతి లభించడం అత్యంత ఆనంద దాయకంగా నున్నది. కాని మీరింత వరకు దానిని గుర్తించక పోవటం శోచనీయం.

'సుప్రభాతం' సీరియల్ మొదటిరెండు పత్రి

కలలోనూ బాగుంది. తరువాత చదువరులకు విసుగెత్తిస్తుంది.

ఆర్. సంగమేశ్వరరావు, (బొబ్బిలి)

* * *

శ్రీ రంగధావ్‌గారి 'సుప్రభాతము' ప్రస్తుత సంఘములో వున్న కల్మషములను బహిరంగము చేయుటకు చాల యుపయోగపడుచున్నది. దీనికి రచయిత గారికి నా కృతజ్ఞతలు. కాని ఈ వారము ప్రచురించిన "సుప్రభాతము" యొక్క భాగములో రచయిత తప్పటడుగు వేసినారు. స్వచ్ఛమైన నీరు విద్యుచ్ఛక్తిని తన గుండా ప్రసరింపనీయదు. దానికి కొంత ఆమ్లము కలుపవలసి యుంటుంది. కాని రచయిత తమ నవలలో సుకుమార్ విద్యుచ్ఛక్తి ప్రసరించుచున్న నీటిలో చేతిని పెట్టగానే 'షాక్' కొట్టి చనిపోయినట్లు వ్రాసినారు. ఇటువంటి విషయములలో కొంత రసాయనిక అనుభవము యుండుట మంచిదని నా అభిప్రాయము. ఇకనైనా ఇటువంటి తప్పులు చేయకుండ తమ రచనలన్న అందజేయగలరని ఆశిస్తూ యున్నాను.

ఎం. డి. గౌస్ (బొబ్బిలి)

వెంటాడుకిపేత

జవాబులు

(44-వ పేజీ తరువాయి)

(క) చతుర(స్రా)కారంలో రెండువక్కలూ యుద్ధానికి బయలుదేరేయి కనుక, ఆ సైన్యాలు వర్గసంఖ్యలో ఉండాలి. నవరలు x^2, నాగులు y^2 అనుకోవచ్చు. వీటి భేదం 512. కనుక $x^2 - y^2 = 512$. x, y లు పూర్ణసంఖ్యలేకాని భిన్నములు కాకూడదు. పై సమీకరణానికి నప్పే సంఖ్యలు వెతికి పట్టుకోవాలి. అటువంటివి నాలుగు జతల సంఖ్యలున్నాయి.

$129^2 - 127^2 = 16641 - 16129 = 512.$

$66^2 - 62^2 = 4356 - 3844 = 512.$

$36^2 - 28^2 = 1296 - 784 = 512.$

$24^2 - 8^2 = 576 - 64 = 512.$

పైగా నవరలలో సగంమంది చనిపోగా, నాగులు 200 లోపుగా చనిపోతే ఆ రెండు సైన్యాలూ సమానమయాయిట. ఈవరకు నరిపోయే సంఖ్యలు 1296 (నవరలు), 784 (నాగులు) మాత్రమే.

(చ) మొత్తం 367 మంది. ఈ సమస్యకు సామాన్య రూపం ఇలా వ్రాయవచ్చు. 1155 లోపున ఏదో ఒక సంఖ్య తీసుకుని, దానిని 3, 5, 7, 11 లచే భాగించగా "క,చ,ట, త" అనే శేషాలు మిగిలితే ఆసంఖ్య ఏది?

$(385 \times క + 231 \times చ + 330 \times ట + 210 \times త)$ అనే సంఖ్యని 1155 చే. భాగించగా మిగిలే శేషమే ఆసంఖ్య. మన సమస్యలో ఈసూత్రాన్ని ఉపయోగిస్తే 367 వస్తుంది చూడండి.

(ట) 24 గంటలు పడుతుంది.

(త) పది నిమిషాలలో పది గొర్రెలు దాటేయి. అంటే మొదటి గొర్రె దాటడానికీ, పదో గొర్రె దాటడానికే మధ్య వ్యవధి 10 నిమిషాలు. కనుక రెండో దాట్లకి మధ్య వ్యవధి 10/9 నిమిషాలు. ఒక గంటలో ఇటువంటి వ్యవధులు $\frac{60 \times 9}{10} = 54$ ఉన్నాయి. కనుక గంటలో 55 గొర్రెలు దాటుతాయి.

(ప) 15 రూ. 36 పైసలకి అమ్మేడు. ప్రతిసారి అంతకుముందున్న ధరలో 20% తగ్గిస్తూ వచ్చాడు.

ఎప్పుడూ అందంగా...

(45 వ పేజీ తరువాయి)

'తదితరమైనవి'నియమబద్ధంగా అయేలా చూడండి.

శ్రీమతి పి. యస్. యమ్., హైదరాబాద్.
శ్రీమతి కె. పి. ఆర్. గుంటూరు.

నా తలవెంట్రుకలు నిటారుగా వుంటాయి. పైన మాత్రమే ఉంగరాల జుట్టు చేసుకోడానికి వీలవుతుందా? ఎక్కడ ఈ పద్ధతివుంది? ఎన్నాళ్ల వరకు ఉంగరాల జుత్తు నిలబడుతుంది?

* మీకు కావలసిన పద్ధతిలో మీ జుత్తును రింగులు తిప్పుకోవచ్చు. ఇంటిదగ్గర చేసుకోడానికి కుదరదుగాని, మంచి 'బ్యూటీ క్లినిక్'లో ఎక్కడైనా చేస్తారు. మా క్లినిక్‌లో ఈ ఏర్పాటు వుంది. ఉంగరాలజుత్తు సుమారు ఆరునెలలవరకు నిలబడివుంటుంది.

శ్రీమతి టి. ఇ. యస్., కుమారి టి. యమ్., విజయవాడ.

* మీ ప్రశ్నలకు అంతరంగికంగా సమాధానాలు ఇవ్వాలని రాశారు. మీ అడ్రసు పూర్తిగా రాయలేదు. ఇంకా వివరాలు రాస్తూ సంప్రదించండి.

శ్రీమతి బి. కె., విజయవాడ.

'బ్యూటీ థెరపీ' గురించి నేర్చుకుందామని వుంది. మనదేశంలో ఇలాంటి ఇన్‌స్టిట్యూట్‌లు ఎక్కడున్నాయి? నాకు ముప్పయ్‌అయిదేళ్లు.'బ్యూటీ స్పెషలిస్టు' అవాలనివుంది. సహాయం చేయగలరా?

* ఆడవాళ్లకు తగిన వృత్తే మీరు కోరుకుంటున్నారు. అభిలషణీయమైనదే. బొంబాయిలో ఒకటి రెండు ఇలాంటి ఇన్‌స్టిట్యూట్‌లున్నాయి. మద్రాసులో నేనే స్వయంగా నడుపుతున్నాను. రు. 150 దగ్గర్నుంచి రు. 300 వరకు ఫీస్ కట్టుకోవాలి. ఒక సంవత్సరంలోగా కోర్సు పూర్తవుతుంది. కష్టమయినా ఆసక్తిజనకంగా వుంటుంది. పూర్తి వివరాలకు రాయండి.

సమస్యలు శ్రీమతి విద్య, బాక్స్ నెం. 1000. కేరాఫ్ ఆంధ్రపత్రిక, మద్రాసు—1. కి పంపాలి.

Edited, Printed and Published by S. Radhakrishna at the Andhra Patrika Press; 6 & 7, Thambu Chetty Street, Madras-1. Chief Editor: S.Sambhu Prasad.



శ్రీలలిత

అందమైన ముఖ వర్చస్సునకు
ఎక్కువ కాలం నిలిచె పరిమళమునకు

రెమి ®

టాల్కమ్ పౌడరు

Manufacturers: REMY PERFUMS PRIVATE LIMITED
263, Thambu Chetty St., Madras-1